

అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో యువకుడు బలి

మూసీ పరిసరాల్లో నిర్మాణాలు చేపట్టొద్దు

లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 282 | గురువారం | 03-04-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

## బిసిల కోటా పెంచకుంటే

# ఎర్రకోటపై జెండా ఎగరేస్తాం

బలహీన వర్గాల రిజర్వేషన్ల పెంపునకు బిజెపి విధానపరంగా వ్యతిరేకం. మొరార్జీ దేశాయ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మండల్ కమిషన్‌ను నియమిస్తే, విపి సింగ్ మండల్ కమిషన్ దుమ్ము దులిపి ముందుకు తీసుకొచ్చారు. మండల్ కమిషన్‌పై బిజెపి కుట్ర చేసి, కమండల్ యాత్ర మొదలు పెట్టింది.. ఆ కమండల్ యాత్ర ప్రతినిధే నరేంద్ర మోదీ. బిసి రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదిస్తే తెలంగాణ రాష్ట్రంలో 10 లక్షల మందితో సభ ఏర్పాటు చేసి, ప్రధానమంత్రి మోదీని సన్మానిసాం.

– సిఎం రేవంత్‌రెడ్డి

- తెలంగాణలో 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలుకు పార్లమెంటులో చట్టాలను సవరించాల్సిందే
- లేకుంటే ప్రధాని మోదీ గద్దె దిగాలి
- రిజర్వేషన్లు అమలుచేయని పక్షంలో గల్లీలో బిజెపి గద్దెలు కూల్చాల్సిందే
- ఢిల్లీలో బిసిల పోరుగర్జన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటన




ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలుకు పార్లమెంట్‌లో చట్టాలను సవరించక పోతే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గద్దె దిగాలని, లేదంటే గల్లీలో బిజెపి గద్దెలను కూల్చాల్సిందేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం బలహీన వర్గాల రిజర్వేషన్లు పెంచకపోతే ఎర్రకోటపై జెండా ఎగురవేసి, రిజర్వేషన్లు సాధిస్తామన్నారు. "విద్యా, ఉద్యోగాలతో పాటు చట్ట సభల్లో బిసిలకు రిజర్వేషన్లను పెంచుతూ తెలంగాణ శాసనసభ ఆమోదించిన బిల్లులను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని" కోరుతూ బిసి సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం "బిసిల పోరు గర్జన సభ" జరిగింది. ఈ సభకు తెలంగాణ డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సిపిఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ,రామకృష్ణ పాండ, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్‌కు చెందిన ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, సీనియర్ నాయకులు,వివిధ బిసి సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సభనుద్దేశించి సిఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ చట్టసభలల్లో మెజారిటీ లేకపోయినప్పటికీ 'ట్రిపుల్ తలాక్, 370 ఆర్టికల్‌రద్దు, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను దేశ ప్రజలపై కేంద్ర ప్రభుత్వం రుద్దిందని, కానీ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు సమర్థించిన బిసి రిజర్వేషన్ల పెంపు తీర్మానానికి ఎందుకు అనుకూలంగా ఉండబోరని సిఎం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంపైన ఆధిపత్యం చెలాయించాలనుకున్న నిజాంలకు, గడీల దొరలకు ఏమైందో తెలుసుకోవాలని ఆయన ప్రధానికి సూచించారు. బుక్కెడు బువ్వ పెట్టినా, మంచినీళ్లు ఇచ్చినా మర్చిపోని బలహీన వర్గాలను తరువాయి 2లో

# మైనారిటీలను విచ్ఛిన్నం చేసేందుకే



- వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ మౌలిక స్వరూపంపై దాడి
- లోక్‌సభలో తీవ్రంగా ప్రతిఘటించిన 'ఇండియా' కూటమి
- బిల్లు తేవాల్సిన అవసరం ఏమిటి? నిలదీసిన గొగోయ్
- ప్రతిపక్షాల అభ్యర్థనను తోసిపుచ్చిన స్పీకర్



న్యూఢిల్లీ : లోక్‌సభలో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును 'ఇండియా' కూటమి తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ బిల్లు రాజ్యాంగ మౌలిక స్వరూపంపై, భారత సమాఖ్య వ్యవస్థపై చేస్తున్న దాడిగా పేర్కొంది. రాజ్యాంగం విలువను తగ్గించడం, మైనారిటీ వర్గాలను అప్రతిష్ఠపాలు చేయడం, భారత సమాజాన్ని విభజించడం, మైనారిటీ వర్గాలను విచ్ఛిన్నం చేయడం అనే నాలుగు లక్ష్యాలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ సవరణ బిల్లు తీసుకువచ్చిందని 'ఇండియా' కూటమి పార్టీల ఎంపీలు లోక్‌సభలో తీవ్రస్థాయిలో ప్రతిఘటించారు. అసలు ఈ బిల్లును తీసుకురావాల్సిన అవసరం ఏముందని కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గొగోయ్ ప్రభుత్వాన్ని నిండుసభలో నిలదీశారు. వక్ఫ్ ఆస్తులను తమ నియంత్రణలోకి తెచ్చుకోవాలనే ప్రయత్నం ఈ సవరణ బిల్లులో చాలా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఐతే ఈ సవరణ బిల్లు కేవలం వక్ఫ్ ఆస్తుల పనితీరు మెరుగుదల వ్యవహారాలను మాత్రమే పరిశీలిస్తుంది తప్ప మతంతో ఈ బిల్లుకు ఎలాంటి సంబంధం లేదని మైనారిటీలు, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు అన్నారు. లోక్‌సభలో ప్రతిపక్షాల తీవ్ర వ్యతిరేకత, విమర్శలమధ్య వివాదాస్పద వక్ఫ్ సవరణ బిల్లుపై బుధవారం మధ్యాహ్నం చర్చ ప్రారంభమైంది. సంయుక్త పార్లమెంటరీ కమిటీ పునః పరిశీలన చేసి మార్పులు చేర్పులు చేసిన బిల్లును రిజిజు సభలో ప్రవేశపెట్టారు. ఈ మార్పులు చేర్పుల్లో తీవ్ర వివక్ష నెలకున్నదనీ, ప్రతిపక్షాల సూచనలను, సలహాలను కమిటీ స్వీకరించలేదని పదే పదే చెప్పినప్పటికీ కేంద్ర ప్రభుత్వం వారిని పట్టించుకోలేదు. ఈ సవరణ బిల్లులో కొత్త నిబంధనలను చేర్చడానికి ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేదని ప్రతిపక్షాలు తొలుత వ్యక్తం చేసిన అభ్యంతరాలను లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా తోసిపుచ్చారు. ఈ బిల్లును "ఇండియా" తరువాయి 2లో

# వక్ఫ్ చట్టం దుర్వినియోగం

- వక్ఫ్‌వల్ల రూ.12,000 కోట్ల ఆదాయం రావాలి : రిజిజు
- మత విషయాల్లో జోక్యం అంటూ వదంతులు : షా

ఇప్పటివరకూ ఉన్న చట్టాన్ని దుర్వినియోగం చేశారనడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయని వక్ఫ్ సవరణ బిల్లు సభలో ప్రవేశపెడుతూ, కిరణ్ రిజిజు అన్నారు. భూములన్నీ రాష్ట్రాల పరిధిలో ఉంటాయి గనుక పూర్తి అధికారాలు రాష్ట్రాలకే ఉంటాయనీ, వక్ఫ్ బోర్డులు వాటి పరిధిలోనే ఉంటాయనీ, అందువల్ల కేంద్ర ప్రభుత్వానికి వీటి నియంత్రణతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రతిపక్షాలు బిల్లులో లేని విషయాలను ముందుకు తెచ్చి ప్రజలను తప్పుతోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపణలు చేశారు. "దేశంలో ఉన్న అతిపెద్ద ఆస్తుల సముదాయాలలో రైల్వేలు, రక్షణ వ్యవస్థ తర్వాత మూడవ అతి పెద్ద ఆస్తుల సముదాయాన్ని వక్ఫ్ నియంత్రిస్తోందని మంత్రి రిజిజు చెప్పారు. రైల్వేలు, రక్షణ వ్యవస్థ దేశానికి సంబంధించిన ఆస్తులుకాగా, వక్ఫ్ ఆస్తులు ప్రైవేటు వ్యవహారానికి సంబంధించినదన్నారు. రైల్వేలు, సాయుధబలగాలు వంటి భూసంబంధమైన అంశాలతో వక్ఫ్‌ను సరిపోల్చి చూడటం అన్యాయమే అవుతుందన్నారు. ఇంత భారీ ఎత్తున భూసంబంధమైన ఆస్తులు ఉన్నప్పటికీ సాధారణ ముస్లింలకు మాత్రం 70 సంవత్సరాలుగా దేశంలో ఎలాంటి ప్రయోజనం కలగడంలేదని, సాధారణముస్లిం ప్రజలను ఓటుబ్యాంకు రాజకీయాలతో తప్పుతోవ పట్టిస్తున్నారన్నారు. సాధారణ ముస్లిం ప్రజల ప్రయోజనాలకోసం ఈ ఆస్తులను ఎందుకు సద్వినియోగం చేయడంలేదని రిజిజు ప్రశ్నించారు. 2004లో వక్ఫ్ వద్ద 4.9 లక్షల ఆస్తులు ఉన్నాయనీ, వీటివల్ల వచ్చే ఆదాయం కనీసం రూ.12000 కోట్లుగానైనా ఉండాలనీ, కానీ కేవలం రూ.166 కోట్లకు మాత్రమే ఆదాయం ఉందన్నారు. అంతభారీ భూ ఆస్తులద్వారా తరువాయి 2లో

## శాంతి చర్చలకు మేము సిద్ధం

- షరతులకు అంగీకరిస్తే ఒప్పందాలకు ఓకె మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ లేఖ విడుదల
- 'కగార్' పేరుతో నరసంహారాన్ని నిలిపివేయాలని డిమాండ్

ప్రజాపక్షం/భద్రాచలం



నిషేధిత మావోయిస్టు పార్టీ శాంతి చర్చల వైపు అడుగులేస్తోంది. చట్టంతో కాదు తుపాకీ గొట్టంతోనే రాజ్యాన్ని స్థాపించవచ్చనే సిద్ధాంతంతో ప్రభుత్వానికి కొరకరాని కొయ్యగా మారిన మావోయిస్టు పార్టీ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తాము విధించే షరతులకు అంగీకరిస్తే తాము తక్షణమే కాల్పుల విరమణకు పూనుకుంటామని కేంద్ర కమిటీ ప్రకటించింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ అధికార ప్రతినిధి తరువాయి 2లో

# హిందుత్వ 'నయా ఫాసిజాన్ని' నిలువరించేది వామపక్షాలే

- బిజెపికి వ్యతిరేకంగా వామపక్ష ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయాన్ని నిర్మించడానికి కృషి
- సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కారత్
- మదురైలో పార్టీ 24 జాతీయ మహాసభ ప్రారంభం




కామ్రేడ్ సీతారామ్ ఏచూరి నగర్ – మదురై : హిందూత్వ 'నయాఫాసిజాన్ని' పోరాడే, ఎదుర్కొనే సామర్థ్యం, నిబద్ధత కేవలం వామ పక్షాలకు మాత్రమే ఉందని, బిజెపికి వ్యతిరేకంగా వామపక్ష ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయాన్ని నిర్మించడానికి సిపిఐ(ఎం) కృషి చేస్తుందని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సమన్వయకర్త ప్రకాశ్ కారత్ అన్నారు. తమిళనాడు రాష్ట్రం మదురలో ఐదు రోజుల పాటు జరిగే సిపిఐ(ఎం) 24వ జాతీయ మహాసభ బుధవారం ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైంది. మహాసభ ప్రారంభ సూచికగా సీనియర్ నేత బిమన్‌బసు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహాసభ ప్రాంగణం కామ్రేడ్ సీతారామ్ ఏచూరి నగర్ లోని తరువాయి 12లో

### కమ్యూనిస్టు, వామపక్ష శక్తులు సూత్రప్రాయ ఐక్యతకు రావాలి : డి.రాజా

'వర్గం, కులం, పితృస్వామ్యాల సంస్థాగత అణిచివేతలు బిజెపి–ఆర్ఎస్ఎస్ పాలనలో క్రూరంగా మారాయి. వారి పరిపాలన బూర్జువాల రాజకీయ సాధనమే. భారతదేశం చెడు పరిపాలనతో మాత్రమే బాధపడటం లేదు, దోపిడీ చేసేందుకు రూపొందించిన వ్యవస్థలో భారతదేశం ఉక్కిరిబిక్కిరి అవుతోంది.' అని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. సిపిఐ(ఎం) తరువాయి 12లో

## ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్‌కు వాయుసేన ఓకె

- ఆరునెలల వ్యవధిలోనే రెండు ఎయిర్‌పోర్టులకు అనుమతులు సాధించడం ప్రభుత్వ కృషికి దక్కిన ఫలితం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి





ప్రజాపక్షం/హైదరాబాద్

ఆదిలాబాద్ లో ఏర్పాటు చేయతలపెట్టిన పౌరవిమానాశ్రయానికి భారత వాయుసేన (ఐఎఎఫ్) అంగీకారం తెలిపినట్టు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకుముందు మామునూర్ ఎయిర్ పోర్టుకు అనుమతులు సాధించిన తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ కు.. భారత ఎయిర్ ఫోర్స్ నుంచి అనుమతులు సాధించడంపట్ల ఆయన హర్షంవ్యక్తం చేశారు. ఆరు నెలల స్వల్పవ్యవధిలోనే రెండు ఎయిర్ పోర్టులకు అనుమతులు సాధించడం.. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అవిశ్రాంత కృషికి దక్కిన ఫలితమని ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. అదిలాబాద్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసి, పౌరవిమాన సేవలను తరువాయి 12లో

## ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పెంపు

- 25 శాతం రాయితీతో చెల్లించేందుకు ఈనెల 30 వరకూ అవకాశం
- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక శాఖ
- వెబ్‌సైట్‌లో ఎల్ఆర్ఎస్ వివరాలు

ప్రజాపక్షం/హైదరాబాద్



లేఔట్‌ల క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) రాయితీ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును ఈ నెల 30వ తేదీ వరకు పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గడువు మార్చి 31వ తేదీతో పూర్తయిన విషయం తెల్సిందే. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ గడువును పెంచుతూ పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇక ఏప్రిల్ 30వ తేదీ వరకు తరువాయి 2లో

## నోటీసుల జారీకి 10 నెలలా?



- పార్టీ మారిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల చర్యలపై సుప్రీంకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ : కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నోటీసులు జారీ చేయడానికి దాదాపు 10నెలల సమయం ఎందుకు పట్టిందని బుధవారం సుప్రీంకోర్టు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌ను ఉద్దేశించి ప్రశ్నించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్.గవాయ్, ఆగస్టిన్ జార్జి మాసిహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ అంశంపై మాట్లాడుతూ అసెంబ్లీలో తరువాయి 2లో

## చర్యలు తీసుకోండి

- హెచ్‌సియు భూముల్లో చెట్ల నరికివేతపై రాష్ట్ర అటవీశాఖ అధికారులకు కేంద్ర పర్యావరణ శాఖ లేఖ
- వర్సిటీ పర్యావరణానికి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచన

ప్రజాపక్షం/హైదరాబాద్

కంచె గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో అక్రమంగా వృక్షాలను నరికివేయడం, తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అటవీ శాఖ అధికారులు కేంద్ర పర్యావరణ శాఖ తరువాయి 2లో

# కంచ గచ్చిబౌలి భూముల్లో పనులు ఆపండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ నేటికి వాయిదా

హైదరాబాద్: నగరంలోని కంచ గచ్చిబౌలి భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సియు విద్యార్థులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు కొనసాగాయి. వాదనలు విన్న ధర్మాసనం.. కంచ గచ్చిబౌలి భూముల్లో ఏప్రిల్ 3 (గురువారం) వరకు పనులు ఆపాలని ఆదేశించింది. పిటిషన్‌పై తదుపరి విచారణను ఏప్రిల్ 3వ తేదీకి వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని వట ఫౌండేషన్ హెచ్‌సియు విద్యార్థులు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ఉన్నత న్యాయస్థానంలో వాదనలు కొనసాగాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు)





తరఫున ఎల్.రవిశంకర్ వాదనలు వినిపించారు. గత ఏడాది జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం జీవో 54 తీసుకొచ్చింది. ఈ జీవో ప్రకారం 400 ఎకరాల ప్రభుత్వ భూమిని టీజీఐఐసీకి ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఒకవేళ అది ప్రభుత్వ భూమి అయినా సుప్రీంకోర్టు తీర్పులకు లోబడే ప్రభుత్వాలు పని చేయాల్సి ఉంటుంది. కంచ గచ్చిబౌలి తరువాయి 2లో

హెచ్‌సియు విద్యార్థులపై లాఠీచార్జ్

ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు

విద్యార్థులపై లాఠీచార్జ్ గర్హనీయం : ఎఐఎస్ఎఫ్

400 ఎకరాలు ప్రభుత్వ భూమి అయితే.. దొంగల్లాగా అర్ధరాత్రి ఎందుకు వెళ్లాలి?

03


సబ్ ఎడిటర్లు కావలెను
ప్రజాపక్షం దినపత్రికలో
సబ్‌ఎడిటర్లుగా, ట్రైనీ జర్నలిస్టులుగా పనిచేయుటకు ఆసక్తిగల వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము
ఇంగ్లీషు నుండి న్యూస్ ఐటమ్స్ తర్జుమా చేయగలిగిన, ఎడిట్ చేయగలిగిన వారికి సబ్‌ఎడిటర్లుగా ప్రాధాన్యత ఇవ్వబడును
రిటైర్డ్ జర్నలిస్టులకు ప్రాధాన్యత ఉంటుంది
ట్రైనీలకు శిక్షణ కాలంలో నెలకు రూ.10,000/- స్టయిఫెండ్ ఇవ్వబడును
తెలుగులో డిటిపి నేర్పరితనం ఉండాలి
సాయంత్రం 4-5 గంటల మధ్య మా కార్యాలయములోఎడిటర్‌ను స్వయంగా కలుసుకోవచ్చు
PRAJAPAKSHAM DAILY
12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post, Hyderabad - 500068, Telangana.
Ph: 94909 52109 E-Mail: editorprajapaksham@gmail.com



# ప్రపంచం
WORLD NEWS

## అమెరికా నటుడు వాల్‌కిల్మెర్ మృతి



**లాస్‌ఏంజెల్స్ :** అమెరికా నటుడు వాల్ కెల్మెర్ మంగళవారం రాత్రిపొద్దుపోయాక మరణించారు. ఆయన వయసు 65 సంవత్సరాలు. న్యుమోనియా సమస్యతో బాధపడుతూ ఆయన మరణించినట్లు కుటుంబ సభ్యులు బుధవారం ప్రకటించారు. ఆయన నటించిన రియల్ జీనియస్ (1985), మిలిటరీ యాక్షన్ చిత్రం టాప్ గన్ (1986), విల్లో, అమెరికన్ రాక్ బ్యాండ్ డోర్స్ జీవితగాథ 'ద డోర్స్' చిత్రం ఆయనకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చాయి. 1990వ దశకంలో అమెరికాలో నిర్మించిన ఒక్కొక్క చిత్రంలో నటించినందుకు అతిభారీగా పారితోషికం తీసుకున్న గొప్ప నటుడుగా ఆయన రికార్డుల్లో ఉన్నారు. ఆయన తాత మెక్సికోలో బంగారు గనుక తవ్వకం కార్మికుడు. ఎనిమిదేళ్ళ వయసులోనే ఆయన తండ్రి మరణించడంతో తల్లి మరో వివాహం చేసుకున్నారు. కిల్మెర్ పలు హాస్య చిత్రాల్లో కూడా నటించారు. ఆయన మృతికి అనేకమంది సినీ ప్రముఖులు సంతాపాలు ప్రకటించారు. ఆయనతో కలిసి పనిచేసిన జ్ఞాపకాలు, ఆయన గొప్పతనం, నటనాచాతుర్యాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నారు.

# గాజా నుండి హమాస్‌ను ఊడ్చిపారేస్తాం






**గాజా :** గాజాలో సైనిక కార్యకలాపాలను విస్తరిస్తామని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఈజిప్టు సరిహద్దులవెంబడి గగనతల దాడులను ఉధృతం చేసింది. ఇజ్రాయెల్ ఇచ్చిన ఉత్తర్వుల కారణంగా ఈ వారంలో దాదాపు 1,40,000 మంది ప్రజలు రఫా ప్రాంతాన్ని ఖాళీచేసి ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోవాల్సి ఉంటుంది. 18 నెలలుగా యుద్ధ కాలంలో గాజా చుట్టుపక్కల బఫర్ జోన్లను ఇజ్రాయెల్ బ్రహ్మాండంగా విస్తరించుకుంది. కొత్త ప్రాంతాలను ఆక్రమించింది. హమాస్‌వద్ద ఇంకా మిగిలి ఉన్న 59 మంది బందీలను విడుదల చేయాలని కోరుతూ ఈ ఏడాది మార్చి 18వ తేదీన ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి తిరిగి యుద్ధం ప్రారంభించింది.

గాజాలో ఎక్కువ ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకుంటామని, వాటిని భద్రతా మండలాలుగా విభజించి విలీనం చేస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. ఐతే ఏఏ ప్రాంతాలకు కొత్తగా సైన్యాన్ని విస్తరిస్తారన్న విషయాన్ని వివరించలేదు. హమాస్ ఉగ్రవాదులను ఊడ్చిపారేస్తామని, గ్రవాదుల మౌలిక సదుపాయాలను సమూలంగా నాశనం చేస్తానని ఆయన చెప్పారు. కొత్త ప్రాంతాలకు యుద్ధాన్ని విస్తరిస్తామని, మరిన్ని ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకుంటామన్నారు. హమాస్ ఉగ్రవాదులు ఆయుధాలు వదిలిపెడితే వారిని సగౌరవంగా గాజా నుండి బయటకు వెళ్ళిపోయేందుకు అనుమతిస్తామని నేతన్యాహూ బంపర్ ఆఫర్ ఇచ్చిన తర్వాత వెస్ట్‌బ్యాంక్‌లో ఇతర ప్రాంతాలలో ప్రజలను ఇళ్ళు ఖాళీ చేసి వెళ్ళిపోవాలని ఉత్తర్వులు జారీ చేశారు.

రఫాను ఖాళీచేసి వెళ్ళిపోవాలని ప్రజలకు ఉత్తర్వు జారీ చేశారు. ఉత్తరగాజాలో బీట్ లాహియా, బీట్ హనౌన్ ప్రాంతాలను కూడా ప్రజలు ఖాళీ చేసి వెళ్ళిపోవాలని ఇజ్రాయెల్ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త ప్రాంతాలను చేజిక్కించుకుంటామని, తమ అధీనంలోకి ప్రాంతాలను తీసుకుంటామని, ట్రంప్ ప్రకటించిన రియల్ ఎస్టేట్ ప్రణాళికను అమలుచేస్తామని నేతన్యాహూ చెబుతున్నారు. హమాస్‌ను అణచివేసిన తర్వాత గాజా ప్రాంత భద్రతా నియంత్రణను తమ అధీనంలోనే కొనసాగిస్తామని ఆయన చెప్పారు.

ఉత్తరగాజా నుండి తమపైకి ఉగ్రవాదులు రాకెట్లు విసురుతున్నారని ఆయన ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఆహారాన్ని గాజాలోకి రానీయకుండా అడ్డుకోవడం ద్వారా గాజాను ఆకలితో నకనకలాడిస్తున్నది. ఇజ్రాయెల్ చర్యల వల్ల గాజాలో దుకాణాలన్నీ మూతపడ్డాయి. బుధవారంనాడు ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 21 మంది మరణించారు. ఒక్క ఉత్తర గాజాలోనే 17 మంది మరణించారు.

## ప్రతిష్ఠాత్మక విస్కాన్సిన్ న్యాయమూర్తి ఎన్నికలో ట్రంప్‌కు ఎదురుదెబ్బ

### డెమోక్రాట్ల అభ్యర్థి సుసాన్ గెలుపు



**మాడిసన్:** ప్రతిష్ఠాత్మకమైన విస్కాసిన్ రాష్ట్ర సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆ పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థి సుసాన్ క్రాఫోర్డ్ విజయం సాధించారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఎన్నికలుగా, అత్యంత ఖరీదైన ఎన్నికలుగా అమెరికా చరిత్రలో సుసాన్ గెలుపు నమోదవుతుంది. ఎలాన్‌మస్క్‌తో 2026లో జరిగే కాంగ్రెస్ ద్వైవార్షిక మధ్యంతర ఎన్నికల్లో, తదుపరి 2028లో జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కాంగ్రెస్ పునర్విభజనకు సంబంధించిన కేసుల విచారణలో ఈ విస్కాన్‌సిన్ సుప్రీంకోర్టు ఎంతో కీలకపాత్రవహించనున్నది. రాబోయే పదేళ్ళకాలం పాటు డెమోక్రాట్ల మద్దతుతో గెలిచిన సుసాన్ క్రాఫోర్డ్ న్యాయమూర్తిగా పదవిలో ఉండి సేవలు అందిస్తారు. ఈ ఎన్నికను రిపబ్లికన్ పార్టీకి చెందిన సంపన్నుడు ఎలాన్‌మస్క్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. సుసాన్ క్రాఫోర్డ్‌కు ప్రత్యర్థిగా పోటీచేసిన బ్రాడ్ స్కిమెల్‌కు రిపబ్లికన్ పార్టీ మద్దతు ఇచ్చింది. ఆయనను గెలిపించడం కోసం రిపబ్లికన్ పార్టీ తరపున ఎలాన్ మస్క్ హోరాహోరీ ప్రచారం చేశారు. ఈ ఎన్నికల కోసం 22.6 మిలియన్ డాలర్లు ఖర్చుచేశారు. ఈ ఎన్నికల కోసం ఆయన ఎంతో కష్టపడి నిధులు పోగుచేశారు. ఐనప్పటికీ సునాన్ క్రాఫోర్డ్ గెలవడంతో మరోసారి లిబరల్స్ 4:3 తేడాతో సుప్రీంకోర్టులో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్నారు.

## ఫ్లోరిడా ఎన్నికల్లో రిపబ్లికన్ గెలుపు





**టాల్లెహస్సీ :** ఫ్లోరిడా కాంగ్రెస్‌కు జరిగిన ప్రత్యేక ఎన్నికల్లో అధికార రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి రెండోసారి కూడా విజయం సాధించారు. ఐతే వారికి ఈసారి గణనీయంగా మెజారిటీ తగ్గిపోయింది. రాబోయే ద్వైవార్షిక ఎన్నికలలో ఈ మెజారిటీ తగ్గుదల అధికార రిపబ్లికన్ అభ్యర్థులపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఈ ఎన్నికల ద్వారా కాంగ్రెస్‌లో రిపబ్లికన్లు తమ స్వల్ప మెజారిటీని కొనసాగించగలుగుతారు. సభలో మెజారిటీ ఉండాలంటే 218 స్థానాలు ఉండాలి. రిపబ్లికన్లకు 220 స్థానాలు ఉండగా, డెమొక్రాట్లకు 213 స్థానాలు ఉన్నాయి. రిపబ్లికన్ స్టేట్ సెనేటర్ రాండీ ఫిన్ డెమొక్రాట్లకు చెందిన అభ్యర్థి జోష్ వెయిల్‌పై గెలిచారు. ఇప్పటివరకూ ఈ స్థానానికి జాతీయ భద్రతా సలహాదారు మైఖేల్ వాల్జ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత ఏడాది అధ్యక్ష ఎన్నికల్లో ఫ్లోరిడా రాష్ట్రంలో ట్రంప్ 30 పాయింట్ల ఆధిపత్యంలో ఉన్నారు. ఈ ఆధిపత్యాన్ని తగ్గించాలని డెమొక్రాట్లు చేసిన ప్రయత్నం విజయవంతం కాలేదు. దాంతో వారు నిరాశ చెందారు. ఈ ఎన్నికల్లో వెయిల్ ఇజ్రాయెల్ వ్యతిరేకతను ప్రచారం చేశారు. దీంతోనే ఆయన భారీగా విరాళాలు సేకరించారు.

## దుర్వినియోగం (మొదటి పేజీ తరువాయి)

ఇంత తక్కువ ఆదాయాన్ని సమ్మతించేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో గతంలో ఎన్నడూలేనివిధంగా సంయుక్త పార్లమెంటరీ కమిటీ భారీస్థాయిలో సంప్రదింపుల ప్రక్రియ చేపట్టిందని చెప్పారు. దాదాపు 979.27 లక్షల విజ్ఞాపనలు, పిటిషన్లు వక్ఫ్ సవరణబిల్లుపై జెపిసికి అందాయని,ఆన్ లైన్ పద్ధతిలో, భౌతికంగాను వచ్చి జెపిసికి ఈ విజ్ఞాపనలు అందజేశారని, లోక్‌సభకు నివేదిక తయారుచేసి అందజేసేముందుగా జెపిసి ఈ విజ్ఞాపనలన్నింటినీ పరిశీలించిందన్నారు. 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన వక్ఫ్‌బోర్డులతోపాటు 284 ప్రతినిధి బృందాలతోపాటు న్యాయ నిపుణులు, ధార్మికసంస్థలు, విద్యావేత్తలు, మత నాయకులు ఇతరులు కూడా తమ తమ అభిప్రాయాలను జెపిసికి తెలియజేశారని చెప్పారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించి ఏమైనా సంక్లిష్ట సమస్యలు ఉంటే వాటిని ఈ సవరణ చట్టం పరిష్కరిస్తుందని, ఎలాంటి చిక్కులకు, సమస్యలకు తావులేకుండా బాహాటత్వ విధానంద్వారా టెక్నాలజీ సాయంతో ఈ వ్యవహారాలను ఈ శాసనం పరిష్కరిస్తుందని అన్నారు. ''ప్రభుత్వం ఎలాంటి మతసంస్థలలోనూ జోక్యం చేసుకోవడం లేదు, యుపిఎ ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో చేసిన మార్పులు ఆధిపత్యం చూపించడం వల్ల ఇతర చట్టాలపై తీవ్ర ప్రభావం పడుతున్నది, అందువల్ల ఈ పాత చట్టానికి కొత్త సవరణలు అవసరమయ్యాయి'' అని రిజిజు చెప్పారు.

**మత విషయాల్లో జోక్యం అంటూ వదంతులు : అమిత్ షా విమర్శ**

ప్రతిపక్షాలు ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లోక్‌సభలో విమర్శించారు. వక్ఫ్ బిల్లు ద్వారా ముస్లింల మత వ్యవహారాలలో, వారు దానం చేసిన ఆస్తుల వ్యవహారాలలో ప్రభుత్వం జోక్యం చేసుకుంటోందంటూ వదంతులు వ్యాప్తి చేస్తున్నారని అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చలో అమిత్ షా జోక్యం చేసుకుంటూ నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగానే వక్ఫ్ ఆస్తుల పరిపాలనకు భరోసా కలిగించడంకోసం ముస్లిమేతరులను వక్ఫ్ కౌన్సిల్స్‌లో సభ్యులుగా ప్రతిపాదించారన్నారు. వక్ఫ్ అనేక ఒకరకమైన ధార్మికసంస్థ అనీ, సామాజిక, మతపరమైన లేదా ప్రజాసంక్షేమంకోసం దాతలు వాటిని విరాళాలుగా ఇచ్చారనీ అమిత్ షా అన్నారు. ''విరాళం'' అనే పదానికి ఒక ప్రత్యేక ప్రాధాన్యత ఉందనీ, ఎందుకంటే మన సొంత ఆస్తిని ప్రజల ప్రయోజనంకోసం విరాళంగా ఇస్తామన్నారు. ప్రభుత్వ ఆస్తిని ఎవ్వరూ విరాళంగా ఇవ్వలేరన్నారు. మైనారిటీ వర్గాలను భయభ్రాంతులకు గురిచేయడం కోసం ఓటు బ్యాంకును సృష్టించారనీ, మైనారిటీలలో ఒక భయపూరిత వాతావరణం సృష్టించేందుకు దేశంలో గందరగోళాన్ని వ్యాప్తిచేశారని అమిత్ షా అన్నారు. మతపరమైన సంస్థలను నడిపేందుకు ఎన్‌డిఎ పాలనలోగానీ, అంతకుముందుగానీ ముస్లిమేతరులను సభ్యులుగా నియమించాలన్న నిబంధన లేదన్నారు. సమానత్వ హక్కుల గురించి పెద్ద పెద్ద ఉపన్యాసాలు చెప్పేవారంతా మతాలమధ్య వివక్ష చూపిస్తున్నారనీ, ముస్లింల మతహక్కుల్లో జోక్యం చేసుకుంటున్నారంటున్నారనీ, కానీ అలాంటిదేమీ అ బిల్లు వల్ల జరగదని ఆయన భరోసా ఇచ్చారు. 2013లో పార్లమెంటు ఎన్నికలకు ముందుగా బుజ్జగింపుల కోసం వక్ఫ్ చట్టం చేశారనీ, ఆనాడు ఆ బిల్లు తీసుకురాకపోయి ఉంటే ఈనాడు ఈ సవరణ బిల్లు అవసరం ఉండేదేకాదని అమిత్ షా అన్నారు. ఎన్నో విధాలుగా సంయుక్త పార్లమెంటరీ కమిటీ సంప్రదింపులు చేసిన తర్వాత మాత్రమే ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టామన్నారు. ఈ బిల్లును 2024 ఆగస్టు నెలలో మొదటిసారి అమిత్ షా లోక్‌సభలో ప్రవేశపెట్టారు. సభ కోరిక మేరకు ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపారు. కేంద్రమంత్రివర్గం జెపిసి నివేదికను ఆమోదించినతర్వాత బిల్లును సభలో ప్రవేశపెట్టిందని అమిత్ షా అన్నారు.

**కాంగ్రెస్‌వల్లే దేశవిభజన : అనురాగ్ థాకూర్ ఆరోపణ**

కాగా ఈ చర్చలో బిజెపి ఎంపి అనురాగ్ థాకూర్ పాల్గొంటూ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు ఈ సవరణ బిల్లు ఒక చరమగీతమని అన్నారు. ఇప్పటివరకూ అవినీతికి నిలయాలుగా ఉన్న వక్ఫ్‌బోర్డులలో తీవ్రమైన మార్పులకు సమయం ఆసన్నమైందన్నారు. దేశంలో మరోసారి కాంగ్రెస్‌పార్టీ ఈ బిల్లుపై గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. మీరు రాజ్యాంగం వెంట నిలబడతారా? వక్ఫ్ వెంట నిలబతారా? మీరే నిర్ణయించుకోవాలని అన్నారు. భారత దేశం 1947లో రెండుగా విభజన కావడానికి ఒకే ఒక్క కుటుంబం కారణమని ఆరోపించారు. కానీ ఈనాడు ఆ విధంగా ల్యాండ్ జీహాద్ పేరుతో మరోసారి దేశ విభజనను తాము అంగీకరించేదిలేదన్నారు. వక్ఫ్‌బోర్డు భయం నుండి భారతదేశం విముక్తి చెందాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం 200 మంది వ్యక్తులు వక్ఫ్ ఆస్తులను నియంత్రిస్తున్నారని, హిందువులు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులకు చెందినవారి భూములు తీసుకున్నారని, ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ఎవ్వరూ మాట్లాడటంలేదన్నారు.

## చర్యలు తీసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

రాసిన లేఖలో ఆదేశించింది. హెచ్‌సియు భూ వ్యవహారంపై రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపుతున్నాయి. హెచ్‌సియులో పర్యావరణానికి విఘాతం కలిగించారని, వన్యప్రాణులు, సరస్సులు, పురాతన రాతి నిర్మాణాలకు నష్టం కలిగించారని వివిధ వార్తా పత్రికల్లో కథనాలు వెలువడినట్లు లేఖలో పేర్కొంది. అంతేగాక ఇకపై వివాదానికి తావులేకుండా.. యూనివర్సిటీలో పర్యావరణానికి విఘాతం కలగకుండా వెంటనే చర్యలు చేపట్టాలని సూచించింది. అక్కడ చెట్లు, జంతుజాలానికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రానికి కేంద్రం సలహా ఇచ్చింది. ఈ వ్యవహారంలో నిజానిజాలపై విచారణ సాగించి, పూర్తి నివేదికను అందించాలని రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శిని కోరింది. కోర్టులు, ట్రిబ్యునల్స్ గతంలో ఇచ్చిన ఆదేశాల ఉల్లంఘన లేకుండా చర్యలు తీసుకోవాలని సూచనలు చేసింది.

## మేము సిద్ధం (మొదటి పేజీ తరువాయి)

అభయ్ పేరుతో సోషల్ మీడియాలో ఓ ప్రకటన చెక్కర్లు కొడుతోంది. 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు పార్టీని అంతం చేస్తామని కేంద్ర హోంమంత్రి అమీత్ షా పదేపదే వల్లిస్తున్న నేపథ్యంలో మావోయిస్టు పార్టీ శాంతిచర్చలవైపు అడుగులేయడంపై విప్లవోద్యమ విశ్లేషకుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా జరుగుతున్న ఉద్యమాన్ని ఆపాలని, మావోయిస్టు పార్టీ బేషరుతుగా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలనే అంశంపై గతనెల 24న హైదరాబాద్‌లో శాంతిచర్చల కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించినట్లు మావోయిస్టు కేంద్రకమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేర్కొన్నారు. ప్రస్తుత స్థితి శాంతి చర్చల కమిటీ ఏర్పాటును, ఆయా సమావేశాన్ని తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ప్రజాప్రయోజనాల కోసం తామెప్పుడూ శాంతి చర్చలకు సిద్ధమే అని, అందుకోసం సానుకూల వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ప్రతిపాదన చేసినట్లు అభయ్ పేర్కొన్నారు. అయితే ఇందుకు కగార్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిస్సా, ఝూర్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణల్లో చేస్తున్న నరసంహారాన్నినిలిపేయాలన్నారు. అంతేకాక సాయుధ బలగాల కొత్తక్యాంపుల ఏర్పాటును ఆపేయాలని, తాము చేస్తున్న ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందిస్తే తాము తక్షణమే కాల్పుల విరమణ ప్రకటిస్తామని, శాంతి చర్చలకు మేధావులు, కవులు, జర్నలిస్టులు రచయితలు, హక్కుల సంఘాలందరికీ విజ్ఞప్తి చేస్తున్నట్లు తన ప్రకటనలో పేర్కొన్నారు. శాంతి చర్యల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు దేశవ్యాప్తంగా అన్నినగరాల్లో, పట్టణాల్లో, గ్రామాల్లో, జిల్లా, తాలూకా కేంద్రాల్లోనేగాక యూనివర్సిటీల్లో ప్రచార క్యాంపెయిన్‌ను చేపట్టాలని మావోయిస్టు కేంద్ర కమిటీ కోరింది.

## పనులు ఆపండి

(మొదటి పేజీ తరువాయి)

భూముల వద్ద భారీ వాహనాలను ఉపయోగించి చెట్లను కొట్టేసి, భూమిని చదును చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అటవీ ప్రాంతాన్ని కొట్టివేయాలంటే నిపుణుల కమిటీ వేయాలి. వన్యప్రాణులు ఉన్నచోట భూములు చదును చేయాలంటే నిపుణుల కమిటీ పర్యటించాలి. నెల రోజుల పాటు అధ్యయనం చేయాలి. అక్కడ మూడు లేక్‌లు ఉన్నాయి. రాక్స్ ఉన్నాయి. ఎన్నో రకాల అరుదైన జంతువులున్నాయి. వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉంది. అయితే, ఇక్కడ సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. కొన్ని రోజులుగా ఈ భూముల దగ్గర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి అని కోర్టుకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎజి సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 2004లో ఈ భూమిని ఐఎంజి అకాడమీకి అప్పగించారు. ఒప్పందం ప్రకారం ఐఎంజి ఈ భూములను వినియోగించలేదు. దీంతో అప్పటి ప్రభుత్వం కేటాయింపును రద్దు చేసింది. ఆ భూముల్లో అటవీ భూమి అని ఎక్కడా లేదు. దీనికి ఆనుకొని ఉన్న హెచ్‌సియు భూముల్లో భారీ భవనాలు నిర్మించారు. నాలుగు హెలీప్యాడ్‌లున్నాయి. హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో పాములు, నెమళ్లు, చెట్లు ఉన్నాయి. పిటిషనర్ల వాదనల ప్రకారం ఆయా ప్రాంతాలను కూడా అటవీ భూములుగా ప్రకటించాల్సి ఉంటుంది. ఈ లెక్కన హైదరాబాద్ మహానగరంలో ఎక్కడా నిర్మాణాలు చేపట్టకూడదు అని ఎజి వాదనలు వినిపించారు. ఇప్పటివరకు ఈ భూమి అటవీ భూమి అని ఒక్క వాదన కూడా లేదు. కంచ గచ్చిబౌలి భూములు.. అటవీ భూములని ప్రభుత్వం సైతం ఎక్కడా నోటిఫై చేయలేదన్నారు. ఇది పూర్తిగా పరిశ్రమలు, ఇతర అవసరాలకు కేటాయించిన స్థలం మాత్రమేనని.. అటవీ భూమి కానే కాదన్నారు.

నిజాం కాలం నుంచి ఈ భూమి.. బీడు భూమిగానే ఉందని కోర్టుకు తెలిపారు. అయితే, ఈ 400 ఎకరాలు పరిశ్రమల భూమి అని రికార్డుల్లో ఎక్కడైనా ఉందా? అని హైకోర్టు ఎజిని ప్రశ్నించింది. సర్వే నెంబర్ 25లో ఉన్న ఈ భూములను పలు అవసరాలకు కేటాయిస్తూ వచ్చారని న్యాయస్థానానికి తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం రేపటి వరకు ఆ భూముల్లో పనులు ఆపాలని ఆదేశిస్తూ.. పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది.

## 10 నెలలా? (మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అక్కడ ఎలాంటి ఉప ఎన్నికలు ఉండబోవని ప్రకటన చేయడాన్ని ఆక్షేపించింది. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ అనర్హత వేటు వేయాలని కోరిన అభ్యర్థనలపై జాప్యం చేశారన్న పిటిషన్‌లపై ధర్మాసనం వాదనలను విన్నది. ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హత వేటుపై నవంబరు 24న తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సవాల్‌చేస్తూ ఒక పిటిషన్ దాఖలు చేయగా, అదే సమయంలో దాఖలైన మరొక పిటిషన్ ఫిరాయింపులకు పాల్పడ్డ ఏడుగురు శాసనసభ్యులకు సంబంధించినది. గత ఏడాది తెలంగాణ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం శాసనసభ స్పీకర్ ముగ్గురు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లకు సంబంధించి ఒక 'సహేతుకమైన సమయంలో' నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం 2024 సెప్టెంబరు 9న అప్పీళ్లకు వ్యతిరేకంగా ద్విసభ్య ధర్మాసనం తీర్పు వెలువడింది. స్పీకర్‌పై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్‌పై నాలుగు వారాలలోగా విచారణ షెడ్యూల్‌ను ఖరారు చేయాలని సింగిల్ జడ్జి అసెంబ్లీ కార్యదర్శిని ఆదేశించారు. బుధవారం నాడు విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఇలా అడిగింది. 'ఒక వేళ శాసనసభ స్పీకర్ అస్సలు పనిచేయకుంటే రాజ్యాంగ సంరక్షకులుగా అధికారాన్ని మాత్రమే కలిగిఉండకుండా డ్యూటీని కూడా నిర్వర్తించాల్సిన ఈ దేశంలోని కోర్టులు శక్తిహీనులవుతాయా?' అని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. 'ఒకవేళ తెలంగాణ ముఖ్యమంత్రి శాసన సభ హౌస్‌లో ఉప ఎన్నికలు ఉండవని మాట్లాడినట్లయితే, మీ ముఖ్యమంత్రి 10వ షెడ్యూల్‌ను అపహాస్యం చేయడమే అవుతుంది' అని జస్టిస్ గవాయ్ వ్యాఖ్యానించారు.

## విచ్ఛిన్నం చేసేందుకే

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రతిఘటిస్తోందని గౌరవ్ గొగోయ్ లోక్‌సభలో చెప్పారు. మైనారిటీ కమిషన్ 2023లో నాలుగు సమావేశాలు నిర్వహించిందనీ, కానీ ఈనాటి వరకూ కూడా ఈ వక్ఫ్ సవరణ బిల్లును తీసుకురావాల్సిన అవసరం ఏమిటో ఇప్పటివరకూ చెప్పలేదని గొగోయ్ విమర్శించారు. ఈ బిల్లును మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖే తయారుచేసిందా? లేకపోతే ఇతర విభాగం ఏదైనా తయారు చేసిందా? అని ఆయన ప్రశ్నించారు. వ్యక్తులు ఆచరించే ఇస్లాం గురించి ఈ సవరణ బిల్లులోని క్లాజ్–3లో చేసిన నిర్వచనంపట్ల కూడా గొగోయ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ''దేశంలో మైనారిటీ వర్గాలు ఈనాడు సర్టిఫికెట్లు సమర్పించి తమ మతపరమైన గుర్తింపును బలవంతంగా రుజువుచేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది, ఇక రేపు ఇతర మతవిశ్వాసాలకు చెందిన ప్రజలు కూడా ఇలా చేయాల్సి వస్తుందా? ఇదంతా అసలు రాజ్యాంగంలోని 26వ అధికరణకు వ్యతిరేకం, ఏ మతాన్ని మీరు తప్పుతోవ పట్టించాలనుకుంటున్నారు? కానీ ఆ మతమే ఒకనాడు భారతదేశ స్వాతంత్ర్యంకోసం పోరాటం చేసింది? 1857లో మంగళ్‌పాండేతోపాటు త్యాగాలు చేసింది, రెండు లక్షలమంది ఉలేమాలు ప్రాణత్యాగం చేసిన మతాన్ని అపఖ్యాతిపాలుచేయాలని మీరు కోరుకుంటున్నారా? క్విట్ ఇండియా ఉద్యమానికి మద్దతు ఇచ్చిన మతాన్ని అపఖ్యాతిపాలు చేయాలనుకుంటున్నారా? 1930 ఏప్రిల్ 6 వ తేదీన జరిగిన ఉప్పు సత్యాగ్రహ ప్రదర్శనకు మద్దతు ఇచ్చిన మతస్తులపై బురద జల్లాలనుకుంటున్నారా? 1926లో బ్రిటిష్‌వారు తీసుకువచ్చిన 'విభజించి పాలించు' విధానాన్ని ప్రతిఘటించిన మతాన్ని మీరు అపఖ్యాతిపాలు చేయాలనుకుంటున్నారా? భారత్‌కు సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని డిమాండ్ చేసిన మౌలానా హుస్సేన్ అహ్మద్ మదానీ నాయకుడి మతానికి కళంకం ఆపాదించాలనుకుంటున్నారా?'' అని గొగోయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. మహిళల హక్కులపై ఈ బిల్లు చూపించే ప్రభావంపై కూడా ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. ప్రస్తుతం ఉన్న చట్టం మహిళలపట్ల వివక్ష చూపిస్తోందన్న భ్రమలు సృష్టించే ప్రయత్నం కూడా ప్రభుత్వం చేస్తోందన్నారు. వాస్తవంగా చూస్తే, ఉన్న చట్టంలోనే భర్తలను కోల్పోయినవారితో సహా మైనారిటీ మహిళలకు రక్షణలు ఉన్నాయి, వారికి సాధికారత కల్పించే నిబంధనలున్నాయన్నారు. వక్ఫ్‌బోర్డుకు కేటాయించే ఆదాయాన్ని ఏడూశాతం నుండి ఐదూశాతానికి తగ్గించేబదులుగా ఈ ఆదాయాన్ని 11 శాతానికి పెంచాలని కోరారు.

**ప్రజలను విభజించడంకోసమే.. అఖిలేశ్ యాదవ్ విమర్శ**

ప్రజలను రెండు వర్గాలుగా విభజించడంకోసమే ఈ వక్ఫ్ సవరణ బిల్లు తీసుకువచ్చారని సమాజ్‌వాదీపార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ లోక్‌సభలో విమర్శించారు. వక్ఫ్ భూములను ఇతర ప్రయోజనాలకోసం ఎవ్వరికీ పంచిపెట్టబోమని, ఇతర మాయోపాయాలకోసం ఉపయోగించబోమని కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వక్ఫ్ బిల్లు వెనుక ఉన్న ఉద్దేశంగానీ, ఆ విధానంగానీ సరైనదికాదు, ఇదొక కుట్ర, కోట్లాదిమంది ప్రజల ఇళ్ళను, భూములను లాక్కుపోవడానికి చేసే కుట్ర అని విమర్శించారు. బిల్లుపై చర్చలో ఆయన మాట్లాడుతూ, ఈ బిల్లువల్ల ప్రపంచానికి తప్పుడు సందేశం వెళుతుందని, దేశ లౌకిక వ్యవస్థను తిరస్కరించారన్న సందేశం ప్రపంచానికి పంపినట్లవుతుందని హెచ్చరించారు. రోజు రోజుకూ క్షీణించిపోతున్న బిజెపి ఓటుబ్యాంకును కాపాడుకోవడంకోసం ఈ బిల్లు ప్రవేశపెట్టారనీ, ఈ బిల్లు ప్రవేశపెట్టడమంటే 'వాటర్లూ' దగ్గర జరిగిన యుద్ధం తరహాలో ఘోరపరాజయాన్ని చవిచూసినట్టే కాగలదని కొంతమంది బిజెపి సభ్యులు అంతర్గతంగా వ్యతిరేకభావంతో ఉన్నారని, బిజెపి సభ్యులు, మిత్రులు ఈ బిల్లుకు మద్దతు ఇచ్చినప్పటికీ ఈ పరిణామంపట్ల వారు ఏ మాత్రం సంతోషంగా లేరని అన్నారు.

భారత్ భూభాగాన్ని ఆక్రమించిన చైనా పరిణామాల నుండి, మహాకుంభమేళాలో లెక్కతేలని మరణాలనుండి ప్రజలదృష్టి మళ్లించడం కోసమే ఈ బిల్లు తీసుకువచ్చారన్నారు.

''బిజెపి రాజకీయ క్రీడలో భాగమే ఈ బిల్లును తీసుకురావడం, ఇది వారు ఆడే మతోన్మాద రాజకీయ ఆటలో ఒక కొత్త తరహారూపం, బిజెపి అనుసరిస్తున్న విధానాలవల్ల ఆ పార్టీకి దూరం అవుతున్న ఓటర్లను మద్దతుదార్లను తిరిగి వెనక్కు రప్పించుకోవడంకోసం, వారిని బుజ్జగించడంకోసం ఈ బిల్లు తీసుకువచ్చారు, ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్‌లో ఓట్ల వాటాకోసం, బిజెపి ఓట్లను మేనేజ్ చేయడం కోసం ప్రయత్నాలు చేస్తోంది, ఓట్ల కోసమే ఇదంతా, తమ హక్కులపై దాడి జరుగుతోందని ముస్లిం వర్గాలు భావించాలని బిజెపి కోరుకుంటున్నది, వారి ఎజెండా అదే కాబట్టి, ఆ విధమైన రాజకీయాలనే ఆ పార్టీ అనుసరిస్తోంది'' అని అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. ''బిజెపి ఒక అప్రజాస్వామ్యపార్టీ, ఎక్కడైనా అసమ్మతి ఉంటే ఆ అసమ్మతినే తన బలంగా భావించేపార్టీ, దేశంలో ఎక్కువ రాజకీయపార్టీలు దీనికి వ్యతిరేకం, అందుకే ప్రభుత్వం ఈ సవరణ బిల్లు తీసుకువచ్చింది, చాలామంది బిజెపి సభ్యులు , మిత్రపార్టీలు లోపలినుండి, బయట నుండి ఇప్పుడు ఈ బిల్లుకు మద్దతు ఇవ్వొచ్చు, కానీ వారు అర్ధాంగీకారంతోనే ఉన్నారు, ఇది భారత లౌకిక వ్యవస్థకు నష్టం కలిగిస్తుంది, ఈ సవరణ బిల్లే ఆ పార్టీకి ఒక అతిపెద్ద ఘోర పరాజయంగా పెద్ద ''వాటర్లూ''గా మారుతుంది'' అని అఖిలేశ్ యాదవ్ విమర్శించారు.

## జెండా ఎగరేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని ఎందుకు పట్టించుకోబోరన్నారు. విద్యా, ఉద్యోగాలతో పాటు రాజకీయాల్లోనూ 42 శాతం బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని, పరిపాలనలోనూ బిసిలు భాగస్వాములు కావాలని సిఎం ఆకాంక్షించారు. కుల గణన చేపట్టి రిజర్వేషన్ల పెంపు తీర్మానాలు చేసి దేశానికే తెలంగాణ ఒక దిక్సూచిగా నిలిచిందన్నారు. తెలంగాణలో తాము రిజర్వేషన్లు పెంచితే కేంద్ర ప్రభుత్వానికి,మోదీకి వచ్చిన ఇబ్బంది ఏమిటని, బిజెపి పాలిత ఉత్తరప్రదేశ్, గుజరాత్ సహా ఏ రాష్ట్రంలోనూ కులగణన చేపట్టలేదని సిఎం ఆరోపించారు. తమ రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచుకుంటామని, తాము కోరితే ఎందుకు ఒప్పుకోవడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కురుక్షేత్ర సంగ్రామానికి ముందు అయిదు ఊళ్ల కోసం కృష్ణుడు రాయబారానికి వచ్చారని సిఎం గుర్తు చేశారు. అయిననూ పోయి రావలె హస్తినకు అనే రీతిలోనే తాము హస్తినకు వచ్చామన్నారు. ఇకపై తాము ఢిల్లీకి రాబోమన్నారు. ఎస్ సి వర్గీకరణ విషయంలో ఒకనాడు ధర్మ యుద్ధ సభ పెట్టాలని తాను మంద కృష్ణ మాదిగకు సూచించానని, అదే తరహాలో హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో భారీ ఎత్తున 'బిసిల ధర్మయుద్ధ సభ' పెట్టాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. కొలువుల కోసమే తెలంగాణ ఉద్యమం సాగిందని,తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యోగాలు భర్తీ చేయాలని గల్లీ నుంచి ఢిల్లీ వరకు యువత పోరాడితే నాటి దుర్మార్గ పాలకుడు ఏ మాత్రం పట్టించుకోలేదని, తాము పాదయాత్ర చేస్తూ తండ్రీకొడుకుల ఉద్యోగాలు ఊడగొట్టాలని చెప్పిన మాటను ప్రజలు విశ్వసించారని గుర్తు చేశారు.

**బిసిల ధర్నాకు బిజెపి, బిఆర్ఎస్ నాయకులు ఎందుకు రాలేదు : మంత్రి పొన్నం**

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ శాసనసభ వేదికగా బిసి రిజర్వేషన్ల బిల్లుకు మద్దతునిస్తున్నాని చెప్పిన బిజెపి, బిఆర్ఎస్‌లు ఢిల్లీలో జరిగే బిసి మహాధర్నాకు ఆ పార్టీకు చెందిన శాసనసభాపక్ష నాయకులు ఎందుకు హాజరుకాలేదని నిలదీశారు.

**బిసి రిజర్వేషన్లను పెంచండి: అసదుద్దీన్**

ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఒవైసి మాట్లాడుతూ తాను బిసి అని చెప్పుకుంటున్న ప్రధాని మోదీ వెంటనే బిసిల రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు.

**కేంద్రం ఆలోచించి నిర్ణ యం తీసుకోవాలి : కోదండరామ్**

టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ మాట్లాడు బిసి రిజర్వేషన్ల పెంపు విషయంలో కేంద్రం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఆకాంక్ష నెరవేర్చాలని, ఒక వేళ నెరవేర్చకపోతే రిజర్వేషన్లను సాధించే దారి కూడా తమకు తెలుసని, బిసిల వాటాను దక్కించుకునేందుకు ప్రయత్నిస్తామన్నారు. వి.హనుమంతరావు, సుమన్ మాట్లాడుతూ బిసిలకు రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**కేంద్రం బిసి బడ్జెట్ చాక్లెట్లకు , బిస్కెట్లకు సరిపోదు: జాజుల**

జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అయినప్పటికీ రూ. 52లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో బిసి సంక్షేమానికి కేటాయించిన రూ 2700 కోట్లతో బిసిలకు చాక్లెట్లు, బిస్కెట్లు కూడా రావని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బిసిల రిజర్వేషన్ల అమలకు బిజెపి ముస్లింల పేరుతో కుంటి సాకులు చెబుతుందని మండిపడ్డారు.కేంద్రంలో 72 మంత్రిత్వ శాఖలు ఉన్నప్పటికీ బిసి శాఖ ఎందుకు లేదనినిలదీశారు. ఈ సభలో బిసి ఇంటలెక్చువల్ ఫోరం నాయకలు చిరంజీవితో పాటు పలువురు పాల్గొన్నారు.

### 42 శాతం బిసి రిజర్వేషన్లకు సిపిఐ మద్దతు

**డాక్టర్ నారాయణ**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను సాధించే వరకు సిపిఐ మద్దతుగా నిలుస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ హామీ నిచ్చారు. మండల కమిషన్‌ను ఉపసంహరించుకోకపోతే తాము మద్దతు ఇవ్వబోమని ఆనాటి ప్రధాని వి.పి.సింగ్‌ను బిజెపి బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడినప్పటికీ ఆయన వెనక్కి తగ్గకుండా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నారని గుర్తు చేశారు. బిసి ప్రధాని బిసిలను మోసం చేస్తే, సిఎం రేవంత్ రెడ్డి అగ్రవర్ణాలను కాదని బిసిలకు మద్దతునిచ్చారన్నారు. బిసి అని చెప్పుకునే ప్రధాని మోదీ, బిసిలకు ఎందుకు న్యాయం చేయబోరని నారాయణ నిలదీశారు. ఏ కులం వ్యక్తి పదవిలో ఉంటే, ఆ కులం బాగుపడుతుందని అనుకోవద్దని, పదవిలో ఉన్నవారు సిద్ధాంతాలకు కట్టుబడి ఉండాలని చెప్పారు. ఒక రాజ్యసభ సీటు కోసం బిసి నాయకుడు బిజెపికి అమ్ముడుపోతారా?, బిజెపి ఒళ్లో కూర్చుంటారా? అని మండిపడ్డారు. రాష్ట్రంలో బిసిల జనాభా 50 శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక రాజీమార్గంగా 42 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించిందని వివరించారు. బిసిలకు పరిపాలనలో భాగస్వామ్యం కావాలని నారాయణ తెలిపారు.

## రాయితీ గడువు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌ఆర్‌ఎస్‌కు 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు ఈ ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ద్వారా ఇప్పటికే లేఔట్‌లను క్రమబద్ధీకరణ చేసింది. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సుమారుగా రూ. 1000 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు తెలిసింది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీల పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 25,67,107 లక్షలు వచ్చాయి. వీటిలో 20,00,495 లక్షల దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించాలని లేఖలు పంపించారు. ఇప్పటివరకు 4,58,680 లక్షల మంది ఫీజు చెల్లించారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపు గడువును పెంచడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ వివరాలను వెబ్ సైట్‌లో పోర్టల్‌లో పొందు పరిచింది. అయితే అందులోని ప్రభుత్వ ధరలకు బయట మార్కెట్ విలువకు పూర్తి వాస్తవ విరుద్ధంగా ఉంది. అలాగే ఎల్ ఆర్‌ఎస్ కోసం ప్రభుత్వం ఫోన్ నెంబర్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఆ నెంబర్ సైతం సక్రమంగా పని చేయడం లేదంటూ ప్రజల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. ప్రజల విజ్ఞప్తుల మేరకు ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు గడువును మరో నెలరోజులు పెంచాలని నిర్ణయించింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఉరుములు, మెరుపులతో వర్షాలు

ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూ ఉపరితలం వేడెక్కడంతో పాటు ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఈ నెల 5వ తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు. ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయన్నారు. గంటకు 40నుంచి 50కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలు వీస్తాయన్నారు. ఈ నేపథ్యంలో ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశామన్నారు. మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాలకు ఆరెంజ్ మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఈ నెల 4,5 తేదీల్లో ఎల్లో హెచ్చరికలు జారీ చేశామని తెలిపారు. ద్రోణి ప్రభావంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీల తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. రాష్ట్రానికి వర్షసూచన ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## ఐపిఎల్ టికెట్లపై ముగిసిన వివాదం

హెచ్‌సిఎ-ఎస్ఆర్‌హెచ్ అవగాహన ఒప్పందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ టికెట్లపై హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్)ల మధ్య నెలకొన్న వివాదానికి తెరపడినట్లు తెలిసింది. ఉప్పల్ స్టేడియంలో కాంప్లిమెంటరీ టికెట్ల వివాదంపై హెచ్‌సిఎ–ఎస్ఆర్‌హెచ్‌లు అవగాహన ఒప్పందానికి వచ్చినట్లు సమాచారం. ఒప్పందం ప్రకారం పది శాతం టికెట్లు ఇస్తామని ఎస్ఆర్‌హెచ్ స్పష్టం చేసింది. గతంలోలా అన్ని కేటగిరిల్లో పాసులు కేటాయించాలని హెచ్‌సిఎ కోరింది. దీనిపై ఎస్ఆర్‌హెచ్ సిఇఒ షణ్ముగంతో ఇరు వర్గాల ప్రతిని ధులు ఫోన్లో మాట్లాడారు. హెచ్‌సిఎకు కేటాయించే టికెట్లు యథావిధిగా కొన సాగుతాయని షణ్ముగం వెల్లడించారు. ఈ భేటీతో టికెట్లపై వివాదం సద్దుమణిగి నట్లు తెలుస్తోంది. ఎస్ఆర్‌హెచ్, హెచ్‌సిఎ బిసిసిఐ మధ్య జరిగిన త్రైపాక్షిక ఒప్పందాన్ని పాటించాలని ఎస్ఆర్‌హెచ్ ప్రతిపాదించింది. పాత ఒప్పందం ప్రకారమే స్టేడియం సామర్థ్యంలోని 10 శాతం కాంప్లిమెంటరీ పాసులను హెచ్‌సిఎకు కేటాయించనున్నారు. ఉప్పల్ స్టేడియంలో ఐపిఎల్ మ్యాచ్లను విజయవంతంగా నిర్వహించేందుకు ఎస్ఆర్‌హెచ్‌కు పూర్తిగా సహకరిస్తామని హెచ్‌సిఎ హామీ ఇచ్చింది.

## చర్లపల్లి జైలును సందర్శించిన ఐఎఎస్ ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్లుగా విధులు నిర్వహిస్తున్న ఐఎఎస్ అధికారులు శిక్షణలో భాగంగా బుధవారం చర్లపల్లి జైలును సందర్శించారు. ఈ సందర్భంగా జైలు వాతావరణం, పరిశ్రమలు, ఖైదీలకు అందించే సౌకర్యాల గురించి జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా ప్రత్యక్ష అవగాహన కల్పించారు. ఖైదీల సంస్కరణలు, పునరావాస వ్యూహా ల యొక్క ముఖ్యమైన అంశాలను ట్రైనీ ఐఎఎస్‌లకు వివరించారు. చర్లపల్లి జైలును సందర్శించిన ట్రైనీ ఐఎఎస్ అధికారులు వికారాబాద్ అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, సంగారెడ్డి అసిస్టెంట్ కలెక్టర్ ఇఎన్.ఎన్.డి. మనోజ్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా వీరు జైలు పనితీరును పరిశీలించారు. ఇందులో సంక్షేమ కార్యక్రమాలు, వృత్తి శిక్షణ పరిశ్రమలు, ఖైదీలకు వివిధ పునరావాస కార్యకలాపాల అధ్యాయనం చేశారు. ఖైదీల చికిత్స, జైలు సిబ్బంది నిర్వహించే కార్యాచరణ ప్రోటోకాల్ల గురించి కూడా వారు తెలుసుకున్నారు.

## బెంగళూరులో దొరికిన పుల్లయ్య



చిట్టీల పేరుతో రూ.100 కోట్లు గోల్‌మాల్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** చిట్టీల పేరుతో వేలాది మంది నుంచి రూ.100 కోట్లు దోచుకుని పరారీలో ఉన్న నిందితుడు పుల్లయ్యను సిసిఎస్ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. బెంగుళూరులో తలదాచుకున్నాడనే సమాచారం మేరకు సిసిఎస్‌కు చెందిన దర్యాప్తు బృందం అక్కడికి వెళ్లి అతన్ని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. పక్షం రోజుల క్రితం ప్రజలకు శఠగోపం పెట్టి పారిపోయిన పుల్లయ్యపై బాధితులు మొదట పంజగుట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయించారు. అయితే కేసు పెద్దది కావడంతో సిసిఎస్‌కు బదిలీ చేశారు. విచారణ నిమిత్తం బుధవారం పుల్లయ్యను పంజగుట్టలోని అతని నివాసానికి తీసుకువచ్చారు. సమాచారం అందుకున్న బాధితులు వందలాదిగా అక్కడికి చేరుకోవడం ఉద్రిక్తత నెలకొంది. పుల్లయ్య ఇంట్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. చిట్టీలు కట్టి మోసపోయామని పోలీసులకు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి చిట్టీల రూపంలో దోచుకున్న సుమారు రూ.100 కోట్లను బెంగుళూరులో పెట్టుబడులు పెట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## ఆర్‌టిసి లాభాలలో ఉండగా.. ఒకే దఫా జీతాలు ఎందుకివ్వరు?

అన్ని కేటగిరి ఉద్యోగులకు ఒకేరోజు వేతనాలు చెల్లించాలి

ప్రభుత్వం, యాజమాన్యాన్ని డిమాండ్ చేసిన టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసిలో రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులకు ఒకే రోజు వేతనాలు చెల్లించాలని టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి డిమాండ్ చేసింది. ప్రతి నెల ఒకటవ తేదీన అన్ని కేటగిరిలలో వేతనాలు ఇచ్చే సాంప్రదాయాన్ని తుంగలో తొక్కిన ఆర్‌టిసి ఎం.డి. మహాలక్ష్మి డబ్బులతో ఆర్‌టిసికి లాభాలు వస్తున్నా విడతల వారిగా విభజించి, డ్రైవర్లకు ఒకరోజు, కండక్టర్లకు మరో రోజు, గ్యారేజి సిబ్బందికి ఇంకో రోజు, మిగిలిన ఉద్యోగులకు దశలవారిగా జీతాలు చెల్లించటాన్ని జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, కోఛైర్మన్ కె.హన్మం తు ముదిరాజ్, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎం.డి. మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి తీవ్రంగా ఖండించారు. ఆర్‌టిసిలో ఎన్నడూ లేని విధంగా యజమాన్యం కేటగిరిల వారిగా జీతాలు ఇచ్చే విధానాన్ని వెంటనే మానుకోవాలన్నారు. ఒకేరోజు ఉద్యోగులందరికీ జీతాలు చెల్లించే విధంగా ఎండి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సకాలంలో జీతాలు అందకపోవడంతో కార్మికులలో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. చాలామంది ఉద్యోగులు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారని, వాటిమీద వడ్డీభారం పడి ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌టిసి అభివృద్ధి చెందుతోందని, కార్మికులకు రావాల్సిన ప్రయోజనాలన్నింటిని కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఆర్‌టిసి కార్మికులకు జీతాలు చెల్లించడంలో విఫలమైందని విమర్శించారు. కావున వెంటనే ఆర్‌టిసి ఉద్యోగులందరికీ ప్రతినెల ఒకటవ తేదీనే జీతాలు చెల్లించి, ఇచ్చిన మాటను ఎం.డి నిలబెట్టుకోవాలని జెఎసి నాయకులు కోరారు.

## హెచ్‌సియు విద్యార్థులపై లాఠీచార్జ్

మెయిన్ గేట్ వద్ద స్టూడెంట్స్ ఆందోళనతో రెచ్చిపోయి చితకబాదిన పోలీసులు



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** హైదరాబాద్ సెంట్రల్ యూనిర్సిటీ (హెచ్‌సియు) వద్ద ఆందోళనలు రోజు రోజుకూ ఉధృతం అవుతున్నాయి. ఓ వైపు విద్యార్థులు, అధ్యాపకులు మరోవైపు వివిధ పార్టీలు ప్రజా సంఘాల నాయకులు నిరసనలు కొనసాగిస్తున్నారు. బుధవారం ఉదయం గ్రూపులుగా ఏర్పడి విద్యార్థులు విడతలవారీగా హెచ్‌సి యు మెయిన్ గేట్ వద్ద ఆందోళనకు దిగారు. వారిని అడ్డుకున్న పోలీసులు లాఠీ చార్జ్ చేస్తూ స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు విచక్షణారహితంగా విద్యార్థులను చితకబాదారు. తప్పించుకోకుండా తాళ్లతో అడ్డుకుని మరీ లాఠీలు ఝులిపించారు. ఎవరికి ఎక్కడ దెబ్బలు తగుల్తాయో అని కూడా చూడకుండా రెచ్చిపోయి కొట్టారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. యూనివర్సిటీలోకి వెళ్లి పోలీసులు విద్యార్థులపై దాడి చేయడాన్ని పలువురు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

## హెచ్‌సియు భూముల అమ్మకాన్ని అడ్డుకుంటాం

బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మకాన్ని అడ్డుకుని తీరుతామని బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి అన్నారు. హెచ్‌సియు భూముల అమ్మకాన్ని నిరసిస్తూ బిజెపి మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర సచివాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. దీంతో వారిని పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకుని బొల్లారం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా శిల్పారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6గ్యారంటీలను విస్మరించి భూముల అమ్మకానికి కుట్ర పన్నుతోందని ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. మహిళా కార్యకర్తలపై పోలీసులు అప్రజాస్వామికంగా వ్యవహరించడం, శాంతియుతంగా నిరసన వారిని పోలీసులు అక్రమంగా చేయడం దుర్మార్గ చర్య అన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ ధోరణికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు పెట్టినహెచ్ సీయూ 400 ఎకరాల భూమి అమ్మకాన్ని అడ్డుకుని తీరుతామని శిల్పారెడ్డి తెలిపారు.

## ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు

మంత్రి జూపల్లి కృష్ణారావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించింది కాదని, హెచ్‌సియులో నుంచి ఒక్క సెంటు భూమిని కూడా తీసుకోలేదు అని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై గాంధీ భవన్‌లో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. రాజకీయ లబ్ది కోసం ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఆ పార్టీలు విద్యార్థులను పావులుగా వాడుకుంటున్నాయని, వారి వలలో పడవద్దని విద్యార్థులకు హితవు పలికారు.

20 ఏండ్లుగా న్యాయ వివాదంలో ఉన్న కంచ భూముల విషయంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని, వాటిని కాపాడేందుకు అప్పుడు ఎందుకు ప్రయత్నాలు చేయలేదని ప్రశ్నించారు. ఆ భూములను కాజేసేందుకు ప్రైవేట్ వ్యక్తులకు కొమ్ముకాసేలా వ్యవహరించారని, అందుకే గతంలో నోరు మెదపలేదని చెప్పారు. పాత్రదారులు, సూత్రదారులు ఎవరో ప్రజలకు తెలుసునని అన్నారు. ఎంతో విలువైన కంచ భూములను ప్రైవేట్ వ్యక్తుల పరం కాకుండా సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం న్యాయస్థానాల ముందు బలమైన వాదనలు వినిపించిందని, ఈ నేపథ్యంలోనే ఆ భూములు ప్రభుత్వానికి దక్కాయని పేర్కొన్నారు. అప్పుడు ప్రయివేట్ కంపెనీకి 400 ఎకరాలు వెళ్తే బిజెపి, బిఆర్ఎస్ నాయకులకు ఇబ్బంది అనిపించలేదని, ఆ భూములు ఇప్పుడు ప్రభుత్వం పరమైతే గగ్గోలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడం, రాష్ట్ర ఆదాయం పెరిగేలా కంచ భూములను టీజీఐఐసీకి అప్పగించిందని, హైటెక్ సీటి, ఫైనాన్స్ డిస్ట్రిక్ట్ తరహాలో ఆ ప్రాంతంలో సంస్థలను నెలకొల్పి రాష్ట్రానికి మేలు జరిగేలా చూస్తామని తెలిపారు. గత బిఆర్ఎస్ పాలనలో రూ. 31 వేల కోట్ల విలువైన 453 ఎకరాల ప్రభుత్వ భూములను అమ్మిందని, అప్పుడు ఇల్లు గుల్ల చేసి, ఇప్పుడు పెడబొబ్బలు పెడుతుందని ఎద్దేవా చేశారు. అంతేకాకుండా వేల కోట్ల రూపాయాల విలువ చేసే భూములను బిఆర్ఎస్ పార్టీకి కేటాయించుకున్నారని, దేశంలో ఏ పార్టీకి రాని పార్టీ ఫండ్స్ బిఆర్ఎస్ కే ఎలా వచ్చాయని నిలదీశారు. ప్రభుత్వ ఆస్తులను, ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పోరేట్ కంపనీలకు ధారదత్తం చేసిందని, ఇప్పుడు అదే బీజేపీ నేతలు తెలంగాణలో అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశంలో గత పదేళ్లల్లో 16 లక్షల ఎకరాల అడవిని నాశనం చేసిన అధికార బిజెపికి కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలపై మాట్లాడే నైతిక హక్కు ఉందా? అని ప్రశ్నించారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్ గర్హనీయం

ఎఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థులపై లాఠీఛార్జ్ గర్హనీయమని, ఇందుకు పాల్పడిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని మగ్దూంభవన్‌లోని రాజ్ బహదూర్ హాల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ భూముల విషయంలో మొండిగా వ్యవహరించడం సరికాదని, ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడమే కాకుండా ఇప్పటికే పలువురి విద్యార్థి నాయకులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కి తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాపాడుతాం అంటూనే మరో వైపు విద్యార్థి హక్కులను కాలరాస్తూ... వారి స్వేచ్ఛను హరించే ప్రక్రియ చేపట్టడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలి కానీ, కార్పోరేట్ సంస్థలకు కట్టబెట్టే దానికోసం కాదన్నారు. పోలీస్ బలగాలను వెంటనే వెనక్కి పిలవాలని, జెసిబిలు, బుల్డోజర్లు వెనక్కి పంపించి ప్రభుత్వ భూమిని వెంటనే యూనివర్సిటీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, అరుణ్, హరీష్, సందీప్, కృష్ణ, సాయి, వెంకటేష్, శ్రావణి, ఆకాష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## 400 ఎకరాలు ప్రభుత్వ భూమి అయితే.. దొంగల్లాగా అర్ధరాత్రి ఎందుకు వెళ్లాలి?

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ భూములపై రాష్ట్ర ప్రభుత్వానికి హక్కు ఉంటుందని, కానీ పార్కులను, అడవులను ప్రభుత్వం విక్రయిస్తుందా అని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీశ్ రెడ్డి అన్నారు. కంచ గచ్చిబౌలిలో ఉన్న నాలుగువందల ఎకరాలు రాష్ట్ర ప్రభుత్వానిదే అయితే, దొంగల్లాగ అర్ధరాత్రి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. ఈ భూముల్లో ప్రభుత్వ పెద్దల చీకటి కోణం ఉన్నదని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగదీష్ రెడ్డి మాట్లాడుతూ భూమి కావాలంటే ఫోర్త్ సిటీలో, ఫ్యూచర్ సిటీలో ఉన్న భూమి ఇచ్చుకోవచ్చు కదా అని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీపైన సిఎం రేవంత్ రెడ్డికి హక్కు లేదని, సెంట్రల్ యూనివర్సిటీలో ఎన్ని ఎకరాల స్థలం ఉన్నదో కూడా ఇప్పటి వరకు తెలియదన్నారు. గురువు తరహా అద్భుతమైన ఫోర్త్ సిటీ నిర్మిస్తామని సిఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారన్నారు. ఐటీ పార్కులు ఫోర్త్ సిటీలో ఎందుకు కట్టకూడదని ప్రశ్నించారు. సెంట్రల్ యూనివర్సిటీలో మూడు చెరువులు ఉన్నాయని, హైడ్రా కమిషనర్ రంగనాథ్ మరి ఎక్కడికి వెళ్లారో తెలియడం లేదని ఎద్దేవా చేశారు. పేయిడ్ బ్యాచ్ అని చెబుతున్నారని, 'సేవ్ హెచ్‌సియు' అనే నినాదానికి లక్షల మంది మద్దతు తెలిపారని, వీరంతా పేయిడ్ బ్యాచ్‌నేనా అని అన్నారు. తమిళనాడు కాంగ్రెస్ ఎంపి కార్తీ చిదంబరం కూడా హెచ్‌సియు విద్యార్థులకు అండగా నిలిచారన్నారు. కేంద్ర మంత్రు లు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు చిత్తశుద్ధి ఉంటే సెంట్రల్ యూనివర్సిటీలోకి పోలీసులు రాకుండా అడ్డుకోవచ్చని తెలిపారు. బిజెపి సహాయంతోనే సిఎం రేవంత్ రెడ్డి 400 ఎకరాల భూమిని తీసుకుంటున్నారని ఆరోపించారు.

## వ్యవసాయం, రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు

దీనిని జీర్ణించుకోలేకనే బిఆర్ఎస్ నాయకుల విమర్శలు : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వ్యవసాయం, రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తీసుకున్న అనేక విప్లత్మాకమైన నిర్ణయాలతో నేడు వ్యవసాయ రంగంలో నూతన మార్పులకు నాంది పలకడమే కాకుండా దేశానికే తెలంగాణ రాష్ట్రం దశ, దిశ చూపుతోందని దీనిని జీర్ణించుకోలేకనే బిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పు ఏమిటో చెప్పాలని బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని, పంటలసాగు విస్తీర్ణంతో పాటు పెరిగిన దిగుబడులే మా ప్రభుత్వ మార్పుకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో రూ.5000 ఇచ్చి, వివిధ సబ్సిడీ పథకాల కింద రైతులకు దక్కాల్సిన రూ.15000 లబ్ధిని మీ పాలనలో ఎగనామం పెడితే అదే కాంగ్రెస్ ప్రభు త్వం రైతు భరోసా రూ.12 వేలు ఇవ్వడంతో పాటు, ఈ పథకాలన్నింటిని పునరుద్ధరించి రైతును రాజును చేసే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి పంటకాలంలోనే ఒకే దఫా రూ. 20,616 కోట్ల మేర రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. సంవత్సర కాలంలోనే రైతు అకౌంట్లలో నేరుగా ఇప్పటికే రూ. 34,667 కోట్లు జమ చేయడం ద్వారా ఒక సువర్ణాధ్యాయాన్ని లిఖిస్తున్న ఈ ప్రజా ప్రభుత్వంపై అధికారం కోల్పోయిన కల్వకుంట్ల కుటుంబ సభ్యులు వారి అక్కసును మింగలేక, కక్కలేక రైతాంగం పేరుతో చేస్తున్న దుష్ప్రచారాన్ని తెలంగాణ రైతాంగం నమ్మే స్థితిలో లేరన్నారు. బిఆర్ఎస్ హాయంలో వరి వేస్తే ఉరే అన్న అన్న స్థితి నుండి సన్నాలకు బోనస్ ఇచ్చి రైతులను ప్రోత్సహించడం ద్వారా పేద కుటుంబాలకు పిడిఎస్ ద్వారా ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. మీ ప్రభుత్వం చేస్తామని చెప్పిన లక్షలోపు రుణాన్ని కూడా ముక్కుతూ, ములుగుతూ వాయిదా పద్ధతిలో చెల్లించగా, మొదటి పంటకాలంలోనే ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.2 లక్షలలోపు ఉన్న రుణా న్ని ఏకకాలంలో మాఫీ చేసిన మా ప్రభుత్వాన్ని విమర్శించడమా అని ప్రశ్నించారు. మీ ప్రభుత్వ హాయాంలో పామాయిల్ సాగును పట్టించుకున్న పాపాన పోలేదని, పామాయిల్ గెలల ధర తగ్గుతున్న కూడా ధరల పెంపు కోసం ఎలాంటి ప్రయత్నాలు చేయలేదని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 15 నెలల కాలంలోనే పామాయిల్ గెలల ధర రూ.8500కి పెంచేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇలాంటి అనేక కార్యక్రమాలను చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ నేతలు రాజకీయ విమర్శలు మానుకుంటే మంచిదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హితవు పలికారు.

## గచ్చిబౌలి భూములపై బిజెపి, బిఆర్ఎస్ రాద్ధాంతం తగదు

టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**ప్రజాపసక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ కంచ గచ్చిబౌలిలో400 ఎకరాల ప్రభుత్వ భూమిని హెచ్‌సియు భూములంటూ బిజెపి, బిఆర్ఎస్ నాయకులు రాద్ధాంతం చేయడం వారి అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వాస్తవానికి ఈ 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు 2003లో ఐఎంజీ అకాడమీస్ సంస్థకు కేటాయించారని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఐఎంజీ అకాడమీస్ సంస్థకు భూమిని కేటాయించిన ఉత్తర్వులను రద్దు చేసి, 2006 నవంబరులో ఏపీ యూత్ అడ్వాన్స్ మెంట్ టూరిజం, కల్చరల్ డిపార్టుమెంటుకు కేటాయించారన్నారు. అయితే తమకు కేటాయించిన భూమి బదలాయింపు రద్దుపై ఐఎంజీ అకాడమీస్ సంస్థ 2006లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడం, అందులో ప్రతివాదులుగా న్యాయ, శాసన వ్యవహారాలశాఖ, యూత్, టూరిజం, కల్చరల్ డిపార్టుమెంట్, క్రీడాశాఖ విసి ఎండితోపాటు, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, శేరిలింగంపల్లి తహసీల్దార్, పైన అన్ని శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలను చేర్చడం జరిగిందన్నారు. మరీ బిజెపి బిఆర్ఎస్ నాయకులు ఆ భూములు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీవి అయితే హెచ్.సి.యూ అధికారులను కూడా కేసులో ప్రతివాదులుగా చేర్చేవారు కదా? దీన్నిబట్టి ఈ భూములు సెంట్రల్ యూనివర్సిటీవి కావని స్పష్టమవుతుందని బండి సుధాకర్ గౌడ్ వివరించారు.

## బిసి సంఘాల ముసుగులో కాంగ్రెస్ ధర్నాలు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి సంఘాల ముసుగులో బిసి రిజర్వేషన్ల పేరుతో బుధవారం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధర్నా చేయడం హాస్యస్పదమని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. బిసిరిజర్వేషన్లు కల్పించడంలో సిఎం రేవంత్ రెడ్డికి మాత్రం చిత్తశుద్ధి లేదని తాము పదే పదే చెబుతునే ఉన్నామని, ఇప్పుడు మరోసారి నిరూపితమైందని ఆయన పేర్కొన్నారు. బిసిలకు రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చిన సిఎం ఇప్పుడు ఆ నెపాన్ని కేంద్రంపై నెడుతున్నారని, బిసి రిజర్వేషన్ల పెంపు మీ పరిధిలో లేకపోతే, ఎలా హామీ ఇచ్చారని ప్రశ్నించారు. బిసిలను కేవలం ఓటుబ్యాంకుగానే చూస్తున్న రేవంత్ రెడ్డికి ఎంతసేపూ వారిని వాడుకొని వదిలేయాలన్న ఆలోచనే తప్పితే వారి అభివృద్ధి కాదని, అందుకే రిజర్వేషన్లు పెంచడం ఇష్టం లేకనే సిఎం డ్రామాలాడుతున్నారన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం బిసిల సంక్షేమం, అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తోందని, బిసి జాతీయ కమిషన్‌కు రాజ్యాంగబద్ధతను కల్పించింది మోదీ ప్రభుత్వమే అన్నారు.

**42 శాతం రిజర్వేషన్ల అమలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే : బండి**

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 ప్రకారం ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం సొంతంగా డెడికేషన్ కమిషన్ వేసుకుని చట్ట ప్రకారం బిసి రిజర్వేషన్లను అమలు చేసుకునే అధికారం ఉందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో పొందుపర్చే సమయంలో మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఒప్పుకుంటేనే అమలు చేస్తామని వారు చెప్పారా అన్ని ప్రశ్నించారు. మరి ఇప్పుడెందుకు మోదీ ప్రభుత్వంపై నెట్టి తప్పించుకోవాలని చూస్తున్నారన్నారు. మతపరమైన రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకమని ఆయన స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ స్వప్రయోజనాల కోసమే బిసి రిజర్వేషన్ల అంశం : లక్ష్మ ణ్**

తెలంగాణ రాష్ట్రంలో బిసి రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటూ, బీసీలను మరోసారి మోసం చేయడానికి కుట్రపన్నుతోందని బిజెపి రాజ్యసభ సభ్యులు, ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మ ణ్ విమర్శించారు. బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చాలన్న కాంగ్రెస్ పార్టీ ప్రకటన పూర్తి మోసపూరితమైందన్నారు.

**కాంగ్రెస్ ధర్నా దయ్యాలు వేదాలు వల్లించడమే : పాయల్ శంకర్**

బిసిల కోస ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నాలు చేయడమంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టుందని బిజెపి శాసనసభాపక్ష ఉపనాయకులు శంకర్ అన్నారు. బిసిల అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడింది కాంగ్రెస్, బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకించింది కాంగ్రెస్, అలాంటి కాంగ్రెస్ ఇప్పుడొచ్చి బీసీల కోసం ధర్నా చేస్తున్నామంటే నమ్మేందుకు ప్రజలు, ముఖ్యంగా బీసీలెవరూ సిద్ధంగా లేరని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ బిసిల పట్ల మొసలి కన్నీరు కారుస్తోందని బిజెపి ఎంఎల్‌ఎ రామారావు పటేల్ విమర్శించారు. బిసిలకు 42 శాతం హామీ ఇస్తామన్న కాంగ్రెస్, దానిని అమలు చేసే ఉద్దేశ్యం లేక బుధవారం ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర ధర్నా పేరుతో డ్రామాలు చేస్తోందని అగ్రహాం వ్యక్తం చేశారు. ఇలానే నీచ రాజకీయాలకు పాల్పడితే బీసీల ఆగ్రహ జ్వాలలో కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయమని హెచ్చరించారు.

## పార్ట్‌టైం గెస్ట్ లెక్చరర్లు, గెస్ట్ ఫ్యాకల్టీల కనీస వేతనం రూ.50వేలకు పెంచాలి

సిఎంకు జాన్ వెస్లీ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో అతి తక్కువ వేతనాలతో గెస్ట్ లెక్చరర్లు, గెస్ట్ ఫ్యాకల్టీగా, పార్ట్ టైం విధులను నిర్వహిస్తున్న వారికి కనీసం వేతనం రూ.50వేలకు పెంచాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సిఎం రేవంత్‌రెడ్డికి జాన్ వెస్లీ లేఖ శారు. గత 20 ఏళ్లగా 1240 మంది గెస్ట్ లెక్చరర్లు, గెస్ట్ ఫ్యాకల్టీగా, పార్ట్ టైం ఉద్యోగాలను చేస్తున్నారనివీరికి సాధారణ సెలవులతో పాటు, కనీస వేతనం ఇవ్వడం లేదని, పని గంటలు పెరిగినా పనికి తగ్గట్టుగా వేతనం మాత్రం పెంచకుండా. నెలకు కేవలం రు.28వేల వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని ఈ లేఖలో పేర్కొన్నారు. దీంతో వారు కుటుంబాలను పోషించుకోలేక, ఇంటి అద్దెలు కట్టలేక, పిల్లలను చదివించుకోలేని పరిస్థితిల్లో ఉన్నారని, గత ఎన్నికల కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకువ వీరందరకి నెలకు రూ.50వేల వేతనం పెంచాలని కోరారు. అదేవిధంగా యూనివర్సిటీల్లో, కళాశాలల్లో దాదాపు 1940 పోస్టులు ఖాళీలు ఉన్నాయని. ఇందుకు తగ్గవిద్యార్హతలు కూడా వీరికి ఉన్నాయని ఆఖాళీలను వీరితో భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజాపక్షం
గురువారం, ఏప్రిల్ 03

# భారత్ – చైనా @ 75

ఏప్రిల్ 1 : ప్రపంచంలోనే అతిపెద్ద జనాభా గలిగిన రెండు ఆసియా దేశాలకు శుభదినం. అది భారత్–చైనా దౌత్య సంబంధాల స్థాపన 75వ వార్షికోత్సవ దినం. బ్రిటిష్‌వారి వలస పాలనలో నలిగి నలిసిన భారతదేశం 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సంపాదించుకోగా, బ్రిటీష్, జపాన్ వలస పాలన, జాతీయవాదులనబడే రాచరిక దోపిడీ పాలననుంచి విముక్తి పొందిన చైనా 1949 అక్టోబర్ 1న మావోసేటుంగ్ (మావో జెడాంగ్) నాయకత్వాన ఎర్రజెండా వెలుగుల్లో 'చైనా ప్రజా రిపబ్లిక్'గా అవతరించింది. ఈ రెండు నవ స్వతంత్ర రాజ్యాలు ఎంచుకున్న అభివృద్ధి మార్గాలు వేరైనా ఇరుగుపొరుగు దేశాలుగా 1950 ఏప్రిల్ 1న దౌత్యసంబంధాలు నెలకొల్పుకున్నాయి. సామ్రాజ్యవాద దేశాలు చైనా ప్రధాన భూభాగం నుంచి పారిపోయిన కమ్యూనిస్టు వ్యతిరేకులు తలదాచుకున్న తైవాన్‌ను అధికారిక చైనాగా గుర్తించగా, భారత్ దాన్ని తిరస్కరించింది. జనచైనాతో దౌత్యసంబంధం ఏర్పరుచుకున్న తొలి సోషలిస్టు బ్లాక్ యేతర దేశం భారత్. అదీ జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలోని మన జాతీయ ప్రభుత్వం చైనా విప్లవానికిచ్చిన గుర్తింపు. రెండు రాజధానుల్లో ఇండీ–చీనీ భాయ్ భాయ్ నినాదాలు ప్రతిఫలించాయి. ప్రజల మధ్య సుహృద్భావ సంబంధాలు వెల్లివిరిశాయి. అయితే సరిహద్దు వివాదం సాకుగా 1962లో మనదేశంపై చైనా యుద్ధానికి దిగటం కడివెడు పాలలో విషపు చుక్క చందమైంది. కమ్యూనిస్టు ఉద్యమానికీ తీరని హాని చేసింది మావోయిజం. చైనాలో అంతర్గత పరిణామాలతో మావో జెడాంగ్‌ను అధికారంనుండి తొలగించాక డెంగ్ సియావో పింగ్ హయాంలో ప్రధాని లీఫెంగ్ ఆహ్వానంపై ప్రధాని రాజీవ్‌గాంధీ పర్యటనతో 1988 డిసెంబర్‌లోగాని ఇరుదేశాల మధ్య సంబంధాల పునఃప్రారంభం కాలేదు. అంటే చెట్టపట్టాలతో వృద్ధి చెందాల్సిన సంబంధాలకు మహాబ్రేకు పడింది. అయినా ఇప్పటికీ ఆ నేపథ్యం వెంటాడు తూనే ఉంది. అనుమాన తెరలు కొనసాగుతున్నాయి. 2020లో లఢాక్‌లో వాస్తవాధీన రేఖ వద్ద ఇరుదేశాల సైన్యాల పిడిగుద్దుల కోట్లాటలో 20 మంది భారత సైనికులు మరణించటం రిపేరు జరుగుతున్న భారత్–చైనా సంబంధాలకు మళ్లీ గండిపడింది. వైషమ్యాలను అధిగమించి స్నేహ, సుహృద్భావ బాటలో వెడదామని ఇరుదేశాలు సంకల్పం చెప్పుకోవటానికి నాలుగేళ్లు పట్టింది.

ఉభయ దేశాల మధ్య దౌత్యసంబంధాల స్థాపన 75వ వార్షికోత్సవం సందర్భంగా దేశాధినేతల పరస్పర సుహృద్భావ సందేశాలు హర్షించదగినవి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ వ్యవస్థలు వేటినీ లక్ష్యపెట్టకుండా ఒంటెత్తు పోకడతో ప్రపంచ దేశాలపై సుంకాల దాడి సాగిస్తున్న నేపథ్యంలో శక్తిమంతమైన ఆర్థిక కూటములు ఏర్పాటు చేసుకోవటం ఎంతైనా అవసరం. బహుళపక్ష ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పరిరక్షించుకోవాలంటే ఎక్కడికక్కడ ద్విపక్ష, బహుళపక్ష ఆర్థిక ఒడంబడికల ద్వారా తమ దేశాల మధ్య వాణిజ్యం పెంచుకుంటూ అమెరికాపై ఆధారపడడం తగ్గించుకోవటం అవసరం. ఈ సందర్భంగా భారత్–చైనా నేతల సందేశాలు వ్యక్తం చేసిన మనోభావాలకు ప్రాధాన్యత ఉంది. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు 'డ్రాగన్– ఎలిఫెంట్ జమిలి నృత్యం లాగా' ఉండాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపిన సందేశంలో ఆశించారు. ముర్ము తమ జవాబులో ఎంతో అర్థయుక్తంగా, ''స్థిరమైన, ఊహించదగిన, మైత్రీపూర్వక ద్వైపాక్షిక సంబంధాలు రెండు దేశాలకు, ప్రపంచానికి మేలు చేస్తాయన్నా''రు. చైనా ప్రధాని లీ క్వియాంగ్ సందేశానికి ప్రధాని నరేంద్రమోదీ తమ ప్రతిస్పందనలో, ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకెళ్లటం ప్రపంచ స్థిరత్వాన్ని, సౌభాగ్యాన్ని పెంపొదిస్తుందని అభిభాషించారు. అది బహుళ ధృవ ప్రపంచం ఆవిర్భావాన్ని బలపరుస్తుందన్నారు. ప్రాచీన సంస్కృతులు, నాగరికతలు కలిగిన భారత్, చైనాలు మానవ చరిత్రను తీర్చిదిద్దాయని, శాంతి–అభివృద్ధిని ప్రోత్సహించటం రెండు దేశాల బాధ్యత అన్నారు. ''మన ద్వైపాక్షిక సంబంధాల పురోగతి ప్రపంచ స్థిరత్వం, సౌభాగ్యానికి దోహదం చేయటమే కాకుండా బహుళ ధృవ ప్రపంచ ఆవిర్భావానికి కూడా దోహదం చేస్తుందని'' ప్రధాని నరేంద్రమోదీ ఉగ్గడించారు.

ఇరుదేశాల నేతలు సందర్భోచితమైన మంచిమాటలకే పరిమితం కాకుండా, అభివృద్ధి కృషిలో, ద్విపక్ష సమస్యల పరిష్కారంలో, సహకారంలో ప్రపంచానికి ఆదర్శం కావాలని ఆశించుదాం!

# లోక్‌సభ స్థానాల రాసి కంటే వాసి ముఖ్యం



నంటూ బెనర్జీ

ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద సమాఖ్య ప్రజాస్వామ్య దేశమైన అమెరికా సంయుక్త రాష్ట్రాల(యుఎస్‌ఎ)లో 1913 నుండి హౌజ్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్(ప్రతినిధుల సభ)లోని స్థానాల సంఖ్య 435కే పరిమితమైంది. అలాంటిది జనాభా పెరుగుదలకు అనుగుణంగా మన దేశంలోని అన్ని రాష్ట్రాలలోని లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల నియోజకవర్గాల సంఖ్య, సరిహద్దులను కొత్తగా నిర్ణయించడానికి ఉద్దేశించిన తాజా పునర్విభజన కసరత్తును సమర్థించేందుకు ఎలాంటి కారణం లేదు. దేశంలో అనేక సంవత్సరాల తర్వాత జనాభా లెక్కల ప్రక్రియను చేపట్టబోతున్నారు. వాస్తవానికి భారతదేశం తన జనాభా పెరుగుదలను ఎలా నియంత్రించాలి, చట్టసభలను నిజంగా ఓటర్లకు ఉపయోగపడేలా ఎలా చేయాలి అనే అంశంపై ఎక్కువ ఆందోళన చెందాలి. భారత దేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా రెండేళ్ల క్రితమే చైనాను అధిగమించింది. చైనా భూభాగం పరంగా చూస్తే భారతదేశం కంటే దాదాపు మూడు రెట్లు పెద్దది. ఆదర్శంగా, ప్రస్తుత జనాభా లెక్కల కసరత్తు తర్వాత వాస్తవ ఆర్థిక వృద్ధి నుండి ప్రజలు ప్రయోజనం పొందేందుకు జనాభా పరిమాణాన్ని ఎలా నియంత్రించాలనే విషయంపై భారతదేశం దృష్టి సారించాలి. పునర్విభజన కసరత్తును వెనక్కి పంపాలి.

లోక్‌సభలో వెనుక బెంచీపై కూర్చునే సభ్యులు అదనంగా లేకపోయినా అది బాగా పనిచేస్తుంది. ఎందుకంటే వారు ప్రజా సమస్యలను తక్కువగా లేవనెత్తడం, అరుదుగా చర్చలలో పాల్గొనడం ద్వారా పార్లమెంటు కార్యకలాపాలకు కొద్దిగానే దోహదం చేస్తారు. ప్రతి రాష్ట్రంలో లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల సీట్లు, హద్దులతో పాటు ఆయా సభలలో రిజర్వు చేయబడిన షెడ్యూల్డు కులాలు (ఎస్‌సి), షెడ్యూల్డు తెగల (ఎస్‌సి)ల స్థానాలు కూడా సూచించబడతాయి. రాజ్యాంగంలోని 82, 170 అధికరణలు ప్రకారం ప్రతి జనాభా లెక్కల తర్వాత లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల లోని స్థానాల సంఖ్యను, వాటిని నియోజకవర్గాలుగా విభజించడాన్ని పునర్వ్యవస్థీకరించాలని పేర్కొన్నప్పటికీ, శాసనసభలు, పార్లమెంటు స్థానాల సంఖ్యను స్తంభింపజేసేందుకు ఆ అధికరణలను సవరించాల్సిన అవసరం ఉంది.'పునర్విభజన ప్రక్రియ'ను పార్లమెంటు చట్టం ద్వారా ఏర్పా టు చేయబడిన 'పునర్విభజన కమిషన్' నిర్వహిస్తుంది. గతంలో, 1951, 1961, 1971 జనాభా లెక్కల తర్వాత ఇటువంటి కసరత్తు జరిగింది.

అమెరికాలోని దిగువ సభలోని స్థానాల సంఖ్య 1913 నుండి స్తంభింపజేయబడింది. అయితే దేశ జనాభా దాదాపు నాలుగు రెట్లు పెరిగి 94 మిలియన్ల (9.4 కోట్ల) నుండి గత సంవత్సరం దాదాపు 340 మిలియన్ల (34కోట్ల)కు చేరుకుంది. 1959లో హవాయి, అలస్కా రాష్ట్రాలుగా చేరిన సమయంలో తాత్కాలికంగా స్థానాల సంఖ్యను 437కి పెంచినప్పటికీ, 1911 నాటి అపోర్షన్మెంట్ చట్టం ద్వారా యుఎస్ కాంగ్రెస్ ప్రతినిధుల సభ సంఖ్యను 435కే పరిమితం చేసింది. గత శతాబ్దంలో 1910 జనాభా లెక్కల నుండి యుఎస్ కాంగ్రెస్‌నల్ జిల్లాలు పరిమాణంలో మూడు రెట్లు కంటే ఎక్కువ పెరిగాయి. ప్రతి జిల్లా సుమారు 2,12,000 మంది నివాసితులను కలిగి ఉన్నాయి. సమాఖ్య చట్టంలోని స్టాటిస్టికల్ ఫార్ములా ప్రకారం ప్రతి రాష్ట్రానికి హౌస్ సభ్యుల సంఖ్య నిర్ణయించబడింది. అయినప్పటికీ 1965 నాటి ఓటింగ్ హక్కుల చట్టంలోని వివిధ నిబంధనలకు అనుగుణంగా ప్రతి రాష్ట్రం జిల్లాల ఆకృతిని రూపొందించడానికి బాధ్యత వహిస్తుంది. అదే సమయంలో జాతి మైనారిటీల ఓటింగ్, ప్రాతినిధ్య హక్కులను పరిరక్షించడానికి ప్రయత్నిస్తుంది.

భారతదేశపు అత్యంత అవసరమేమిటంటే పార్లమెంటు, రాష్ట్ర శాసనసభ సభ్యుల నాణ్యతను మెరుగుపరచడం. నేటి అవసరాలను పరిష్కరించడానికి చట్టాల రూపకల్పన వేదికను సమర్థవంతంగా వినియోగించుకోవడం కంటే రాజకీయ పార్టీలు చట్టసభల్లో స్థానాలను పొందడంపైనే ఎక్కువ ఆసక్తిని కనబరుస్తున్నాయి. వారు ఇప్పటికే ఉన్న చట్టాల సామర్థ్యంపై చర్చించి, అవసరమైతే వాటిని సవరించాలి. కొత్త సమస్యలను పరిష్కరించడానికి కొత్త చట్టాలను ప్రవేశపెట్టాలి. రాజకీయ పార్టీలు చట్టసభల్లో స్థానాలను పొందడానికి, ఎన్నికల్లో గెలవడానికి రాజకీయ జ్ఞానం లేని ప్రముఖ సినీ తారలు, వినోద ప్రపంచ ప్రముఖులను నిలబెడుతున్నాయి.

అలాంటి ప్రతినిధులు కేవలం పార్లమెంటులో కుర్చీలలో కూర్చునేందుకే పరిమితమై తమ పదవీ కాలం మొత్తంలో కార్యకలాపాలకు ఎలాంటి దోహదం చేయకపోవడం చూస్తున్నాం. లోక్‌సభ సభ్యులలో 30శాతం కూడా క్రియాశీలంగా పాల్గొనేందుకు ఆసక్తి చూపరు. అప్పుడప్పుడు కొందరు చట్టసభలలో వాడివేడి చర్చల సమయంలో కూడా కలత చెందకుండా నిద్రలో జోగుతూ కనిపిస్తారు. ఒక రాజకీయ పార్టీకి కేవలం పార్లమెంటులో దాని సంఖ్య తప్ప, బహుశా మరేమి ముఖ్యం కాదు.

చట్టసభలలో స్థానాలను పెంచడానికి పునర్విభజన కసరత్తు దురదృష్టవశాత్తు సంఖ్య మీదనే దృష్టి పెట్టవచ్చు. ఇది ఆగాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా, ఈ కసరత్తు అల్ప లేదా ప్రతికూల జనాభా వృద్ధిని కలిగిన రాష్ట్రాలను శిక్షించవచ్చు; దేశ జనాభా విస్ఫోటనానికి దోహదం చేస్తున్న వారికి బహుమతి ఇవ్వవచ్చు. ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదు.

దేశంలోని శాసనసభ్యులు, లోక్‌సభ సభ్యులతో సహా వారి విధి నిర్వహణలో పెద్ద మెరుగుదల లేనప్పటికీ దేశానికి మాత్రం భారీగా ఖర్చవుతుంది. ఉదాహరణకు ఒక ఎంపికి జీతాలు, సౌకర్యాలు, ఇతర ఖర్చులు, ఎంపి లాడ్స్ (పార్లమెంటుసభ్యుల నియోజకవర్గ అభివృద్ధి పథకం)తో సహా సంవత్సరానికి రూ.60 మిలియన్ల (రూ. 6కోట్ల) కంటే ఎక్కువ ఖర్చు కావొచ్చు. 2023 ఏప్రిల్ నుండి అమలులోకి వచ్చే విధంగా ఎంపిల వేతనాలను 24 శాతం పెంచేందుకు జాతీయ ప్రభుత్వం గత వారమే ఆమోదం తెలిపింది. వాస్తవానికి పార్లమెంటు సభ్యుని ప్రధాన పని 'యూనియన్ లిస్ట్' విషయాలపై చట్టాలు చేయడం లేదా సవరణల ద్వారా వాటిని మార్చడం, కేంద్ర ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచడం.

గత ఐదు దశాబ్దాలుగా, భారత పార్లమెంటు 543 లోక్‌సభ ఎంపిలతో పనిచేసింది. అయితే దేశ జనాభా 550 మిలియన్ల (55 కోట్ల) నుండి 1.45 బిలియన్ల (145 కోట్ల)కు పెరిగింది. రానున్న మూడు దశాబ్దాలలో భారతదేశ జనాభా 1.65 –1.70 బిలియన్ల (165 కోట్ల నుంచి 170 కోట్ల) వద్ద గరిష్ట స్థాయికి చేరుకుంటుందని అంచనా వేయగా, ఐక్యరాజ్యసమితి 2060 నాటికి చైనా జనాభా 1.21 బిలియన్ల(121 కోట్ల) వద్ద ఉంటుందని అంచనా వేసింది. 1979 నుండి 2015 వరకు చైనా అమలు చేసిన ఏక సంతాన విధానం చాలా కుటుంబాలను ఒకే బిడ్డకు పరిమితం చేయడం ద్వారా దేశ జనాభా పెరుగుదలను తగ్గించడంలో సహాయపడింది.

**చట్టసభల్లో స్థానాలను పొందడానికి, ఎన్నికల్లో గెలవడానికి రాజకీయ జ్ఞానం లేని ప్రముఖ సినీ తారలు, వినోద ప్రపంచ ప్రముఖులను రాజకీయ పార్టీలు నిలబెడుతున్నాయి. అలాంటి ప్రతినిధులు కేవలం పార్లమెంటులో కుర్చీలలో కూర్చునేందుకే పరిమితమై తమ పదవీ కాలం మొత్తంలో కార్యకలాపాలకు ఎలాంటి దోహదం చేయకపోవడం చూస్తున్నాం. లోక్‌సభ సభ్యుల్లో 30 శాతం మంది కూడా క్రియాశీలంగా పాల్గొనేందుకు ఆసక్తి చూపరు. అప్పుడప్పుడు కొందరు చట్టసభలలో వాడివేడి చర్చల సమయంలో కూడా కలత చెందకుండా నిద్రలో జోగుతూ కనిపిస్తారు. ఒక రాజకీయ పార్టీకి కేవలం పార్లమెంటులో దాని సంఖ్య తప్ప, బహుశా మరేమి ముఖ్యం కాదు.**



భారత ప్రభుత్వం అటువంటి ఆలోచనలను పరిశీలించవచ్చు లేదా చిన్న కుటుంబాలకు బహుమతులు ఇచ్చే, తమ సామాజి క, ఆర్థిక పరిమితులను విస్మరించి అధిక సంతానాన్ని కనే వారిని శిక్షించే వ్యవస్థను అవలంభించవచ్చు.

ఇలాంటి పరిస్థితులలో జనాభా పరిమాణానికి అనుగుణంగా చట్టసభలను విస్తరించడం తప్పటడుగు అవుతుంది. ఇది అనియంత్రిత జనాభా పెరుగుదలను కలిగిన ఇతర రాష్ట్రాల కారణంగా జనాభా నిర్వహణలో మంచి రికార్డు కలిగిన రాష్ట్రాలను ఇబ్బందికరమైన పరిస్థితిల్లోకి నెడుతుంది.

ఇటీవలి సంవత్సరాలలో, భారతదేశంలోని అత్యధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, రాజస్థాన్, జార్ఖండ్, ఒరిస్సా, ఛత్తీస్గఢ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, పంజాబ్ వంటి రాష్ట్రాలు, ఈశాన్య ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలు గుర్తించదగిన స్థాయిలో జనాభా పెరుగుదలను చూశా యి. చట్టసభల పనితీరు సక్రమంగా ఉండేందుకు వీలుగా జనాభా పెరుగుదలతో సంబంధం లేకుండా చట్టసభల పరిమాణాన్ని పరిమితం చేయడం కేంద్రం, రాష్ట్రాలు ఉభయులకు మంచిది. పునర్విభజన కసరత్తు ప్రస్తుతానికైతే వేచి ఉండొచ్చు.

# ఊబకాయ సంక్షోభంలో భారతం



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

ప్రపంచవ్యాప్తంగా 380 కోట్లు లేదా సగానికి పైగా మానవాళి ఊబకాయ సంక్షోభంలో మునిగి అనారోగ్యాల పాలు అవుతున్నట్లు, దాదాపు 75 కోట్ల మంది పిల్లలు, కౌమార యువత కూ డా స్థూల కాయం (ఒబేసిటీ) లేదా అధిక బరువు (ఓవర్ వెయిట్) వలయంలో చిక్కుకున్నట్లు తెలుస్తున్నది. స్థూలకాయ సమస్య ప్రతి ఏటా పెరుగుతూ ప్రమాదకర స్థాయికి చేరడం, 2050 నాటికి 44 కోట్ల వరకు చేరవచ్చని దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించే వరకు పరిస్థితులు దిగజారడం సమస్య తీవ్రతను వివరిస్తున్నది. మార్చి 03, 2025 న విడుదలైన 'ది లాంసెట్ జర్నల్' ప్రచురించిన వ్యాసం ప్రస్తుత 'భారీ భయానక స్థూల కాయ సమస్య తీవ్రతను హెచ్చరికగా పేర్కొనడం జరిగింది. 2021లోనే ప్రపంచ జనాభాలో 45 శాతంవరకు అధిక బరువు లేదా ఊబకాయం గుప్పిట్లో చిక్కుకున్నట్లు తెలిపింది. ప్రపంచ ఊబకాయుల్లో సగానికిపైగా ఎనిమిది దేశాల్లోనే ఉన్నట్లు తెలుస్తున్నది. చైనాలో 40.2 కోట్లు, భారత్‌లో 18 కోట్లు, అమెరికాలో 17.2కోట్లు, బ్రెజిల్ లో 8.8 కోట్లు, రష్యాలో 5.8కోట్లు, ఇండోనేషియాలో 5.2 కోట్లు, ఈజిప్ట్‌లో 4.1 కోట్ల ఊబకాయులు ఉన్నట్లు తెలుస్తున్నది.

**భారత్‌లో ఊబకాయ సమస్య:** భారత్‌లో దాదాపు 10 కోట్లమంది ప్రజలు, ఇందులో 1.5 కోట్లమంది పిల్లలు, ఉదర ఊబకాయ (అబ్డామినల్ ఒబేసిటీ) సమస్యలతో సతమతం అవుతున్నట్లు తెలుస్తున్నది. భారతంలో 12 శాతం పురుషులు, 40 శాతం మహిళలు ఊబకాయం వలలో చిక్కుకొని అనారోగ్యాలపాలు అవుతున్నారు. దేశ ఉదర ఊబకాయుల్లో అత్యధికంగా కేరళలో 65 శాతం, తమిళనాడులో 58 శాతం, పంజాబ్‌లో 63 శాతం, ఢిల్లీలో 59శాతం ఉండగా తక్కువ సంఖ్యలో ఎంపిలో 25 శాతం, ఝార్ఖండ్‌లో 24 శాతం మంది ఉన్నారు. కరోనా కాలపు లాక్‌డౌన్లు, కదలికల నియంత్రణలు, అతిగా విచక్షణారహితంగా తినడం, నిశ్చలంగా కూర్చోవడం, శారీరక శ్రమ కొరవడడం, నవ్య జీవనశైలి మార్పులతో ఊబకాయ సమస్య మరింతగా పెరగడం కూడా గమనించారు. దేశ ప్రధాని గతవారం ప్రసంగిస్తూ ఊబకాయ భారతం దేశానికి పెను శాపంగా మారనుందని, ప్రతి ఒక్కరు శారీరక శ్రమ లేదా వ్యాయామంతో పాటు నూనెల వాడకాన్ని కనీసం 10 శాతం తగ్గించాలని కోరడం విన్నాం. ఊబకాయ సమస్య భారత్ లో పెరుగుతూ 2050 నాటికి చైనాను కూడా అధిగమించవచ్చని స్పష్టం చేస్తున్నారు. 1990లో నాలుగవ ఊబకాయదేశంగా ఉన్న భారతం, 2050 నాటికి 2వ స్థానానికి చేరవచ్చని హెచ్చరికలు చేస్తున్నారు.






**అధిక బరువు, స్థూలకాయాల మధ్య వ్యత్యాసాలు – వాటి ప్రతికూల ప్రభావాలు:**

వ్యక్తి బరువు, ఎత్తుల ఆధారంగా కనుగొనే బాడీ మాస్ ఇండెక్స్ లేదా బిఎంఐ విలువను బట్టి వ్యక్తులను అధిక బరువు లేదా స్థూలకాయులుగా వర్గీకరిస్తారు. బిఎంఐ విలువ 25 నుంచి 30 మధ్య ఉన్నట్లయితే అధిక బరువు లేదా ఓవర్ వెయిట్ అని, 30 దాటితే స్థూలకాయులు లేదా ఒబేసిటిగా నిర్వచించడం జరుగుతున్నది. గత మూడు దశాబ్దాల్లో పిల్లలు/కౌమార యువతలో స్థూలకాయం 244 శాతం వరకు పెరిగిందని, మరో మూడు దశాబ్దాల్లో 121శాతం వరకు పెరగవచ్చని తెలుస్తున్నది. ఊబకాయ సమస్య ఫలితంగా టైప్2 మధుమేహం, గుండె జబ్బులు, ఇతర వ్యాధులు, కొన్ని రకాల క్యాన్సర్లు రావచ్చని హెచ్చరిస్తున్నారు.

2050 నాటికి 65 ఏండ్లు దాటిన వృద్ధుల్లో 4వ వంతు ఊబకాయ ఊబిలో చిక్కుకుంటారని కూడా అంచనా వేస్తున్నారు.

**ఊబకాయ సంక్షోభానికి ప్రధాన కారణాలు:**

అధిక క్యాలరీలతో కూడిన జంక్, ఫాస్ట్, ప్యాకేజ్డ్, ప్రాసెస్డ్, కార్బొనేటెడ్ డ్రింక్స్ వినియోగంతో ఊబకాయం వెంటనే వస్తుందని తెలుసుకోవాలి. ఇలాంటి నోరూరించే ఆహారాలలో షుగర్స్, హానికారక కొవ్వులు, అధిక లవణాలు ఉండడంతో ఊబకాయ ప్రమాదంలోకి చేరుతున్నారు. స్థానిక సాంప్రదాయ ఆహార పదార్థాలకు స్వస్తి పలికి ఇలాంటి ప్రమాదకర ఆహారాలను చూస్తూ లొట్టలేసుకొని తినడం వల్ల బహుమతిగా అధిక బరువు లేదా స్థూలకాయం వస్తున్నదని తెలుసుకోవాలి. స్థానిక ఆహార సరఫరా శృంఖలాలను ఛిద్రం చేస్తూ బహుళ జాతి సంస్థల తళుకుబెళుకుల మాల్స్ వెలుస్తుండడంతో పిల్లలు, యువత ప్రాసెస్డ్ ప్యాకెజ్డ్ ఫుడ్స్‌కు బారులు తీరడం జరుగుతున్నది. ఊబకాయంతో అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగ ఉపాధుల విఘాతాలు చూస్తున్నాం.

పోషకాహారం తీసుకోవడం, జంక్/ఫాస్ట్ ఫుడ్స్ /శీతలపానీయాలకు దూరంగా ఉండడం, స్థానిక ఆహార ఉత్పత్తులను వాడడం, ప్రతి రోజు శారీరక వ్యాయామాలు చేయడం, జీవనశైలిని సానుకూలం గా మార్చుకోవడం, ప్రజలకు అవగాహన కల్పించడం, రేపటి పౌర సమానమైన నేటి పిల్లల్ని ఊబకాయ ఊబిలోకి జారకుండా చూసుకోవడం లాంటివి మనం పాటి స్తే రానున్న రోజుల్లో ఊబకాయాన్ని కరిగించి, తరిమేయడానికి ప్రతిన బూనుదాం, అధిక బరువును అంతం చేద్దాం.

# నేటి నుండి పదోన్నతులు పొందిన టీచర్స్‌కు శిక్షణ

తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో పదోన్నతులు పొందిన ప్రభు త్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఏప్రిల్ 3,4 తేదీలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌లుగా విధులను నిర్వహించి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందిన వారికి, ప్రాథమిక పాఠశాలలలో ఎస్జీటీ లుగా ఉండి ఎల్.ఎఫ్.ఎల్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందిన వారికి, ఎస్జీటీ ఉపాధ్యాయులుగా ఉండి ఉన్నత పాఠశాలలలో స్కూల్ అసిస్టెంట్‌లుగా (తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీ షు, గణితం, భౌతిక శాస్త్రం, బయోలజి, సాంఘిక శాస్త్రం),పి.ఈ.టి ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్)నుంచి పి.డి ( ఫిజికల్ డైరెక్టర్)గా పదోన్నతులు పొందిన వారికి రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు. మారుతున్న కాలానుగుణం గా ఉపాధ్యాయులు మారాల్సిన అవసరం ఆవశ్యకత ఎంతైనా ఉంది. గతంలో బట్టీ చదువులు పోయి కంప్యూటరీకరణ, డిజిటలైజేషన్, శాస్త్ర, సాంకేతిక వైజ్ఞానికరంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిన ప్రస్తుత తరుణంలో ఉపాధ్యాయులు నూతన బోధనా పద్ధతుల ద్వారా విద్యా బోధన చేయడం అవసరం.



**పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ అవసరమా?:**

పదోన్నతులు పొంది ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఉన్నత తరగతులను బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ అవసరం ఎంతైనా ఉంది. ప్రాథమిక పాఠశాల విద్యా విధానం విద్యా వ్యవస్థలో ఉన్నత, ఉన్నతోన్నత చదువులకు ఏ చదువులకైనా పునాది రాయిగా పనిచేస్తుంది. ప్రాథమిక పాఠశాల విద్యా బోధనకు ఉన్నత పాఠశాల విద్యా విధానానికి వ్యత్యాసం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది.

**పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు బోధించేదేమిటి ?**

పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతుల ద్వారా వచ్చే విద్యా సంవత్సరం 2025–2026 బోధన పద్ధతులలో విప్లవాత్మక మార్పులు జరగనున్నాయి. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో డిజిటల్ పద్ధతుల ద్వారా విద్యాబోధన చేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి మొత్తం డిజిటల్ విద్యా విధానం అమలు చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కసరత్తు చేస్తున్నాయి. ఉన్నత పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలను ఆకర్షణీయంగా, ఆకట్టుకునే విధంగా ఏ పద్ధతుల ద్వారా బోధించాలో శిక్షణ ద్వారా తెలియజేస్తారు. తరగతి గదిలో విద్యార్థులకు డిజిటల్ విద్యా విధానం ఏ రకంగా ఉపయోగపడుతుందో శిక్షణ తరగతులు ద్వారా తెలియజేస్తున్నారు. సంవత్సర (వార్షిక) ప్రణాళిక,మాస (నెల ) ప్రణాళిక, పిరియడ్ ప్రణాళిక ఏ విధంగా రాయాలో శిక్షణ ద్వారా తెలియజేస్తుంది

పదవ తరగతి విద్యార్థులకు ఏ విధంగా వార్షిక పరీక్షలకు సిద్ధం చేయాలో పాఠ్య ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఉపాధ్యాయులను పాఠశాల విద్యలో జవాబుదారీతనం పెంచడానికి, ఉపాధ్యాయులలో నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి, తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి ఈ రెండు రోజుల శిక్షణ తరగతులు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

**భాషోపాధ్యాయులకు శిక్షణ అవసరం లేదు:** భాష పండితులు పదోన్నతుల ద్వారా భాషలైన (తెలుగు, హిందీ, ఉర్దూ నియామకం పొందిన తేదీ నుంచి ఆరు నుంచి పదవ తరగతి వరకు బోధిస్తున్నారు.భాష పండితులకు,పి.ఈ.టి లకు పదోన్నతుల ద్వారా హోదా మారింది కానీ వారి బోధనలో ఎలాంటి మార్పు లేదు.దేశీయ భాష లైన తెలుగు, హిందీ, ఉర్దూ మొదలైన భాషలను బోధించే ఉపాధ్యాయులకు కేవలం ఒక్క రోజు మాత్రమే శిక్షణ ఇచ్చి ఇంగ్లీషు, గణితం, భౌతిక శాస్త్రం, బయోలాజి, సాంఘిక శాస్త్రం,పి.డి ( ఫిజికల్ డైరెక్టర్) ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ ఇవ్వడం లో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని భాషోపాధ్యాయులు ఆందోళనను ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

**శిక్షణ అవసరమా ?**

గత సంవత్సరం పదోన్నతులు ఇచ్చి సంవత్సరం మొత్తం పూర్తి చేసుకున్న తర్వాత పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడం వలన ఏమి ప్రయోజనం అని చాలామంది ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఎండలు మండిపోతున్న ప్రస్తుత తరుణంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ పేరుతో శిక్ష మాదిరిగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం లోని 33 జిల్లాలలో గురువారం, శుక్రవారం (ఏప్రిల్ 3,4 తేదీలలో)రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడానికి సన్నాహాలు పూర్తి చేశారు.దూర దూర ప్రాంతాల నుంచి శిక్షణ ఇచ్చే కేంద్రాలకు మండుటెండల్లో వెళ్లి రావడం అనేది ఉపాధ్యాయులకు ఇబ్బంది కరంగ మారింది. పదోన్నతులు ఇచ్చిన వెంటనే శిక్షణ తరగతులు నిర్వహించి ఉంటే బాగుండేదని చాలామంది ఉపాధ్యాయులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ విద్యా శాఖ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ ఇవ్వడం ఎంతోమంది ఉపాధ్యాయులకు ప్రయోజనకరంగా ఉంటుందని అంటున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బోధించే బోధన విధానం ఉన్నత పాఠశాల విద్యార్థులకు బోధించే బోధన విధానంలో వ్యత్యాసం ఎంతో ఉంటుందని రెండు రోజుల శిక్షణ తరగతులు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అంటున్నారు. శిక్షణ తరగతులను తోటి ఉపాధ్యాయులతో కాకుండా తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) ప్రొఫెసర్ ల తో ఇస్తే బాగుంటుందని అనేక మంది ఉపాధ్యాయులు అంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ తరగతులు ఇవ్వడం వలన ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడానికి ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు అంటున్నా రు.

పాఠశాల ప్రారంభం అయిన తరువాత రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉండేదని ఏప్రిల్ 9 నుంచి పాఠశాలల్లో వార్షిక పరీక్షలు ఉన్న సమయంలో ముఖ్యంగా వేసవిలో మండుటెండల్లో దూర ప్రాంతాల్లో రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించి ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం ఇబ్బంది గా ఉందని అంటున్నారు.

డాక్టర్ ఎస్. విజయ భాస్కర్,
డాక్టర్ శ్రీవాణి శ్రీనాథ్
9290826988

# సఫాయి ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలి

లేఖ

హైదరాబాద్ మహానగరం అందమైన పరిశుభ్రత కలిగిన నగరం అని గతంలో ఘనంగా కీర్తింపబడేది. 1973 లో నేను మొట్టమొదటగా హైదరాబాద్ వచ్చినప్పుడు ఆబిడ్స్ జనరల్ పోస్ట్ ఆఫీస్ ముందర ఒక బోర్డును చూశాను. రానురాను పెరుగుతున్న జనాభాతో గృహాలు, గృహాల సముదాయాలు ఆకాశహర్మ్యాలు, పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు విస్తృతస్థాయిలో ఏర్పడి సమయానుకూలమైన యాజమాన్య పద్ధతులు పర్యవేక్షణ అవలంబించకపోవడం వలన ప్రస్తుతం గత కీర్తి ప్రతిష్టలకు నోచుకోవడం లేదు. నగరాన్ని ఉదయంవేళ శుభ్రపరచడానికి సఫాయి ఉద్యోగులు తమ శక్తి వంచన లేకుండా ఏ కాలమైనా విధులను నిర్వహిస్తుంటారు. వీరి సేవలకు పాదాభివందనం చేయవలసిందే. ముఖ్యంగా స్త్రీలు నిర్వహిస్తు న్న తీరును ప్రశంసించ తగినది. వీధులు ఊడ్చుటకు సంవత్సరమునకు ఒకసారి చీపురు కట్టలకు, రక్షణకు కావలసిన చేతి గ్లౌజులు, మాస్కులు, చేతులు శుభ్రం చేసుకోవడానికి హ్యాండ్ వాష్ తో కూడిన కిట్స్‌ను అందజేసేవారని ఈ ఉద్యోగులు తెలుపుతున్నారు. ప్రస్తుతం ఈ కిట్స్‌ను అందజేయడం లేదని వాపోతున్నారు. అంతే కాకుండా వీరి సేవలను కేవలం వీధులు శుభ్రం చేసుకోవడానికే కాకుండా ఇతర పనులకు కూడా ఉపయోగించడం వలన శుభ్రత లోపిస్తున్నది. వాడలల్లో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరికిన తర్వాత వాటిని వాహనాలలో తరలించుటకు వీరి సేవలను ఉపయోగిస్తూ ఉంటారు. ఫలితంగా వాడల శుభ్రత ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఇతర గ్యాంగ్ పనులకు కూడా వీరి సేవలను ఉపయోగిస్తుంటారు. ఆయా కాలనీల గృహాల సంఖ్య జనాభా ఇతరత్రా దృష్టిలో పెట్టుకొని ముగ్గురు లేదా నలుగురుని సఫాయి ఉద్యోగులను కేటాయిస్తుంటారు. ఇందులో ఒకరు వారాంతం సెలవు, మరొకరు స్వంత అవసరాల కోసం సెలవులను తీసుకుంటారు. ఫలితంగా వాడల శుభ్రత లోపిస్తుంది. ఇతర శాఖల్లో ఉన్న విధంగా అదనపు సిబ్బందిని నియమించి వారాంతపు, ఇతరు సెలవులు వినియోగిస్తున్న స్థానంలో ఆయా వాడలలో ఉపయోగించాలి. వీరు ఆరోగ్యవంతంగా ఉండి నగరాన్ని అందమైన విధం గా తీర్చిదిద్దుటకు గాను మెరుగైన వైద్య సౌకర్యాలు ఉచితంగా కల్పించాలి. విధులు నిర్వహిస్తున్నప్పుడు మంచినీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి.

దండంరాజు రాంచందర్ రావు

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రూ.15 వేల వేతన జీవికి రూ.34 కోట్ల ఆదాయపన్ను నోటీసు

**న్యూఢిల్లీ:** కేవలం రూ.15 వేల జీతం సంపాదిస్తున్న ఓ పారిశుధ్య కార్మికుడు ఆదాయ పన్ను విభాగం నుంచి వచ్చిన నోటీసు చూసి కంగుతిన్నాడు. రూ.34 కోట్ల పన్ను చెల్లించాలంటూ అందులో పేర్కొనడంతో షాక్‌కు గురయ్యాడు. దాంతో అతడు పోలీసులను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళితే... ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆగ్రాకు చెందిన కరణ్‌కుమార్ పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నారు. అతడికి ఆదాయపు పన్ను అధికారుల నుంచి నోటీసులు అందాయి. వాటిలో ఏముందో అర్థంకాక తోటివారి సహాయంతో విషయం తెలుసుకున్నారు. ఆందోళనకు గురైన అతడు వెంటనే పోలీసులను ఆశ్రయించారు.'2019-2020లో కరణ్ రూ.34 కోట్ల ఆదాయాన్ని పొందారు. ఆ ఏడాదికి ఎలాంటి రిటర్న్స్ ఫైల్ చేయలేదు' అని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. అతడు ఆగ్రాలోని ఖైర్‌లో ఉన్న ఎస్‌బీఐ బ్రాంచ్‌లో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. తన జీతం రూ.15 వేలని వెల్లడించినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అతడి పాన్ కార్డ్ ను ఎవరైనా దుర్వినియోగం చేసిండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## వక్ఫ్ బిల్లును కోర్టులో సవాలు చేస్తాం

### ఎఐఎంపిఎల్‌బి స్పష్టీకరణ... నిరసనలకు ప్రణాళిక

**న్యూఢిల్లీ :** ముస్లిం సమాజ హక్కులను బెదిరించే 'నల్ల చట్టం' అని పేర్కొంటూ, వక్ఫ్ (సవరణ) బిల్లును కోర్టులో సవాలు చేస్తామని అఖిల భారత ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఎఐఎంపిఎల్‌బి) బుధవారం ప్రకటించింది. అవసరమైతే, దేశవ్యాప్తంగా నిరసన చేపడతామని కూడా ఆ సంస్థ ప్రతిజ్ఞ చేసిం ది. విలేకరుల సమావేశంలో ఎఐఎంపిఎల్‌బి సభ్యుడు మొహమ్మద్ అదీబ్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది ముస్లిం ఆస్తులను లాక్కోవడానికి చేసి న ప్రయత్నం అని అన్నారు. 'వారు మా ఆస్తిని లాక్కోవచ్చన్న ఉద్దేశంతో ఈ చర్య ప్రారంభించారు. దీన్ని అంగీకరించవచ్చా? మేము ఓడిపోయామని అనుకోవద్దు' అని అన్నారు. ప్రతిపాదిత సవరణలను సమీక్షించిన పార్లమెంటు సంయుక్త కమిటీ (జెపిసి) చర్చల సమయంలో బిల్లును వ్యతిరేకించినట్లు తెలిపారు. 'మనం యుద్ధంలో ఓడిపోయామని భావించకూడదు. ప్రతిపాదిత చట్టం భారతదేశ నిర్మాణాన్నే ప్రమాదంలో పడేస్తుంది. అందువల్ల దే శాన్ని కాపాడటానికి చేస్తున్న పోరాటం' అని అదీబ్ అన్నారు. మనస్సాక్షి ఉన్న పౌరులందరూ బిల్లును వ్యతిరేకించాలని అదీబ్ కోరారు. కోర్టులో, ప్రజా ప్రదర్శనల ద్వారా దానిపై పోరాడటానికి ఎఐఎంపిఎల్‌బి నిబద్ధతను పునరుద్ఘాటించారు. 'మేము కోర్టుకు వెళ్తాము. ఈ చట్టాన్ని ఉపసంహరించుకునే వర కు మేము విశ్రమించము' అని ఆయన అన్నారు. ఎఐఎంపిఎల్‌బి ఉపాధ్యక్షు డు మొహమ్మద్ అలీ మొహసిన్ కూడా ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. దీనిని 'వివక్షత, మతపరంగా ప్రేరేపించబడినది. ముస్లిం పౌరుల రాజ్యాంగ హక్కులపై స్పష్టమైన ఉల్లంఘన' అని అభివర్ణించారు. 'దేశాన్ని కాపాడాలనే ఉద్దేశంతో మేము ఈ పోరాటాన్ని ప్రారంభించాం. ఈ నల్ల చట్టాన్ని అంతం చేయడమే మా లక్ష్యం' అని మొహసిన్ అన్నారు. రైతుల ఆందోళన మాదిరిగానే దేశ వ్యాప్తంగా నిరసనలు నిర్వహిస్తామని బోర్డు సభ్యులు తెలిపారు.

### ఇమ్మిగ్రేషన్, విదేశీయుల బిల్లుకు
## పార్లమెంట్ ఆమోదం

- ఇది ఇస్లామోఫోబియా ప్రభావిత రాక్షస బిల్లు: సిపిఐ ఎంపి సందోశ్ కుమార్
- సెలక్ట్ కమిటీకి పంపాలి : విపక్షాల డిమాండ్
- రాజ్యసభ నుంచి వాకౌట్



**న్యూఢిల్లీ :** ఇమ్మిగ్రేషన్, విదేశీయుల బిల్లుకు పార్లమెంటు ఆమోదం లభించింది. రాజ్యసభ బుధవారం మూజువాణి ఓటు ద్వారా ఈ బిల్లుకు ఆమోదముద్ర వేసింది. మార్చి 27న లోక్‌సభ ఆమోదించింది. దీంతో ఉభయ సభల్లో ఈ బిల్లు ఆమోదం పొందింది. అయితే ఈ బిల్లును విపక్షాలు వ్యతిరేకించాయి. దీనిని సెలక్ట్ కమిటీ పరిశీలనకు పంపాలని సిపిఐ, కాంగ్రెస్, టిఎంసి, ఎస్‌పీ, డిఎంకె, శివసేన యూబిటి, బిజెడి, ఎస్‌సిపి డిమాండ్ చేశాయి. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ సభ నుంచి ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. ప్రతిపక్ష ఎంపీలు ప్రస్తావించిన అంశాలను విస్మరిస్తూ ఈ బిల్లును రాజ్యసభ ఏకపక్షంగా ఆమోదించింది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా కేంద్ర మంత్రి నిత్యానంద్ రాయ్ మాట్లాడుతూ మన విశ్వవిద్యాలయాలు, విద్యా వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడం కోసం ఈ బిల్లు అవసరమని సమర్థించారు. సీపీఐ ఎంపీ పి.సంతోశ్ కుమార్ వ్యతిరేకించారు. మీరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినాగానీ ఇది రాక్షస బిల్లు అని నొక్కిచెప్పారు. ఒక కచ్చితమైన మనస్తత్వంగల కొందరు మాత్రమే దీనిని ఆమోదించగలరని వ్యాఖ్యానించారు. ఇస్లామోఫోబియా నెపంతో ఇమ్మిగ్రేషన్, విదేశీయులకు సంబంధించిన సేవలను పక్కదోవ పట్టించడం కోసం ఈ బిల్లు తెచ్చారని విమర్శించారు. ఇస్లామోఫోబియా అనే బూటకపు భావన ద్వారా ప్రభావితమైన బిల్లు అని సంతోశ్ కుమార్ దుయ్యబట్టారు. ఇది చట్టరూపం దాల్చితే దేశ ప్రతిష్ఠ దిగజారుతుందని, విదేశీ విద్యార్థులు, పర్యాటకులు, మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించే చర్యలకు విఘాతం కలుగుతుందని హెచ్చరించారు. మనకు మనం విశ్వగురుగా చెప్పుకుంటాం కానీ ఇలాంటి చట్టాలతో దేశ ప్రతిష్ఠను మనమే దిగజార్చుకుంటున్నామని సంతోశ్ కుమార్ వ్యాఖ్యానించారు. డీఎంకే ఎంపీ ఎన్ఆర్ ఎలాంగో, ఐయూఎంఎల్ ఎంపీ హారిస్ బీరన్, ఎన్‌సీపీఎస్‌సీపీ ఎంపీ ఫౌజియా ఖాన్, శివసేన (యూబిటి) ఎంపి సంజయ్ రౌత్, ఎస్‌పీ ఎంపీ జయా బచన్ కూడా సంతోశ్ కుమార్‌తో ఏకీభవించారు. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని డిమాండ్ చేశారు. 'ప్రతిపాదిత బిల్లులోని సెక్షన్ 7 ప్రకారం భారత్‌కు వచ్చే విదేశీయులు (సంగీతకారులు, కళాకారులు, సామాజిక కార్యకర్తలు, దౌత్యాధికారులు సహా) దేశంలో ఉండగలరా లేదా అన్నది నిర్ణయించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. అంటే భారత్‌కు వచ్చే విద్యార్థి ప్రతినిధి కానీ, దౌత్యాధికారి కానీ, జర్నలిస్టు కానీ ఎవరైన రాజకీయ నాయకులు లేదా విపక్ష నాయకులను కలవాలంటే ముందుగా కేంద్ర అనుమతి కోరాలి... వారి కోరికను మన్నించాలా లేదా అన్నది కేంద్రం నిర్ణయిస్తుంది' అని రౌత్ వ్యాఖ్యానించారు. ఎవరు పడితే వారు వచ్చి ఉండేందుకు భారతదేశం ధర్మశాల కాదన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఈ దేశం జైలు కూడా కాదని వక్కాణించారు. ఇమిగ్రేషన్ సంబంధిత నిర్ణయాలు తీసుకునేందుకు నిబద్ధగల ఇమ్మిగ్రేషన్ల అప్పీలు కోర్టు లేదా ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని జయా బచన్ సూచించారు. కాగా, ఈ బిల్లు అంతర్జాతీయ స్థాయిలో ప్రతికూలంగా పరిణమిస్తుందని హారిస్ బీరన్ హెచ్చరించారు.

## డీలిమిటేషన్ సెగ...
## ప్రధాని మోదీకి స్టాలిన్ లేఖ



**చెన్నై :** నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశం దక్షిణాది రాష్ట్రాల్లో సెగలు రేపుతోంది. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టవద్దని దక్షిణాది రాష్ట్రాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు ఇటీవలే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అనేక పార్టీలు సమావేశం నిర్వహించి తీర్మానం చేశాయి. ఇందుకు సంబంధించిన వినతి పత్రాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సమర్పించేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ సిద్ధమయ్యారు. ఇందుకోసం ప్రధాని మోదీని కలిసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి మార్చి 27వ తేదీన తాను రాసిన లేఖను స్టాలిన్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై గత నెల 22న ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలో దక్షిణాది రాష్ట్రాల జేఏసీ సమావేశమైంది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అంగీకరించేది లేదని ఈ సమావేశంలో తీర్మానించారు. రెండో సమావేశంలో హైదరాబాద్‌లో జరుగుతుందని స్టాలిన్ తెలిపారు.

## ట్రంప్ విధానాలకు కోరీ బుకర్ నిరసన

### సెనేట్‌లో 25 గంటల ప్రసంగంతో కొత్త రికార్డు



**వాషింగ్టన్ :** ట్రంప్ విధానాలను వ్యతిరేకిస్తూ అమెరికా కాంగ్రెస్‌లో డెమొక్రటిక్‌పార్టీ ప్రతినిధి, మాజీ అధ్యక్ష అభ్యర్థి కోరీ బుకర్ 25 గంటలసేపు సెనేట్‌లో అనర్గళంగా ప్రసంగించి సరికొత్త రికార్డు సృష్టించారు. 68 సంవత్సరాల క్రితంనాటి పాత రికార్డులను బద్దలుకొట్టారు. బుకర్ వయసు 55 సంవత్సరాలు. అమెరికా ఇప్పుడు అత్యంత ప్రమాద పరిస్థితుల్లో ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ ఆర్థిక విధానాలను, పొదుపు చర్యలను ఎండగట్టారు. డెమొక్రటిక్‌పార్టీ తరఫున న్యూజెర్సీ నుండి ఆయన సెనేట్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాంగ్రెస్‌లో ఎలాంటి బిల్లులను అడ్డుకోవడానికిగానీ, వ్యతిరేకించడానికిగానీ ఆయన ప్రసంగం చేయలేదు. రిపబ్లికన్‌పార్టీ సభ్యులు మెజారిటీగా ఉన్న సెనేట్‌లో సభా కార్యకలాపాలను తన ప్రసంగం ద్వారా కోరీ బుకర్ విజయవంతంగా అడ్డుకున్నారు. దేశంలో ట్రంప్ విధానాలవల్ల తీవ్రమైన అత్యవసర పరిస్థితులు నెలకున్నాయన్నారు. మొత్తం ఆయన 25 గంటల నాలుగు నిమిషాలసేపు ప్రసంగించారు. డెమొక్రటిక్‌పార్టీ సభ్యులు అడుగడుగునా ఆయనకు ప్రోత్సాహం ఇస్తూ ప్రసంగం కొనసాగించేందుకు సహకరించారు. సెనేట్‌లో సభాకార్యకలాపాలను అడ్డుకునేందుకు ఆయన చేసిన ప్రయత్నంలో సభానిబంధనలకు అనుగుణంగా వ్యవహరించారు. సోమవారం సాయంత్రం నుండి మంగళవారం సాయంత్రం వరకూ ఆయన సెనేట్ వేదికపై నిలబడి ప్రసంగం కొనసాగించారు. 1957, 2013 సంవత్సరాలలో సెనేట్ సభ్యులు ఈ విధంగా సుదీర్ఘ ప్రసంగంద్వారా సృష్టించిన రికార్డులను ఆయన అధిగమించి కొత్తరికార్డులు సృష్టించారు. 1957లో పౌరహక్కుల చట్టానికి వ్యతిరేకంగా డెమొక్రటిక్ ప్రతినిధి స్ట్రామ్ థర్మోండ్ 24.18 గంటలసేపు అనర్గళంగా ప్రసంగించగా, ఈనాడు బుకర్ మరో 44 నిమిషాలు ఎక్కువసేపు ప్రసంగించారు. భారత కాలమానం ప్రకారం బుకర్ మంగళవారం ఉదయం ఏడు గంటలకు తన ప్రసంగం ప్రారంభించి బుధవారం ఉదయం 8 గంటలవరకూ ప్రసంగించారు. ఆ సందర్భంగా అమెరికా క్రీడలు, సాహిత్యాన్ని కూడా సందర్భోచితంగా ఆయన ప్రస్తావించారు. తన తోటి సభ్యులు అడిగిన అనేక ప్రశ్నలకు ఆయన సమాధానాలు చెప్పారు. ట్రంప్ పాలనపై విరుచుకుపడ్డారు. ''నేను ఇక్కడ నిలబడి ప్రసంగిస్తున్నాను, ఎందుకంటే నేను ఆయన కంటే శక్తిమంతుణ్ణి, అమెరికా ప్రజలు ఇంకా శక్తిమంతులు,


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

ఇ-టెండర్ ప్రకటన నెం. 461/DRM/W/GNT తేది: 01-04-2025

దిగువ సంతకందారు దిగువ తెలిపిన పనులు కొరకు 23-04-2025న 15.30 గంటల వరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

క్ర.సం.1, **టెండరు ఐడి:** 2761, **Sr. DEN/DEN సెక్షన్:** నార్త్, **పని వివరణ:** గుంటూర్ డివిజన్: తెనాలి-గుంటూరు సెక్షన్: ADEN/NORTH/GNT సెక్షన్‌లో కి.మీ.20.19 మొత్తం ఫెన్సింగ్ పొడవు కొరకు టెప్ NHAI యాంటి క్రాష్ బారియర్/W-బీమ్ స్టీల్ ఫెన్సింగ్ ట్రాక్ పొడవున సేఫ్టీ ఫెన్సింగ్ ఏర్పాటు చేయుట. **సుమారు విలువ:** రూ.68848385/-, **బయానా:** రూ.494300/-

క్ర.సం. 2, **టెండరు ఐడి:** 2762, **Sr. DEN/DEN సెక్షన్:** నార్త్, **పని వివరణ:** గుంటూర్ డివిజన్: తెనాలి - గుంటూరు సెక్షన్: ADEN/NORTH/GNT సెక్షన్ కి.మీ. 20 మొత్తం ఫెన్సింగ్ పొడవు కొరకు టెప్ NHAI యాంటి క్రాష్ బారియర్ / W-బీమ్ స్టీల్ ఫెన్సింగ్ ట్రాక్ పొడవున సేఫ్టీ ఫెన్సింగ్ ఏర్పాటు చేయుట. **సుమారు విలువ:** రూ.68200221/-, **బయానా:** రూ. 491000/-

క్ర.సం. 3, **టెండరు ఐడి:** 2763, **Sr. DEN/DEN సెక్షన్:** నార్త్, **పని వివరణ:** 12 నెలల కాలానికి ADEN/NORTH/GNT సెక్షన్‌లో ట్రెస్పాసింగ్ లొకేషన్స్ వద్ద సెక్యూరిటీ పెట్రోలింగ్ మరియు రైల్ బారికేడింగ్, వర్షాకాలం మరియు చలికాలం పెట్రోలింగ్, వాటర్ లాగ్ RUBs మరియు ర్యాగ్ పికింగ్ వద్ద స్టేషనరీ వాచ్‌మెన్. **సుమారు విలువ:** రూ.6861994/- **బయానా:** రూ.137200/-.

క్ర.సం. 4, **టెండరు ఐడి:** 2764, **Sr. DEN/DEN సెక్షన్:** నార్త్, **పని వివరణ:** 12 నెలల కాలానికి ADEN/NLDA సెక్షన్ ట్రెస్పాసింగ్ లొకేషన్స్ వద్ద సెక్యూరిటీ పెట్రోలింగ్ మరియు రైల్ బారికేడింగ్, వర్షాకాలం మరియు చలికాలం పెట్రోలింగ్, వాటర్ లాగ్ RUBs మరియు ర్యాగ్ పికింగ్ వద్ద స్టేషనరీ వాచ్‌మెన్. **సుమారు విలువ:** రూ. 5572309/-, **బయానా:** రూ.111500/-.

1. ఇ-బిడ్ల ఆన్‌లైన్ దాఖలుకు ఆఖరి తేది: 23-04-2025న 15.30 గంటల వరకు. సవివర సమాచారం కొరకు వెబ్‌సైట్ www.ireps.gov.inకు లాగాన్ అవ్వండి.
2. ఏదైనా తదుపరి సమాచారం / సవరణ ఇ- పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలియజేయబడుతుంది.

డివిజినల్ రైల్వే మేనేజర్, (పనులు), గుంటూరు.

టెండర్ నోటీస్ నెం. ELE-TRS-GTL-24-25-e-TN-12 తేది: 19-03-2025

దిగువ తెలిపిన పనుల కొరకు 10-04-2025న 16.00 గం.వరకు దిగువ సంతకందారు టెండర్లు కోరుచున్నారు.

క్ర.సం. 1, **టెండర్ నెం.** ELE-TRS-GTL-24-25-e-TN-12, తేది: 19-03-2025, **వివరణ:** లోకోమోటివ్ షెడ్, గుంతకల్ ఎస్‌సిఆర్ వద్ద 02 సంవత్సరాల కాలానికి కన్వెన్షనల్ ఎలక్ట్రిక్ లోకోమోటివ్ మేజర్ ఓవర్‌హాలింగ్ షెడ్యూల్ (TOH/IOH) కొరకు అన్ని ఆగ్జిలరీ మోటార్స్ మెయింటెనెన్స్ స్పేర్స్ కొరకు రిపేర్స్ / రిహాబిలైటేషన్. **సుమారు విలువ:** రూ.31,35,577.15, **బయానా:** రూ.62,800/-, **కాంట్రాక్ట్ కాలం:** రెండు సంవత్సరాలు. **ముగింపు తేదీ మరియు సమయం:** 10-04-2025న 16.00 గం.కు.

టెండర్ బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.inకు లాగిన్ అవ్వండి. టెండర్‌కు ఏదేని సవరణ ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడును.

**టెండర్‌దారులకు గమనిక:**
1) ఈ ఇ-టెండర్‌లో పాల్గొనుటకు / బిడ్ వేయుటకు కాంట్రాక్టర్ డిఎస్‌సి (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికేట్) కలిగి ఉండవలెను.
2) టెండర్ దాఖలు చేయుటకు ముందు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీ చేయబడు పై టెండరుకు సంబంధించి ఏదేని సవరణ జారీచేబడిందో అని గమనించవలెను మరియు తగువిధంగా చర్య తీసుకోవలెను.
3) టెండర్‌దారులు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ కాస్ట్‌ను నెట్ బ్యాంకింగ్ ద్వారా మాత్రమే చెల్లించాలి. లేని యెడల ఇవ్వబడనున్న ఆఫర్ పరిగణించబడదు మరియు తిరస్కరించబడుతుంది.

సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీర్, లోకోమోటివ్ షెడ్, గుంతకల్

టెండర్ నెం. N-SG-36-2024-25-EI-M-48, తేది: 28-03-2025

దిగువ పనుల కొరకు 21-04-2025న 15.00 గంటలు వరకు భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్ / నాందేడ్ డివిజన్, దక్షిణ మధ్య రైల్వే. నాందేడ్ వారు ఇ-టెండరింగ్ ద్వారా ఓపెన్ టెండర్లు కోరుతున్నారు.

క్ర.సం. 1. **టెండరు నం:** N-SG-36-2024-25-EI-M-48, తేది: 28-03-2025, **పని పేరు:** నాందేడ్ డివిజన్‌లో రెండు సంవత్సరాల కాలానికి నాగర్‌సోల్ (NSL) స్టేషన్ వద్ద మేధా తయారీ ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ (E.I) సిస్టమ్ వార్షిక నిర్వహణ కాంట్రాక్ట్. **సుమారు విలువ:** రూ.15,31,640/-, **బయానా:** రూ.30,600/-. **పూర్తి చేయు కాలం:** 24 నెలలు, **టెండరు ఫారం ధర:** లేదు.

పైన తెలిపిన సదరు టెండరు 21-04-2025న 15.00 గంటలకు మూసివేయబడుతుంది.

సీనియర్ డివిజనల్ సిగ్నల్ & టెలికాం ఇంజనీర్, నాందేడ్
A0406

తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ www.ireps.gov.in లేదా http://www.scr.indianrailways.gov.in ను సంప్రదించవచ్చు


### పాక్ కాల్పుల విరమణ
## ఒప్పందం ఉల్లంఘన

### కేంద్ర సిబ్బంది సహాయ మంత్రి జితేంద్ర సింగ్

**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి పాకిస్తాన్ దళాలు కవ్వింపు చర్యలకు పాల్పడ్డాయి. మందు మందుపాతర పేల్చి తరువాత కాల్పులకు తెగబడ్డారు. దీంతో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయని రక్షణ ప్రతినిధి బుధవారం తెలిపారు. పాక్ దళాల కాల్పుల విరమణ ఉల్లంఘనను భారత సైన్యం 'సమర్థవంతంగా' తిప్పికొట్టిందని, ఎల్‌ఓసిపై ఆధిపత్యాన్ని కొనసాగిస్తోందని, పరిస్థితి అదుపులోనే ఉందన్నారు. మంగళవారం మధ్యాహ్నం 1.10 గంటలకు ఉల్లంఘన జరిగినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. పాకిస్తాన్ వైపు జరిగిన ప్రాణనష్టం గురించి భారత సైన్యం ప్రస్తావించనప్పటికీ, పేలుడు , ఆ తర్వాత ఇరుపక్షాల మధ్య జరిగిన కాల్పుల్లో ఐదుగురు శత్రు సైనికులు గాయపడ్డారని వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 01, 2025న, పాకిస్తాన్ సైన్యం నియంత్రణ రేఖ వెంబడి గస్తీ తిరుగుతున్నప్పుడు కృష్ణ ఘాటి సెక్టార్‌లో మందుపాతర పేలుడు సంభవించింది. దీని తర్వాత పాకిస్తాన్ సైన్యం కాల్పులు జరపడం, కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడిందని జమ్ముకు చెందిన రక్షణ శాఖ పిఆర్‌ఒ లెఫ్టినెంట్ కల్నల్ సునీల్ బార్త్వాల్ సవరించిన ప్రకటనలో తెలిపారు. పాకిస్తాన్ సైన్యం ఎల్‌ఓసి వెంబడి చొరబాటు కారణంగా కృష్ణ ఘాటి సెక్టార్‌లో మందుపాతర పేలుడు సంభవించిందని, అంతకు ముందు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సరిహద్దులో అనేకసార్లు కాల్పులు, ఐఇడి దాడి అనంతరం ఉద్రిక్తతను తగ్గించే ప్రయత్నంలో ఫిబ్రవరి 21న ఎల్‌ఓసి వద్దభారత్ –పాక్ సైన్యం సమావేశమయ్యాయి . 75 నిమిషాల పాటు కొనసాగిన బ్రిగేడ్–కమాండర్ స్థాయి సమావేశం చక్కన్–దాబాగ్ క్రాసింగ్ పాయింట్ ప్రాంతంలో జరిగింది. ఇరుపక్షాలు సరిహద్దుల వెంట శాంతిని కొనసాగించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాయి. ఫిబ్రవరి 25, 2021న రెండు దేశాలు ఒప్పందాన్ని పునరుద్ధరించినప్పటి నుండి జమ్ము కశ్మీర్ సరిహద్దుల వెంట కాల్పుల విరమణ ఉల్లంఘనలు చాలా అరుదు. అయితే, ఫిబ్రవరిలో పూంఛ్‌రాజౌరి సెక్టార్‌లోని ఎల్‌ఓసిలో అనేక సంఘటనలు నమోదయ్యాయి. ఫిబ్రవరి 11న జమ్ము ప్రాంతంలోని అఖ్నూర్ సెక్టార్‌లో అనుమానిత ఉగ్రవాదులు జరిపిన ఐఇడి దాడిలో ఒక కెప్టెన్ సహా ఇద్దరు భారత ఆర్మీ సిబ్బంది మరణించగా, మరొకరు గాయపడ్డారు. రాజౌరి, పూంఛ్ జిల్లాల్లో ఎల్‌ఒసి వెంబడి చిన్న ఆయుధాలతో జరిగిన వేర్వేరు సంఘటనలలో ఇద్దరు ఆర్మీ సిబ్బంది గాయపడ్డారు, ఫిబ్రవరిలో పూంఛ్‌లో జరిగిన వేర్వేరు ల్యాండ్‌మైన్ పేలుళ్లలో మరో ఇద్దరు ఆర్మీ సిబ్బంది గాయపడ్డారు.

### 2,500 కిలోల
## డ్రగ్స్ స్వాధీనం

**న్యూఢిల్లీ :** సముద్ర మార్గం ద్వారా అక్రమంగా రవాణా అవుతున్న ఓ ఓడ నుంచి 2,500 కిలోల మాదక ద్రవ్యాలను భారత నౌకాదళం స్వాధీనం చేసుకుంది. ఫ్రంట్‌లైన్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కాష్ యుద్ధ నౌక ఈ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించింది. గత నెల 31న పశ్చిమ హిందూ మహాసముద్రంలో కొన్ని నౌకల అనుమానాస్పద కదలికలపై ఇండియన్ నేవీకి సమాచారం అందింది. యుద్ధ నౌక ఐఎన్ఎస్ తార్కాష్ ను రంగంలోకి దించారు. పీ81 సముద్ర నిఘా విమానం, ముంబైలోని మారిటైమ్ ఆపరేషన్స్ సెంటర్‌తో సమన్వయంతో సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. అనుమానాస్పద నౌకలను తనిఖీ చేశారు. ఒక షిప్‌ను అడ్డగించారు. తార్కాష్ యుద్ధ నౌకలోని హెలికాప్టర్ ద్వారా మెరైన్ కమాండోలు, స్పెషలిస్ట్ బోర్డింగ్ బందాలు ఆ షిప్‌లోకి చేరుకున్నాయి. దాని సిబ్బందిని ప్రశ్నించారు. మరో వైపు ఆ షిప్‌లోని కార్గో కంపార్ట్‌మెంట్లను మెరైన్ కమాండోలు తనిఖీ చేశారు. దీంతో 2,386 కిలోల హాషీష్, 121 కిలోల హెరాయిన్‌తో సహా 2,500 కిలోల మత్తు పదార్థాలు లభించాయి. ఆ ఓడను ఐఎన్ఎస్ తార్కాష్ నియంత్రణలోకి తీసుకువచ్చినట్లు నేవీ అధికారులు తెలిపారు. డ్రగ్స్ అక్రమ రవాణా, ఇలాంటి ఇతర నౌకల గురించి ఆ ఓడ సిబ్బందిని సమగ్రంగా ప్రశ్నిస్తున్నట్లు వెల్లడించారు.

## ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్కే!

### ఫోర్బ్స్ జాబితా 18వ స్థానంలో అంబానీ... అదానీకి 28వ స్థానం



**న్యూఢిల్లీ :** ఫోర్బ్స్ బిలియనీర్ల తాజా జాబితాలో ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మరోసారి తొలిస్థానంలో నిలిచారు. 342 బిలియన్ డాలర్ల నికర విలువతో అగ్ర స్థానం దక్కించుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే మస్క్ సంపద 147 బిలియన్ డాలర్లు పెరిగింది. మస్క్ తర్వాత ఫేస్‌బుక్ వ్యవస్థాపకుడు మార్క్ బుకర్‌బర్గ్ రెండో స్థానంలో నిలిచారు. ఆయన నికర విలువ 216 బిలియన్ డాలర్లుగా ఉంది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ 215 బిలియన్ డాలర్ల నికర విలువతో మూడో స్థానంలో నిలిచారు. ఇక ఈ జాబితాలో అమెరికా అగ్ర స్థానంలో ఉంది. ప్రస్తుతం అమెరికాలో 902 మంది సంపన్నులు ఉన్నారు. ఆ తర్వాత చైనాలో 516 మంది బిలియనీర్లు ఉండగా... భారత్ 205 మంది బిలియనీర్లతో మూడో స్థానంలో నిలిచింది. ఆసియాలోనే అత్యంత సంపన్నుడు, ప్రముఖ వ్యాపార వేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ 92.5 బిలియన్ డాలర్ల సంపదతో ఈ జాబితాలో 18వ స్థానంలో నిలిచారు. మరో భారతీయుడు గౌతమ్ అదానీ 56.3 బిలియన్ డాలర్ల సంపదతో 28వ స్థానంలో ఉన్నారు. ఇక ఈసారి 288 మంది కొత్త వ్యక్తులు ఫోర్బ్స్ జాబితాలో చేరారు. వీరిలో అనేక మంది హాలీవుడ్ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు ఉన్నారు.



**భారతీయ అత్యంత సంపన్న మహిళగా సావిత్రి జిందాల్**

ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలో అత్యంత సంపన్న భారతీయ మహిళగా సావిత్రి జిందాల్ నిలిచారు. టాప్ టెన్ ఇండియన్ బిలియనీర్ల జాబితాలో ఆమె మూడవ స్థానంలో ఉన్నారు. ఓపీ జిందాల్ గ్రూపు యజమానిగా ఆమె ఉన్నారు. ప్రస్తుతం ఆమె హర్యానాలో ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. ఫోర్బ్స్ బిలియనీర్స్ 2025 జాబితాలో ఆమె ఆస్తుల విలువ సుమారు 35.5 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు వెల్లడించారు. ముకేశ్ అంబానీ, గౌతం అదానీ తర్వాత ఆ జాబితాలో సావిత్రి మూడవ స్థానంలో ఉన్నారు. టాప్ 10 భారత బిలియనీర్లలో ఉన్న ఏకైక మహిళగా నిలవడం విశేషం. స్టీల్, పవర్, సిమెట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో జిందాల్ గ్రూపు వ్యాపారాలున్నాయి. ఆ గ్రూపునకు సావిత్రి చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఆమె భర్త ఓం ప్రకాశ్ జిందాల్ ఆ కంపెనీ స్థాపించారు. 2005లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారు.

## 90 శాతం ప్రజా ఫిర్యాదులు పరిష్కారం



**న్యూఢిల్లీ** : ప్రత్యేకమైన ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం ద్వారా 29 లక్షల ప్రజా ఫిర్యాదులను ప్రభుత్వం స్వీకరించగా, 2024లో దాదాపు 26.45 లక్షల ఫిర్యాదులను పరిష్కరించినట్లు కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభకు సమాచారమిచ్చింది. కేంద్రీకృత ప్రజా ఫిర్యాదుల పరిష్కారం మరియు పర్యవేక్షణ వ్యవస్థ (సిపిజిఆర్‌ఎఎంఎస్) ఆన్‌లైన్ ప్లాట్‌ఫారం ద్వారా ఫిర్యాదులను ప్రభుత్వం స్వీకరించింది. 2020–2024లో మొత్తం 1,15,52,503 ఫిర్యాదులు పరిష్కరించగా, జనవరి–డిసెంబర్ 2024 వరకు సిపిజిఆర్‌ఎఎంఎస్ పోర్టల్‌లో వార్షికంగా అత్యధికంగా 26,45,869 ఫిర్యాదులకు (90.5 శాతం) పరిష్కారం లభించినట్లు కేంద్ర సిబ్బంది సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. 2024లో 29,23,445 ప్రజా ఫిర్యాదులు అందగా, వాటిలో గత సంవత్సరం నుండి పరిష్కారం కాక పెండింగ్‌లో ఉన్న 3,08,124 ఫిర్యాదులు ఉన్నాయని ఆయన చెప్పారు. 2023లో, 26,15,798 ప్రజా ఫిర్యాదులు అందాయి (గత సంవత్సరం నుండి ముందుకు తెచ్చిన 6,62,741 ఫిర్యాదులు కూడా ఉన్నాయి). వీటిలో 23,07,674 పరిష్కరించబడ్డాయని సింగ్ చెప్పారు. 2022లో 28,06,209 ఫిర్యాదులు (ముందుకు తెచ్చినవి 8,87,971) పరిష్కారానికి రాగా, వాటిలో 21,43,468 పరిష్కరించబడ్డాయన్నారు. ప్రజా ఫిర్యాదులను సమర్థవంతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం ఆగస్టు 23, 2024న సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసిందని ఆయన చెప్పారు. వివిధ ప్రజా ఫిర్యాదు వేదికల ఏకీకరణ, మంత్రిత్వ శాఖలు/విభాగాలలో ప్రత్యేకమైన ఫిర్యాదు విభాగాల ఏర్పాటు, అనుభవజ్ఞులు, సమర్థులైన నోడల్ అధికారుల నియామకం, ఫిర్యాదుల మూల కారణ విశ్లేషణపై ప్రాధాన్యత, అభిప్రాయం చర్యపై మార్గదర్శకాలు దిశానిర్దేశం చేస్తాయని సింగ్ చెప్పారు. అక్టోబర్ 2 నుండి అక్టోబర్ 31 వరకు ప్రభుత్వ కార్యాలయాలలో స్వచ్ఛత (పరిశుభ్రత)ను సంస్థాగతీకరించడం, పెండింగ్‌లో ఉన్న వాటిని తగ్గించడంపై ప్రభుత్వం నిర్వహించిన ప్రత్యేక ప్రచారంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కూడా ఒక ముఖ్యమైన అంశం అని మంత్రి చెప్పారు. 2024 ప్రత్యేక ప్రచారం సందర్భంగా సుమారు 5.55 లక్షల ప్రజా ఫిర్యాదులు, అప్పీళ్లను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. మరో సమాధానంలో పౌరులు లేవనెత్తిన విధానపరమైన సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను పరిష్కరించడానికి ఎక్కువ సమయం పట్టవచ్చని మంత్రి అన్నారు. ఫిబ్రవరి 28, 2025 నాటికి, మంత్రిత్వ శాఖలు/విభాగాలలో 59,946 ప్రజా ఫిర్యాదుల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో 63.86 శాతం ఫిర్యాదులు 21 రోజుల కన్నా తక్కువ కాలం పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు.

## ఆసుపత్రిలో చేరిన లాలూ ప్రసాద్ యాదవ్



**పాట్నా:** ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్య పరిస్థితి బుధవారం ఉదయం క్షీణించడంతో వైద్య పరీక్షలు, చికిత్స కోసం హుటాహుటిన ఢిల్లీకి తరలించారు. లాలూ వెంట కుమారుడు, బీహార్ ప్రతిపక్ష నేత తేజస్వి యాదవ్ కూడా ఢిల్లీ వెళ్లారు. లాలూ ప్రసాద్ యాదవ్ గత కొంతకాలంగా తీవ్ర మధుమేహంతో బాధపడుతున్నారు. పాట్నాలో సాధారణ వైద్య పరీక్షలు, చికిత్స చేయించారు. అయినప్పటికీ లాలూ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. 2022లో ఆయన సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి చేయించుకున్నారు. ఆయన కుమార్తె రోహిణి ఆచార్య కిడ్నీని దానం చేశారు. 2024 సెప్టెంబరులో ముంబైలో యాంజియోప్లాస్టీ చేయించుకున్నారు. 2014లో ముంబైలోని ఒక ఆసుపత్రిలో ఆయనకు ఓపెన్‌హార్ట్ సర్జరీ జరిగింది. గత నెలలో లాలూ ప్రసాద్ యాదవ్ వక్ఫ్ సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. మార్చి 26న ఆయన గార్డెనిబాగ్ వద్ద బిల్లుకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో పాల్గొన్నారు. ఆ తరువాత ఆయన బహిరంగంగా కనిపించలేదు. ఇదిలా ఉండగా, ఆర్జేడీ కార్యకర్తలు, అభిమానులు ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు. 2025లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్య పరిస్థితులు ఆర్జేడీ ఎన్నికల వ్యూహాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. మాజీ రైల్వే మంత్రిగా, బీహార్ ముఖ్యమంత్రిగా పనిచేసిన లాలూ ప్రసాద్ యాదవ్ బీహార్‌లో వివిధ కులాలు, వర్గాలపై మంచి పట్టు ఉన్న రాజకీయ నేతలలో ఒకరు. ఆయన పార్టీకి మార్గనిర్దేశం చేస్తూ ఉంటారు. ఆయన అనుమతి లేకుండా పార్టీ నాయకులు ఎటువంటి నిర్ణయం తీసుకోరు. లాలూ ప్రసాద్ యాదవ్ ఇప్పటికే మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ పేరును ఎన్నికల ముందు పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు.


**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా! **శ్రీమతి పోశాల రజనీ, తండ్రి: పోశాల రమేష్ బాబు, భర్త: మెడుగు సురేష్** గారు (ప్రస్తుతం హనుమకొండ జిల్లా) వరంగల్ జిల్లా, హనుమకొండ మండలం, గోపాల్‌పూర్ గ్రామంలో గలది. ప్లాట్ నెం. 64, సర్వే నంబర్ 95, 96, 97 & 100, 250.00 చ.కి. గజాలు.. సిట్టా విజయ. భర్త: వీరాస్వామి మరియు సూదగాని సునీత, భర్త: లేట్ యెల్లాగౌడ్ గారు నుండి విక్రయ దస్తావేజు డాక్యుమెంట్ నెం. 2258/2021, తేదీ: 19-01-2021 ద్వారా ఈ దిగువన తెలుపబడిన షెడ్యూల్ హద్దులతో కూడినది. కాని దాని యొక్క పూర్వపు అసలు విక్రయ దస్తావేజు నెంబరు నెం. 1500/2004, తేదీ: 03-07-2004, కట్టా కనకమ్మ, భర్త : దివంగత ఎల్లయ్య గారు సుధగాని సునీత, భర్త: దివంగత యల్లాగౌడ్ గారికి రిజిస్ట్రేషన్ చేసినారు. అట్టి అసలు రిజిస్టార్ దస్తావేజు ఎక్కడో పోయినది అని తెలుపుతున్నారు. అట్టి దస్తావేజు ఎవ్వరి వద్ద అయినా ఉన్నా మరియు అట్టి ఆస్తి పై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన తేదీ నుండి వారం రోజులలోపు లిఖిత పూర్వకముగా మరియు చట్టపరమైన అభ్యంతరములు నా ఆఫీసుకి వచ్చి తెలుపవలెను. సరైనా కాలంలో అభ్యంతరములు రానిచో PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, వరంగల్ బ్రాంచ్ వారు శ్రీమతి పోశాల రజనీ గార్కి అట్టి ఆస్తిని తనఖా పెట్టుకొని వారి నియమనిబంధనల ప్రకారం అప్పు మంజూరు చేయుటకు నిర్ణయం తీసుకోగలరు.

**ఆస్తి యొక్క హద్దులు:**
తూర్పు : ప్లాట్ నెం. 66;
పడమర : 25'-0'' వెడల్పు గల రోడ్డు;
ఉత్తరం : ప్లాట్ నెం. 63;
దక్షిణం : ప్లాట్ నెం. 65

PNB హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, వరంగల్ బ్రాంచ్ వారి అనుమతితో..

సం/- దుస్సా జనార్ధన్ న్యాయవాది
# 1-7-1246, అడ్వకేట్స్ కాలనీ, హనుమకొండ, వరంగల్. ఫోన్: 9849494941



# జనరల్
STATE & REGIONAL NEWS

## 7న జరిగే సదస్సుకు ఎంపి తీర్మా వలావన్‌ను ఆహ్వానించిన కోదండరామ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ దక్షిణ భారత భవిష్యత్' అంశంపైన ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే సదస్సుకు హాజరుకావాలని విసికె పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, తమిళనాడు ఎంపి తీర్మా వలావన్‌ను టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ఆహ్వానించారు. ఈమేరకు కోదండరమ్ న్యూఢిల్లీలో తీర్మా వలావన్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన అంశంపై చర్చించారు.

## త్వరలోనే 'గురుకుల ఇంటర్' ప్రవేశాలకు నోటిఫికేషన్ :వర్షిణి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గురుకుల విద్యా సంస్థలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీ డియట్ ప్రవేశాలకు త్వరలోనే నోటిఫికేషను విడుదల చేయనున్నట్టు టిజిఎస్‌డబ్ల్యు ఆర్‌ఇఐఎస్ కార్యదర్శి డాక్టర్ వి.ఎస్. అలగు వర్షిణి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందుస్తుగానే తగిన సర్టిఫికెట్లను అందుబాటులో పెట్టుకోవాలని ఆమె బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలను సిద్ధంగా పెట్టుకోవాలని సూచించారు. పదవ తరగతిలో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా ఇంటర్‌లో ప్రవేశాన్ని కల్పిస్తామని తెలిపారు. 2025 ఏడాది జనవరి 1 తర్వాత జారీ చేసిన ఆదాయ ధృవీకరణ పత్రాన్ని ఆన్‌లైన్‌లో జత చేయాలని సూచించారు.

## మహబూబ్ నగర్‌లో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు



కేంద్ర మంత్రి కుమారస్వామికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహబూబ్‌నగర్‌లో సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామిని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈమేరకు బిఆర్‌ఎస్ ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, సురేష్ కుమార్ రెడ్డి, దామోదర్ రావుతో కలిసి శ్రీనివాస్‌గౌడ్ న్యూఢిల్లీలో కేంద్రమంత్రికి బుధవారం వినతిపత్రం అందజేశారు. మహబూబ్ నగర్‌లో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసేందుకు అన్ని సౌకర్యాలూ ఉన్నాయని, సిమెంట్ ఫ్యాక్టరీకి అవసరమైన సున్నపు రాయి, లాటరైట్ రాయి లాంటి ముడి పదార్థాలు, స్కిల్ వర్కర్స్ అందుబాటులో ఉన్నారని, అలాగే హైదరాబాద్, రాయచూర్, గుల్‌బర్గా వంటి ఐటి కారిడార్ ప్రాంతాలు దగ్గరలోనే ఉన్నాయని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు తో తమ ప్రాంత అభివృద్ధి తో పాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తద్వారా ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగు పడుతుందని తెలిపారు.

## 'మిషన్ జీరో స్క్రాప్' దిశగా ద.మ.రైల్వే



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే అధికారులు 'మిసన్ జీరో స్క్రీప్' దిశగా దూసుకుపోతున్నారు. 2024–25లో స్క్రాప్ అమ్మకం ద్వారా రూ.501.72 కోట్ల ఆదాయాన్ని సొంతం చేసుకుని రికార్డు సృష్టించారని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను స్క్రాప్‌పై రూ. 430 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా అది అధిగమించిందని ఆయన తెలిపారు.గత ఏడాది 2023–24లో స్క్రాప్ అమ్మకం ద్వారా రూ.411.39 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. ఇవేలం ద్వారా స్క్రాప్ విక్రయాలను చేపట్టడంలో దక్షిణ మధ్య రైల్వే ముందంజలో ఉందన్నారు. భారతదేశ వ్యాప్తంగా ఇవేలం ప్రక్రియ కొనుగోలుదార్ల మధ్య పారదర్శకత, వేలంలో పోటీతత్వాన్ని మెరుగుపరిచిందన్నారు. గతంలోనున్న మధ్యవర్తుల ప్రమేయాన్ని నివారించి ఇవేలం ద్వారా పారదర్శకతను పెంపొందించడంతో కొనుగోలుదారుల నుండి వచ్చే ఫిర్యాదులను గణనీయంగా తగ్గించాయి. దక్షిణ మధ్య రైల్వే మెటీరియల్స్ మేనేజ్మెంట్ డిపార్ట్మెంట్ అధికారుల కృషి వలన మిషన్ జీరో స్క్రాప్ ప్రాజెక్ట్ లక్ష్యాన్ని సాధించామన్నారు. తుక్కును వెంటనే గుర్తించడంతో పాటు, ఒక నెల కంటే ఎక్కువ సమయం గాని లేదా ఒక ట్రక్ లోడ్ పరిమాణంలో స్క్రాప్ పేరుకుపోకుండా చర్యలు తీసుకొంటోందన్నారు. ఈ ప్రక్రియ భారత ప్రభుత్వం చేపట్టిన 'స్వచ్ భారత్ అభియాన్' ప్రాజెక్ట్ కు కూడా ఎంతగానో దోహదపడిందన్నారు.

## 'కంచ గచ్చిబౌలి, హెచ్‌సియు, దామగుండం' అడవులను పరిరక్షించాలి

టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అభివృద్ధి, దేశ రక్షణావసరాల పేరుతో వికారాబాద్ దామగుండం అడవులను పరిశ్రమల పేరుతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీతో కూడుకున్న కంచ గచ్చిబౌలి అడవులను విధ్వంసం చేయకుండా పర్యావరణ పరిరక్షణకు పూనుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ డిమాండ్ చేశారు. హెచ్‌సియు భూములు ప్రైవేట్ వ్యక్తుల పరం కాకుండా కాపాడిన రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. ప్రభుత్వ భూములను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని, ఒక బిల్లి రావు మాత్రమే కాదని, మై హోమ్ రామేశ్వర్ రావ్, ఇతర నాయకులు చేసిన అన్ని ఆక్రమణల నుండి ప్రభుత్వ భూములను రక్షించాలని ఆయన బుధవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కంచ గచ్చిబౌలి ప్రాంతంలో వన్య ప్రాణులను కాపాడాలని కోరారు. దేశ, రాష్ట్రవ్యాప్తంగా అడవులను ధ్వంసం చేసిన రాజకీయ పార్టీలు ప్రస్తుతం తమ రాజకీయ క్రీడలను కొనసాగిస్తూ, విద్వేషాలను రెచ్చగొట్టడం సరైంది కాదని, అడవులపైన మాట్లాడే అర్హత బిజెపికి లేదని ధర్మార్జున్ హితవు పలికారు.

# ఎస్ఎల్‌బిసి బాధితులను అన్నివిధాలుగా ఆదుకుంటాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ ప్రతినిధి/అచ్చంపేట :** ఎస్ఎల్‌బిసి టన్నెల్ వద్ద మరో 15రోజులు పనులు చేసి మిగిలిన కుటుంబాలను ఆదుకుంటామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం శ్రీశైలం ప్రాజెక్టులోని ఎస్ఎల్‌బిసి సొరంగాన్ని పరిశీలించారు. నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్‌సంతోష్ నమూనా టన్నెల్‌మిషన్‌ద్వారా ప్రమాదాల వివరాలను మంత్రికి వివరించారు. ఈసమయంలో ప్రత్యేకాధికారి శివశంకర్ లోథేటి వివరించారు. అనంతరం ఎస్ఎల్‌బిసి టన్నెల్ ఇన్‌లెట్1 ఆఫీసువద్ద సహాయక చర్యలపై సహాయకబృందాల అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడుతూ ఎస్ఎల్‌బిసి టన్నెల్ వద్ద సంఘటన బాధాకరమన్నారు. మరో 15రోజుల్లో ఎస్ఎల్‌బిసి సహాయక చర్యలు పూర్తిచేసి మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందిస్తామన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చిన రెండున్నర ఏళ్లల్లో ఎస్ఎల్‌బిసి ద్వారా రైతులకు సాగునీరు అందిస్తుందన్నారు. ఎస్ఎల్‌బిసి ప్రమాదం చోటు చేసుకోవడం అత్యంత బాధాకరమని మరోసారి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆకుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటుందన్నారు. ఎస్ఎల్‌బిసి సొరంగంలో ఫిబ్రవరి 22నుంచి ప్రమాదం జరిగిందని నేటికి సహాయక చర్యలు చేపడుతున్నట్లు మంత్రికి ప్రత్యేకాధికారి తెలిపారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల సహాయకబృందాలు, నిష్ణాతులైన అధికారులు సేవలు అందించి చర్యలు తీసుకుంటాయని తెలిపారు. కేరళ రాష్ట్రం నుంచి క్యాడవర్‌డాగ్స్‌ను కూడా తీసుకొచ్చి సేవలుఅందిస్తున్నట్లు తెలిపారు. విపత్కర పరిస్థితులలో యంత్రాలను సైతంతెచ్చి పని చేస్తున్నట్లు తెలిపారు. నిమిషానికి పదివేలలీటర్ల ఊటనీటిని అత్యధిక సమర్థంగా పంపులద్వారా బయటకు నీటిని తరలిస్తున్నట్లు తెలిపారు. మట్టితవ్వకాలు సహాయకబృందాల ద్వారా ఆర్మీ, హైడ్రా, ఎస్కవేటర్లద్వారా మట్టిని బయటకు తీస్తున్నట్లు తెలిపారు. కన్వేయర్ బెల్టుగుండా మట్టిని తవ్వుతున్నట్లు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేబృందాలు స్టీల్‌కత్తిరించి లోకో ట్రైన్‌ద్వారా బయటకు తెస్తున్నామని సొరంగం ప్రమాదంలో చిక్కుకున్నవారి ఆనవాలు తెలుసుకునేందుకు క్యాడవర్ డాగ్స్‌ను ఉపయోగించినట్లు తెలిపారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్‌వద్ద సహాయక చర్యలపై ఉన్నతాధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. టన్నెల్‌లో కొనసాగుతున్న చర్య లు 15 రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. ఈ టన్నెల్‌వల్ల నల్గొండ, ఖమ్మం జిల్లాలను సస్యశ్యామలం చేసే కృష్ణానదిజలాలు మరోరెండున్నర సంవత్సరాల్లో అందుబాటుల్లోకి వస్తాయని వెల్లడించారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్ ప్రమాదాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించిన అనంతరం వారి సూచనలమేరకు టన్నెల్ సహాయక చర్యలు వేగవంతం అవుతాయని అన్నారు. మరో 105 నుండి 110మీటర్లవరకు తవ్వకాలు పూర్తయితే కొలిక్కి వస్తుందని, ప్రమాదం జరిగిన ప్రాంతాల్లో 250మీటర్లరాళ్లు, మట్టి, బురద ఉన్నట్లు తెలిపారు. గడిచిన 40రోజులుగా 700లనుండి 800లమంది వివిధ సంస్థలకు చెందిన నిపుణులు రాత్రి, పగలు పనిచేస్తున్నారని తెలిపారు. 550మంది అత్యాధునిక పరికరాలతో సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. టన్నెల్లో భారీడ్రిల్లింగ్ యంత్రాలు, ఇతర వస్తువులు అతుక్కుపోవడం వలన బురద తొలగింపు కష్టసాధ్యమైందన్నారు. ఈ సమావేశంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, ఎన్‌డిఆర్‌ఎఫ్ అధికారి హరీష్, సింగరేణి మైన్స్‌రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, హైడ్రా అధికారి జయప్రకాష్, దక్షిణ మధ్యరైల్వే అధికారి రవీంద్రనాథ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మిషన్‌భగీరథ, పంచాయతీరాజ్ ఇఎన్‌సిల పోస్టులు ఖాళీ

రిటైర్ట్ ఉద్యోగులను తొలగించాలన్న ప్రభుత్వ ఆదేశాలు..
వారి స్థానంలో ఎవరికి అవకాశాలు ఇవ్వాలనే అంశలో అస్పష్టత ..?

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో కీలక స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుత వేసవి కాలంలో ఉన్నతాధికారులు లేకపోవడంతో పాలనలో ఇబ్బందులు వచ్చే అవకాశాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణను అమలు చేయాల్సిన బాధ్యద ఉన్నతాధికారులపైనే ఉంటుంది. ఆయా గ్రామాల డిమాండ్ మేరకు నీటి సరఫరాను దృష్టిలో పెట్టుకుని తగిన ప్రత్యామ్నాయపరిస్థితులపై దృష్టి పెట్టి అత్యవసరంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాలు ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో మిషన్ భగీరథ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఇఎన్‌సి) కృపాకర్ రెడ్డిని తప్పించారు. పంచాయతీ రాజ్ శాఖ ఇఎన్‌సి కనకరత్నం మార్చి 31తో పదవీవిరమణ పొందారు, ఈ రెండు పదవులలో ఇన్‌చార్జ్ బాధ్యతలను ఎవ్వరికీ అప్పగించలేదు. దీంతో ముఖ్యమైన నిర్ణయాల విషయంలో ఇబ్బందికరపరిస్థితులు ఉంటాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

కాగా రిటైర్డ్ అయిన ఉన్నతాధికారులను సర్వీసు నుంచి తొలగించాలని ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో, మార్చి 28న ఉత్తర్వులు జారీ చేశారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులను ఈ నెల 1న పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ తప్పించింది. అయితే కృపాకర్ రెడ్డికి ఈ ఏడాది అక్టోబర్ వరకు గడువు ఉన్నప్పటికీ ఆయనను ఇఎన్‌సి నుంచి తప్పించారు. రిటైర్డ్ ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం, ఆయా పదవులలో ఇన్‌చార్జ్ బాధ్యతలను ఎవరికి అప్పగించాలనే విషయమై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోవడంతో ఆ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**మరో ఇద్దరు ..**
వచ్చే ఏడాది 2026 సంవత్సరం వరకు గడువు ఉన్నప్పటికీ తెలంగాణ రాష్ట్ర స్త్రీ నిధి ఎండి విద్యా సాగర్ రెడ్డితో పాటు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి అశోక్‌ను తప్పించారు. జూన్ లేదా జూలైలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్య దర్శి లేకపోతే ఎన్నికల ప్రక్రియకు మరింత అటంకాలు తప్పవనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు ప్రస్తుత ఏడాది బడ్జెట్‌లో హెచ్ఎఎం ప్రాజెక్టు కింద వేలాది కిలోమీటర్ల గ్రామీణ రోడ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనులను సాఫీగా, త్వరితగతిన ముందుకు సాగాలంటే దీనికి సంబంధించిన కార్యాచరణ, ఎప్పటికప్పుడు సమీక్షలు, సమావేశాలను నిర్వహించాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యమైన పంచాయతీరాజ్ ఇఎన్‌సి ఇన్‌ఛార్జ్ బాధ్యతలను కూడా ఇతరులకు అప్పగించలేదు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు మరో యువకుడు బలి

రూ.5 లక్షలు పోగొట్టుకుని ప్రాణం తీసుకున్న యువకుడు



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ఆన్‌లైన్ బెట్టింగ్ మరో యువకుడిని బలి తీసుకుంది. ఆన్‌లైన్ గేమ్‌లో ఐదు లక్షల రూపాయలు పోగొట్టుకుని తీవ్ర మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ పేజీకి విషాధకర సంఘటన నిజామాబాద్ రూరల్ మండలం ఆకుల కొండూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఆకుల కొండూర్‌కు చెందిన ఆకాష్(22) గత కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్‌కు బానిసగా మారాడు. ఈ మధ్యకాలంలో ఐదు లక్షల రూపాయల ఆన్‌లైన్ గేమ్‌లో పోగొట్టుకుని ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై విషయాన్ని భార్యకు కానీ తల్లిదండ్రులకు గానీ తెలిస్తే ఏమవుతుందోనని తనలో తానే మదనపడి ఆత్మహత్య చేసుకోవడమే శరణ్యంగా భావించాడు. గత నెల 26న గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆకాష్‌ను వెంటనే జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి యువకుడు మంగళవారం అర్ధరాత్రి చనిపోయాడు. ఆకాష్ చనిపోవటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆకులకొండూర్ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బెట్టింగ్ యాప్‌లపై ఉక్కుపాదం మోపిన విషయం తెలిసిందే. ఓవైపు చర్యలు చేపడుతుంటే మరోవైపు యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ఆకర్షితులు కావటం లక్షల్లో డబులు పోగొట్టుకోవడం సర్వసాధారణం మారింది. ఇదే తరహాలో జిల్లాలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకోవడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. జిల్లా సీపీగా బాధ్యతలు స్వీకరించిన సాయిచైతన్య యువతకు పలు సందేశాలు ఇచ్చారు. బెట్టింగ్ యాప్‌ల వైపు ఆకర్షితులు కావద్దని, తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. సీపీ సూచించిన వారం రోజుల వ్యవధిలోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌కు ఆకాష్ అనే యువకుడు తన నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న సంఘటన పలువురి హృదయాలను కలిచివేసింది. పోలీసు అధికారులు యువకుని మృతిపై సీరియస్‌గా పరిగణించి బెట్టింగ్ యాప్‌లను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు. తమ జీవితాలను అంధకారంగా మారుస్తున్న ఇలాంటి బెట్టింగ్ యాప్‌లకు యువత దూరంగా ఉండాలని పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

## మూసీ పరిసరాల్లో నిర్మాణాలు చేపట్టొద్దు

ఉత్తర్వులు జారీ చేసిన మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన విషయం తెల్సిందే. ప్రాజెక్టులో భాగంగా మూసీ నది పరిసరాల్లో నిర్మాణాల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మూసీ పరిసరాల్లో ప్రణాళిక రహిత నిర్మాణాలు చేపట్టకుండా ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం నలుగురు సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ జెఎండి, డిటిసిపి, జిహెచ్ఎంసి చీఫ్ సిటీప్లానర్, హెచ్ఎండిఏ ప్లానింగ్ డైరక్టర్ కమిటీలో సభ్యులుగా ఉంటారు. మూసీకి 50 మీటర్ల వరకు బఫర్‌జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని మున్సిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిషోర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 50 నుంచి 100 మీటర్ల వరకు కొత్తగా ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. మాస్టర్ ప్లాన్ ఖరారు అయ్యే వరకు, కమిటీ క్లియర్ చేసేంత వరకు ఏవిధమైన కొత్త నిర్మాణ అనుమతులు మంజూరు చేయవద్దు అని తెలిపారు. మూసీకి 100 మీటర్ల వరకు ప్రభుత్వ పనులు చేపట్టాలన్నా, ముందస్తు అనుమతి తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులలో పేర్కొన్నారు. మూసీ పర్యావరణ సమతుల్యత పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ జేఎండీకి కమిటీలో చోటు కల్పించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ ఉత్తర్వులను ఖచ్చితంగా అమలు చేయాలని, మూసీ, ఈసా నదీ తీర ప్రాంతాల్లో నియంత్రిత అభివృద్ధిని అరికట్టాలని ఆదేశించారు.

## పూర్వ జిల్లాలకు బదిలీ చేయండి

ప్రభుత్వానికి తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల నేపథ్యంలో బదిలీ చేసిన 26 మంది తహాశీల్దార్లను తిరిగి పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గౌతం కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతిసారి ఎన్నికల సమయంలో తహాశీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తారని, ఎన్నికల ప్రక్రియ ముగియగానే తిరిగి వారిని పూర్వ జిల్లాలకు పంపిస్తారని, కానీ శాసనసభ ఎన్నికలు జరిగి ఏడాదిన్నర దాటినప్పటకీ తహసీల్దార్లను పూర్వ జిల్లాలకు బదిలీ చేయలేదని తెలిపారు. ఈ మేరకు వారు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శికి బుధవారం వినతి పత్రం అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్లను వారం రోజుల్లో పరిష్కరించాలని, లేదంటే తమ కార్యవర్గ సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వారు స్పష్టం చేశారు. జివో 317లో భాగంగా ఇతర జిల్లాలకు బదిలీ అయిన అన్ని కేడర్ సిబ్బందిని స్థానికత ఆధారంగా పూర్వ జిల్లాలకు బదిలీ చేయాలని, పదోన్నతుల సమయంలో జూనియర్ అసిస్టెంట్లు, సీనియర్ అసిస్టెంట్లను, నాయబ్ తహాశీల్దార్లను , తహాశీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేశారని, వారిని కూడా సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. ఇతర శాఖలకు బదిలీ చేసిన 5400 మంది విఆర్‌ఒలను వారి అనుభవం ప్రాతిపదికగా 10వ తరగతి ఉత్తీర్ణతతో సహా పూర్తి స్థాయిలో వారిని మాతృ శాఖకు తిరిగి తీసుకోవాలని రవీందర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## మూడు నెలల్లో ఎసిబిలో 52 కేసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఈ ఏడాది గడిచిన మూడు నెలల్లో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) రాష్ట్ర వ్యాప్తంగా 52 కేసులు నమోదు చేసింది. ఇందులో లంచం తీసుకుంటు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన కేసులు 37, ఆదాయానికి మించిన కేసులు నాలుగు, మరో నాలుగు కేసులు క్రిమినల్ నేరాలు, మూడు సాధారణ విచారణలు, ఆకస్మిక తనిఖీ ద్వారా ఒక కేసు, తదితర మరో ఆరు ఇతర కేసులు ఉన్నాయి. లంచం తీసుకుంటూ పట్టుబడిన కేసులో రూ.12,33,500 నగదు స్వాధీనం చేసుకోవడం జరిగింది. అలాగే ఆదాయానికి మించిన ఆస్తుల్లో రూ.4,79,28,767 విలువైన ఆస్తులు బయట పడ్డాయి. ఇదిలావుండగా మార్చి నెలలో ఎసిబి 15 కేసులు నమోదు చేసింది. ట్రాప్ కేసుల్లో రూ.3,28,500 నగదు స్వాధీనం చేసుకోగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగితో పాటు పదిహేను మంది ప్రభుత్వ ఉద్యోగులను అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో. రెవెన్యూ, హోమ్, ఎంఎ అండ్ యుడి, శక్తి, విద్య, ఆరోగ్యం, వైద్యం, రవాణా, వ్యవసాయం, సహకార శాఖలకు సంబంధించిన అధికారులు ఉన్నారు.

**టోల్ ఫ్రీ నెంబర్ 1064కు కాల్ చేయండి :**
**ఎసిబి డిజి విజయ్‌కుమార్**



ఏదైనా పబ్లిక్ సర్వెంట్ లంచం డిమాండ్ చేసినట్లయితే, చట్టం ప్రకారం చర్య తీసుకోవడానికి ఎసిబి టోల్‌ఫ్రీ నంబర్ 1064 ను సంప్రదించాలని ఎసిబి డిజి విజయ్‌కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఎసిబి సోషల్ మీడియా ప్లాట్ఫారమ్లు వాట్సాప్ నెంబర్ 9440446106, ఫేస్‌బుక్..తెలంగాణ ఎసిబి, ట్విట్టర్.. @తెలంగాణ ఎసిబి ద్వారా కూడా సంప్రదించవచ్చునని అన్నారు. బాధితుల పేర్లు వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు.

## కాలుష్యాన్ని తగ్గించేందుకు పట్టిష్టమైన చర్యలు

జిహెచ్ఎంసి కమిషనర్ డాక్టర్ కె.ఇలంబర్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఎపి) కింద నగర స్థాయిలో అమలు, పర్యవేక్షణ కమిటీ సమావేశం బుధవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశం జిహెచ్ఎంసి కమిషనర్ డాక్టర్ కె. ఇలంబర్తి అధ్యక్షత జరిగింది. ఈసమావేశంలో హైదరాబాద్ సైబరాబాద్, రాచకొండ ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు, టిజిపిసిబి, టిజిఐఐసి, టిజిఎస్ ఆర్‌టిసి, భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్, హెచ్ఎంఆర్‌ఎల్, పౌరసఫరాల శాఖ, టిజి ట్రాన్స్ కో, జిహెచ్ఎంసి అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో హైదరాబాద్ నగరంలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించి, వివిధ శాఖల ద్వారా చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి హైదరాబాద్ నగరానికి రూ.112.36 కోట్ల నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. సమావేశంలో వివిధ విభాగాలతో చర్చించిన అనంతరం ముఖ్యమైన సూచనలు నిర్ణయాలు తీసుకున్నారు.

**పరిశుభ్రమైన వాయువు అందించేందుకు కృ...**
కమిషనర్ డాక్టర్ కె.ఇలంబర్తి మాట్లాడుతూ అన్ని శాఖలు కలిసి పని చేసి, హైదరాబాద్ నగరానికి పరిశుభ్రమైన వాయువును అందించడానికి కృషి చేయాలని సూచించారు. తిసుకునే చర్యలు పిఎం 10 తగ్గింపు, ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ మెరుగుపడేలా చేయాలన్నారు. టిజిపిసిబి మరిన్ని ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలన్నారు. రహదారులను ధూళి రహితంగా ఉండేందుకు చేపట్టవలసిన చర్యలను అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా స్వీపింగ్ మిషన్స్ ద్వారా కాలుష్యం తగ్గించే అవకాశం ఉందనేది కూడా పరిశీలన చేయాలన్నారు. వాహనాల ద్వారా కాలుష్యాన్ని తగ్గించేందుకు చేపట్టవలసిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా రవాణాలో వ్యవస్థలో కూడా ఎలక్ట్రికల్ వాహనాలు వాడకం పెంచేందుకు చర్యకు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణ రంగంలో కూడా కాలుష్యాన్ని నివారించేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అధిక కాలుష్యాన్ని సృష్టించే పారా మీటర్ల ఎక్కువగా ఉన్న కొన్ని అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ లు రఘు ప్రసాద్, సుభద్ర దేవి, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సిపి జోయల్ డేవిస్, రాచకొండ ట్రాఫిక్ డిసిపి శ్రీనివాసులు సి.ఈ లు భాస్కర్ రెడ్డి, కోటేశ్వరరావు, రత్నాకర్, సిసిపి శ్రీనివాస్, ట్రాన్స్ పోర్ట్ జాయింట్ కమిషనర్ సి.రమేష్, టి.జి.పి.సి.బి సీనియర్ సైంటిస్టులు డా.డి.ప్రసాద్, ఎన్.జయశ్రీ, సికింద్రాబాద్ ఆర్డిఓ సాయిరాం, టిజిఎస్‌ఆర్‌టిసి డిప్యూటీ సి.ఎం.ఈ వి.శివ శంకర్, ఏ.ఎం.ఈ నాగభూషణం ఇతర అధికారులు రామ్మోహన్, మనోహర్ కుమార్ రాథోడ్, శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు, మెట్రో రైలు, టి.జి.ఐ.ఐ.సి, ఇ.పి.టి.ఆర్.ఐ అధికారులు, ఎలక్ట్రికల్ ఈఈ లు, తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన శిల్పా లేఔట్ ఫ్లైఓవర్ పనులు పూర్తి

జిహెచ్ఎంసి చీఫ్ ఇంజనీర్(ప్రాజెక్ట్స్) భాస్కర్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గచ్చిబౌలి నుండి కొండాపూర్ వరకు నిర్మిస్తున్న శిల్పా లేఔట్ ఫ్లైఓవర్ పనులను మే 15 వరకు పూర్తి చేయాలని జిహెచ్ఎంసి చీఫ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) భాస్కర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సి.ఈ భాస్కర్ రెడ్డి, ఎస్ఈ, ఈఈ, కన్సల్టెంట్, నిర్మాణం సంస్థ ప్రతినిధులతో కలిసి ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనులు సత్వరం పూర్తి చేయాలని, అగచ్చిబౌలి నుండి కొండాపూర్ ఎడమ వైపు సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సర్వీస్ రోడ్డులో విద్యుత్ పరికరాలు తొలగించేందుకు స్థల సమస్య ఉన్న నేపథ్యంలో సర్వీస్ రోడ్డు చేపట్టలేక పోయినట్లు ఏజెన్సీ వివరించడంతో అక్కడే ఉన్న ప్రాజెక్టు ఈఈ తొందరగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షపు నీటి డ్రైన్‌కు స్పష్టమైన స్థలం లేకపోవడంతో జాప్యానికి కారణమన్నారు. ఓల్డ్ ముంబాయి హైవేలో సమగ్ర జంక్షన్ అభివృద్ధికి అవసరమైన ఆస్తుల సేకరణ చేయాలన్నారు. ఓఆర్‌ఆర్ స్ట్రెచ్‌లో గ్రేడ్ రోడ్డు పిఎస్‌ఓ మీడియన్ తదితర పనులు పరిశీలించి, అధికారులకు ఏజెన్సీకి తగు సూచనలు జారీ చేశారు. డిజైన్, ప్రమాణాల ప్రకారం విస్తరణ జాయింట్లను ఇన్ బిల్ట్ చేయాలని సూచించారు. సిఈ వెంట డిప్యూటీ ఈఈ హరీష్ తదితరులు ఉన్నారు.

## సర్వాయి పాపన్న గౌడ్ పోరాట పటిమ స్ఫూర్తిగా తీసుకోవాలి

**ప్రజాపక్షం/నారాయణపేట్:** బడుగు బలహీనవర్గాల సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సాధారణ కుటుంబంలో జన్మించి పశువులు కాపరిగా, గీతా కార్మికుడిగా తన ప్రస్థానంలో భాగంగా అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాటం సలిపిన మహాయోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి అబ్దుల్ ఖలీల్, డిపిఆర్ఓ రషీద్, గౌడ్ సంఘం నాయకులు సతీష్ గౌడ్ గురునాథ్ గౌడ్ శ్యాంసుందర్ గౌడ్ చంద్రశేఖర్ గౌడ్, క్రాంతి కుమార్ గౌడ్, అశోక్ గౌడ్, వార్డెన్లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సి పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్ ఎస్ఎస్‌సి పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఇందులో భాగంగా, మెట్టుగడ్డ వద్ద ఉన్న శాశాబ్ గుట్ట హై స్కూల్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ విద్యార్థుల రాకపోకలకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులు, అధ్యాపకులు, ఇతర సిబ్బంది మొబైల్ ఫోన్లను అనుమతించ కూడదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ రూరల్ సీఐ గాంధీ నాయక్, రూరల్ ఎస్ఐ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మరో జాతిపిత మహాత్మా జ్యోతిరావు పూలే



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మరో జాతిపిత మహాత్మా జ్యోతిరావు పూలే అని రాష్ట్ర దళిత నాయకులు మంగి విజయ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రాష్ట్ర బీసీల సన్నాహక సమావేశం ఎంజెఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిరావు పూలే కులానికి మతానికి చెందిన వారు కాదని అన్నారు. నేడు ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు చైతన్యవంతంగా ఉన్నామంటే దానికి కారణం జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ పూలేని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సందర్భంగా తెలిపారు. ఈ నెల 9న మండల కేంద్రంలో జ్యోతిరావు పూలే విగ్రహావిష్కరణ కోసం రాష్ట్ర నలుమూలల నుండి బీసీ, ఎస్టీ, ఎస్సీ , మైనార్టీ నేతలతో పాటు వివిధ పార్టీల రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. మనిషి పుట్టి బానిసగా బతకడం కాకుండా సమాజంలో చదువుకుని చైతన్యంగా ఉన్నత చదువులు చదువుకోవాలని ఆ రోజుల్లోనే మార్గదర్శకంగా నిలవాలని పిలుపునిచ్చిన వ్యక్తి కాదు శక్తి అని మనిషిలో ఉన్న జ్ఞానాన్ని మేల్కొల్పిన వ్యక్తి జ్యోతిరావు పూలే అని అన్నారు. ఆ మహనీయుని పుట్టిన ప్రతి మనిషి ఒక్కరోజైనా జ్ఞాపకం చేసుకోకపోతే మనిషికి అర్థమే లేదని అన్నారు. జ్యోతిరావు పూలే కుటుంబం మొత్తం సమాజానికి సేవ చేసిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నాయకులు, బంగారి పర్వతాలు, రాజేందర్ గౌడ్, మిద్దె రాములు, వెంకటస్వామి, అల్లుజి, సత్యశీల సాగర్, గూటం విజయ్, దశరథం, వెంకటేశ్ గౌడ్, రామన్ గౌడ్, నారాయణ చారి, తిరుపతయ్య, శ్రీనివాసులు, సుధాకర్, మధుబాబు, బిజినపల్లి మండల బీసీ సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డాకులలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం



**ప్రజాపక్షం/అడ్డాకుల:** ఏఐసిసి ఆదేశానుసారం టిపిసిసి పిలుపుమేరకు దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆదేశాల మేరకు జై బాబు జైభీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని అడ్డాకుల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించరూ . ఈ కార్యక్రమంలో అడ్డాకుల మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు మండల అధ్యక్షులు తోట శ్రీహరి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు నాగిరెడ్డి, డిసిసి జిల్లా కార్యదర్శి గంగుల విజయ్ మోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ శకుంతల, మార్కెట్ డైరెక్టర్ శేఖర్ రెడ్డి , వేగనాథ్ ర్యాలీలో పాల్గొనడం జరిగింది.

## పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులు అడ్డుకోవద్దు



**ప్రజాపక్షం/కొత్తకోట:** దురుద్దేశంతో కొందరు పామాయిల్ రైతులుగా ఉండి ఫ్యాక్టరీ నిర్మాణ పనులను అడ్డుకోవడం తగదని ఫాం అయిల్ రైతు నేత హరీష్ రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి వద్ద నూతనంగా నిర్మిస్తున్న నిర్మాణ పనులను ఫాం ఆయిల్ రైతు బృందంతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం రైతు నేత హరీష్ రెడ్డి మాట్లాడుతూ కొందరు ఫామ్ ఆయిల్ రైతులుగా ఉండి ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అడ్డుకోవడం తగదని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20వేల ఎకరాలలో పామాయిల్ సాగు జరుగుతుందని అన్నారు. ఫ్యాక్టరీతో ఎటువంటి కాలుష్యం జరగదన్నారు. నిర్మాణంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. కాలుష్యంపై ఉద్యానవన ఆధ్వర్యంలో ఖమ్మంలోని పామాయిల్ తోటలను , ఫ్యాక్టరీ పరిశీలించామన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణంతో కాలుష్యంపై ఎవరు అధైర్య పడవాల్సిన అవసరం లేదన్నారు. సహకరించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. రైతులు కావలి బుచ్చన్న , శ్యాం సుందర్ రెడ్డి, మాధవన్న, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం పంపిణీ



**ప్రజాపక్షం/వెల్దండ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని రేషన్‌షాప్ లో స్థానిక తహసీల్దార్ కార్తీక్ కుమార్, మార్కెట్ చైర్మన్ , సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, పర్వత్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కొయ్యల పుల్లయ్య, ఎండి అమీద్, ఎండి.రషీద్, బానావత్ శంకర్ నాయక్, శ్రీను, రమేష్, మారేపల్లి శ్రీను, ఆనంద్, రేవల్లి రాజు, నారాయణ, భరత్ ఉన్నారు.

## విద్యార్థులకు స్కూల్‌బ్యాగుల అందజేత



**ప్రజాపక్షం/వంగూర్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల వంద మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు ఎమ్మార్సీ కార్యాలయంలో వాల్‌క్లాక్‌ను కొండారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేసి రిటైర్డ్ పొందిన ప్రధానోపాధ్యాయులు హేమలత వివేకానందలు బుధవారం ఎంఈఓ మురళి మోహనచారి ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శశివర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

# గ్యాంగ్‌రేప్ కేసులో నిందితుల అరెస్టు



**ప్రజాపక్షం/కల్వకుర్తి:** నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల పరిధిలోని ఊర్కొండపేట గ్రామ సమీపంలోగల అభయాంజనేయస్వామి దేవాలయ పరిసర ప్రాంతంలో శనివారం రాత్రి వివాహితపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్‌పి వైభవ్‌గైక్వాడ్ రఘునాథ్ తెలిపారు. బుధవారం కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి వెంకటేశ్వర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి వైభవ్‌గైక్వాడ్ రఘునాథ్ మాట్లాడుతూ ఊర్కొండ మండలం ఊర్కొండపేట గ్రామానికిచెందిన మార్పాకుల ఆంజనేయులు, ఎండి. సాదిక్‌బాబా, వగుల్దాస్ మణి, కార్తీకర్, మట్టమహేష్ గౌడ్, హరీష్‌గౌడ్, మట్ట ఆంజనేయులు కలిసి ముఠాగా ఏర్పడి ఊర్కొండపేట అభయాంజనేయస్వామి దేవాలయానికి వచ్చిపోయే భక్తులపై నిఘా ఉంచేవారు. ఈనేపథ్యంలో శనివారం ఓ వివాహిత తన పిల్లలతో ఆలయానికి చేరుకొని స్వామి దర్శనం చేసుకున్నది. నిందితులలో ఒకరు దేవాలయంలో కాంట్రాక్టు విధులు నిర్వహిస్తూ వీరిని గమనించి తన అనుచరులకు తెలియజేశాడు. వివాహిత కాలకృత్యాలు తీర్చుకోవడానికి తన బంధువుతో ఆలయానికి 150మీటర్ల దూరానికి వెళ్లడంతో అప్పటికివారిని నలుగురు నిందితులు వెంబడించారు. మిగతా ముగ్గురికి సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందివ్వడంతో వారు ఘటనస్థలానికి చేరుకొని వివాహిత బంధువు పైదాడిచేసి ఆమెను ఏడుగురు కలిసి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అత్యాచారానంతరం వివాహిత దాహమేస్తుందని నీళ్లు అడగడంతో ఆమె ముఖంపై మూత్రం పోశారని తెలిపారు. వారివద్దగల బంగారం వస్తువులు రూ.6వేలు తీసుకున్నారన్నారు. ఈవిషయం బయటికిచెప్తే మిమ్మల్ని చంపేస్తామని బెదిరించడం జరిగిందని తెలిపారు. ఈఘటన నుండి బయటపడి దిక్కుతోచని స్థితిలో సోమవారం ఉదయం ఊర్కొండ మండల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని అన్నారు. ఈకేసు డిఎస్‌పి వెంకటేశ్వర్లు, సీఐ నాగార్జున, విష్ణువర్దన్‌రెడ్డిలతోపాటు ఎస్ఐలు కృష్ణదేవ, కురుమూర్తి, మాధవరెడ్డిల పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగిందన్నారు. సిసి ఫుటేజ్ ఆధారంగా మొదట ఆలయంలో పనిచేస్తున్న నిందితుడిపై దర్యాప్తు చేయడంతో కొన్ని అంశాలు బయటపడ్డాయని ఆయన గుర్తు చేశారు. వివాహితపై సామూహిక అత్యాచారానికి పాల్పడటంతో ఏడుగురిపై 33/2025, 70,351,310సెక్షన్ల కింద నిందితులపై కేసులు నమోదుచేసి అరెస్టుచేశామని తెలిపారు. కేసు ఛేధించి తగిన ఆధారాలతో నిందితులను పట్టుకున్న కల్వకుర్తి సబ్‌డివిజన్ పోలీసులను ఎస్‌పి అభినందించారు.

**నిందితులను కస్టడికి కోరుతాం :** అత్యాచారానికి పాల్పడిన నిందితులను మరోసారి విచారించేందుకు కస్టడికి కోరుతామని ఎస్‌పి తెలిపారు. గతంలో నిందితులు ఏమైనా ఇలాంటి సంఘటనలకు పాల్పడ్డారా లేదా అనేకోణంలో విచారించడం జరుగుతుందని స్పష్టంచేశారు. ఊర్కొండ ఆలయంలో ప్రతి మంగళ, శనివారాలలో ప్రత్యేక పోలీస్ పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ముఖ్యమైన ఆలయాలలో పెట్రోలింగ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. బాధితురాలికి వైద్యం అందించడం జరిగిందని ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆమెకు ఉద్యోగంతోపాటు పరిహారం అందించి అన్ని విధాలుగా అండగా ఉండటం జరుగుతుందని అన్నారు. బాధితురాలి నోట్లో మూత్ర విసర్జన చేయలేదని ముఖంపై చల్లడం జరిగిందన్నారు. జిల్లాలో గంజాయి, జూదంలపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని ఎస్‌పి తెలిపారు. మంగళవారం సామూహిక అత్యాచారం జరిగిన సంఘటన ప్రదేశాన్ని మల్టీజోన్‌టు ఐజి సత్యనారాయణ సందర్శించడం జరిగిందని ఎస్‌పి గుర్తుచేశారు.

## రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోంది

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తున్నారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఏఐసిసి పిలుపు మేరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని 11,25వ వార్డులో నిర్వహించిన జై బాపు, జై భీం , జై సంవిధాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నాడు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మైనార్టీల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందని, అందులో భాగంగానే రాజ్యాంగం మార్చాలనే కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాజ్యాంగ మార్చితే మైనార్టీలు హక్కులను కోల్పోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ప్రజలందరినీ చైతన్య పరుస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఈ కుట్రను తిప్పి కొట్టాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, చంద్రకుమార్ గౌడ్, ఆనంద గౌడ్ , సీనియర వెంకటేశ్ , సిరాజ్ ఖాద్రి, బెక్కెరి మధుసూదన్ రెడ్డి, గంజి ఆంజనేయులు, షబ్బీర్ అహ్మద్, ఫయాజ్, నాగరాజు, ఎలంగారి భరత్, రమేష్, నరేష్, కిషన్ నాయక్, హకీం, అశ్వాక్, రాఘువ, శ్యాం యాదవ్, పాల్గొన్నారు.

## జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ 1861 అమలు: ఎస్‌పి జానకి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా ప్రశాంతతను పెంపొందించేందుకు ఈ నెల 2వ తేది నుండి 30వ తేది వరకు జిల్లా అంతటా 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ , బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 30 పోలీస్ ఆక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగులు, ఊరేగింపులు, ధర్నాలు జరపరాదు. నిషేదిత ఆయుధములు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డు కర్రలు, తుపాకులు, ప్రేలుడు పదార్థములు, నేరమునకు పురిగొల్పే ఎటువంటి ఆయుధములను వాడరాదు. ప్రజలకు ఇబ్బంది, చిరాకు కలిగించేందుకు దారితీసే పబ్లిక్ మీటింగు లను జనసముహం ప్రోగు అవుట వంటివి నిషేధం, రాళ్లను జమ చేయుట, ధరించి సంచరించుట వంటివి నిషేధం, లౌడ్ స్పీకర్‌లు, డీజేలు, వంటివి కూడా ఈ సమయంలో నిషేధము నియమాలు ఎవరైనా ఉల్లంఘించిన 30 పోలీసు ఆక్ట్ 1861 కింద శిక్షార్హులు అగుదురని ఎస్పీ పేర్కొన్నారు.

# పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ప్రభుత్వం చౌక ధర దుకాణాలో సన్నబియ్యం పంపిణీ చేయడం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని వీరన్నపేట , కిసాన్ నగర్ (బండ్లగేరి), చౌకధర దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో గత ప్రభుత్వం పేదలకు నిత్యావసర సరుకులు కూడా సక్రమంగా పంపిణీ చేయలేదని, చౌకధర దుకాణాల్లో అన్ని సరుకులు పంపిణీ ఎత్తివేసి కేవలం దొడ్డు బియ్యానికి మాత్రమే పంపిణీ చేశారని ఆయన విమర్శించారు. పదేళ్ల గత ప్రభుత్వ పాలనలో కొత్తగా ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని అన్నారు. ప్రజా ప్రభుత్వం మరికొన్ని సరుకులు పేదలకు అందించేలా ప్రయత్నిస్తోంది అని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఒక విప్లవాత్మక కార్యక్రమంగా నిర్వహిస్తుందని, ఎటువంటి అవకతవకలు జరగకుండా, ప్రజలకు సన్నబియ్యం పంపిణీ ఖచ్చితంగా అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. రైతులు సన్నవడ్లు పండించే విధంగా వారిని ఒప్పించి, కోట్ల రూపాయలు వారికి బోనస్‌గా అందించి, ఈ రోజు పేద ప్రజలకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని అలాగే మన పిల్లలు చదువుకుంటున్న ప్రభుత్వ హాస్టల్స్‌లో, పాఠశాల లో కూడా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సంవత్సరం మొత్తం 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం ఉందని, 25 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించినట్లు ఆయన చెప్పారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదలకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టిందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, లక్ష్మణ్ యాదవ్, బెక్కెరి అనిత, మధుసూదన్ రెడ్డి, వెంకటేశ్, రవి నాయక్ పాల్గొన్నారు.

# ఉపాధిహామీ కూలీ పనులు కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమై రెండురోజులు గడిచిన మండల పరిధిలోని గ్రామాలలో ఇప్పటికి ఉపాధి హామీ పనులు ప్రారంభించలేదని, కూలీ పనులు కల్పించాలని కూలీలు కోరుతున్న పనులు ప్రారంభించకపోవడంతో ప్రతి కూలీకి ఉపాధి హామీ చట్టం ప్రకారంగా కూలీ భృతి కింద రూ. 307లు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. అంజనేయులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కల్వారాలలో ఉపాధి హామీ కూలీల సమస్యలపై మాట్లాడారు. కొత్త ఆర్థిక సంవత్సరం వచ్చి రెండు రోజుల లోనే కేంద్ర ప్రభుత్వం పెట్టిన కొత్త నిబంధనల మూలంగా మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా సంపత్ రావు పల్లి గ్రామంలోనే పని జరిగిందన్నారు. మిగతా 13 గ్రామ పంచాయతీలలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం పెట్టిన నిబందనలు వర్తించక రెండు రోజుల నుంచి కూలీలు పనులకు వెళ్లడానికి వీలు కావటం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన నిబంధనల వల్ల పాటు కాలువలు చెరువు పూడికలు తీయకూడదని , ఎస్సీ, ఎస్టీయేతర రైతుల పొలాలలో లేవలింగు పెట్టకూడదని, కూలీలకు పని కల్పించాలంటే కేవలం ప్రభుత్వ బీడు భూములలోనే పనులు కల్పించమని నిబంధనల మూలంగా కూలీలకు పని లేకుండా పోయిందని దీనితో కూలీలు పనులు లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన నిబంధనలు వెంటనే ఉపసంహరించుకొని ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వినతి పత్రం అందించడం జరుగుతుందని ఆంజనేయులు తెలిపారు.

# సన్న బియ్యం పంపిణీ చరిత్రాత్మకం

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం దేశ చరిత్రలోనే చారిత్రాత్మక ఘట్టమని దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో సామాన్యులకు సంపన్నులకు సమాన భోజనం అందించాలన్న ఉద్దేశంతో సన్న బియ్యాన్ని పంపిణీ చేసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి నియోజకవర్గంలోని ఖిల్లాఘనపురం, పెద్దమందడి, వనపర్తి మండల కేంద్రాలలోని రేషన్ దుకాణాలలో ఆయన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి హాజరై లబ్దిదారులకు సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు. పట్టణంలో 1,9,20వ నంబర్ రేషన్ షాప్ లో సన్న బియ్యం పంపిమీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంబించారు. సన్న బియ్యం పథకంలో రాష్ట్రంలో నిరుపేదల కడుపు నింపిన వ్యక్తి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. వనపర్తి పట్టణంలో 1,9,20 నంబర్ ప్ృభుత్వ చౌక దుకాణంలో బుధవారం రోజు ఆహార భద్రత కార్డు కలిగిన కుటుంబాలకు వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి సన్న బియ్యం పంపిణీ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో అధికారంలోకి వచ్చినాక పేదల బతుకులు మార్చుకుంటే ప్రతిపక్షాలు చూసి తట్టుకోలేకపోతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ , ఎంఆర్వో, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## జగ్జీవన్ రామ్, అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి:** బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్॥ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడంలో అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ఏప్రిల్ 5 న నిర్వహించనున్న బాబు జగ్జీవన్ రామ్ జయంతి, ఏప్రిల్ 14న నిర్వహించనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ విషయమై బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని మినీ సమావేశ మందిరంలో సంబంధిత సంఘాల ప్రతినిధులు, అధికారులతో సమావేశమై చర్చించారు. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం మరింత ఘనంగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఆయా సంఘాల నాయకులు, ప్రతినిధులు పూర్తి సహకారం సహకారాలను అందిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. సమావేశానికి హాజరైన పలుపురు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్॥ బి.ఆర్ అంబ్కేదర్ జయంతి ఉత్వాల నిర్వహణతో పాటు, ఎస్సీ, ఎస్టీల పై జరుగుతున్న దాడులు, అంబేద్కర్ విగ్రహాల పరిరక్షణ ఇతర సమాస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. బాబుఉ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాల వేసిన అనంతరం అంబేద్కర్ కళాభవన్ లో సమావేశం ఏర్పాటు చేసి బోజనాలు ఏర్పాటు చేయాలని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద మెట్లను ఏర్పాటు చేయాలని వారు కోరారు. జిల్లా పరిషత్ సీఈవో వెంకట్ రెడ్డి, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## వికలాంగుల సంక్షేమానికి కృషి

ఐఎన్‌టియుసి కార్యదర్శి బంగారి పర్వతాలు



**ప్రజాపక్షం/ బిజినేపల్లి :** జిల్లాలోని వికలాంగుల సంక్షేమం కోసం పాటుపడతానని తెలుగు రాష్ట్రాల ఐఎన్‌టియుసి కార్యదర్శి బంగారి పర్వతాలు అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా వికలాంగుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఐఎన్‌టీయూసీ తెలుగు రాష్ట్రల కార్యదర్శి, డిసిసి ఉపాధ్యక్షుడు బంగారి పర్వతాలు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వికలాంగుల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున బంగాని పర్వతాలు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వికలాంగులు పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం కోరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వ అందించే సంక్షేమ ఫలాలు అందేందుకు పాటుపడుతున్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజినేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మిద్దె రాములు, వాల్యా నాయక్, ఎద్దుల శ్రీకాంత్, వెంకటేష్ గౌడ్, మిద్దె శ్రీనివాసులు, మహాదేవుని పెట్ ఉపసర్పంచ్ బాలపీరు, చిక్కొండ్రా రాములు, అంజద్, తవ్విక్, అజ్జు, మిద్దె కురుమయ్య, రామకృష్ణ, కురుమయ్య, బాలయ్య, రాజ్ కుమార్, పర్వతాలు, జిల్లా ప్రధాన కార్యదర్శి మొల్గర పరుశ రాములు, ఉన్నారు.

## అర్హులైన వారు రాజీవ్ యువ వికాసం పథకానికి నేరుగా దరఖాస్తు

అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య



**ప్రజాపక్షం/వనపర్తి:** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ స్థానిక సంస్థల చాంబర్ లో రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. పథకానికి సంబంధించిన ముఖ్యమైన తేదీలు, ఇతర విధివిధానాల గురించి కమిటీ సమావేశంలో చర్చించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువత, ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రకటించిందని తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి దరఖాస్తు గడువును ప్రభుత్వం ఏప్రిల్ 14వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని తెలిపారు. ఈ పథకానికి జిల్లాలోని అర్హులైన వారు నేరుగా ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాలకు వచ్చి దరఖాస్తు చేసుకునేలా కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తు ఫారంలను అందుబాటులో ఉంచాలన్నారు. నేరుగా కార్యాలయానికి వచ్చి అప్లై చేసిన వారి దరఖాస్తులు తదుపరి ఆన్ లైన్ చేయించాలని చెప్పారు. దరఖాస్తులు ఆప్లై చేసిన తర్వాత సంబంధిత కార్పొరేషన్ల వారిగా వారు ఏ యూనిట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు వంటి అంశాల ఆధారంగా దరఖాస్తులను వేరు చేసి పెట్టుకోవాలని సూచించారు. ఏప్రిల్ 14వ తేదీ వరకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించి మండల స్థాయిలో వెరిఫై చేసి ఏప్రిల్ 20వ తేదీ లోపు జిల్లా స్థాయి కమిటీకి పంపాల్సి ఉంటుందని చెప్పారు. ఆ తర్వాత ఏప్రిల్ 21వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా స్థాయి కమిటీ దరఖాస్తులను పరిశీలించిన అనంతరం ఎంపికైన వారికి జూన్ రెండవ తేదీన మంజూరి పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



ప్రజాపక్షం/సూర్యాపేట: వేసవి కాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డిలు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ సమీపంలో వినాయక ఆసుపత్రి, వజ్రా లాడ్జీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజు వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఎంతగానో దోహదపడుతుంద న్నారు. ఈ కార్యక్ర మంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్య క్షులు ఎలిమినేటి అభినయ్, చింతమళ్ళ రమేష్, పందిరి మల్లేష్, డాక్టర్ అజయ్ కుమార్, డాక్టర్ మీనా, వెంకటేశ్వర్లు, పరమేష్, మహేష్, రాము, జ్యోతి పాల్గొన్నారు.

## సన్నబియ్యం పంపిణీ పరిశీలన



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో 1.24లక్షల లబ్దిదారులకు 2500 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేసినట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రేషన్ దుకాణం నెంబర్ 14ను జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి పరిశీలించారు. బియ్యం నాణ్యత ఏలా ఉందని లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. సన్నబియ్యం నాణ్యతతో ఉన్నాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. దుకాణంలోని స్టాక్, బియ్యం నాణ్యత, ఈ పాస్ మిషన్ పని విధానంను పరిశీలించారు. ఆయన వెంట సివిల్ సప్లై శాఖ డిటి నాగలక్ష్మి , రేషన్ డీలర్ అన్నపూర్ణ ఉన్నారు.



## పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

### నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం

ప్రజాపక్షం/చిట్యాల: తెలంగాణ రాష్ట్రంలోని పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నల్లగొండ జిల్లా నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో సన్నబియ్యం పథకాన్ని బుధవారం ఆయన ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఆ కోవలోకి చెందినదే సన్న బియ్యం పంపిణీ పథకమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు కష్టపడుతున్న వ్యక్తి రేవంత్‌రెడ్డి అని కొనియాడారు. అసెంబ్లీలో ఎస్‌సి వర్గీకరణ, బిసి రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టి ఆమోదింపచేసిన ఘనత ఆయనదని వీరేశం అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నాయక్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ కాటం వెంకటేశం, వెలిమినేడు పిఎసిఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, నాయకులు గుడిపాటి లక్ష్మి నర్సింహ్మా, బట్టు ఐలేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐవైఎఫ్ రాజీలేని పోరాటాలు





ప్రజాపక్షం/వలిగొండ :అఖిల భారత యువజన సమాఖ్య వలిగొండ మండల 4వ మహాసభలు శివ శక్తి ఫంక్షన్ హాలులో జరిగాయి. ఈ మహాసభకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లంకి మహేష్, పెరబోయిన మహేందర్ పాల్గొని మాట్లాడుతూ ఏఐవైఎఫ్ సమాజ హితాన్ని, ప్రజా వ్యతిరేక విధానాలపై కేంద్ర, రాష్ట్ర పాలకుల తీరును నిరసిస్తూ నిరంతరం పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తుందని, రాజీలేని పోరాటాలు చేస్తుందని అన్నారు. ప్రధానంగా గ్రామాలలో యువత బెట్టింగులకు వివిధ మాదక ద్రవ్యాలకి దూరం గా ఉండాలని యువత మంచి మార్గంలో నడవాలని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని అన్నారు. అనంతరం నూతన మండల కమిటీ ఎన్నిక మండల అధ్యక్షులుగా మారోజు నరసింహ చారి, మండల కార్యదర్శిగా సుద్దాల సాయికుమార్, ఉపాధ్యక్షులుగా కూరేళ్ళ దేవేందర్, సహాయ కార్యదర్శిగా గుండేగాని నాగరాజు, కోశాధికారిగా మేడి దేవేందర్, 15 మంది తో కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సలిగంజి కృష్ణ కుమార్, బాలగోని రాజు, కందుకూరి వినయ్, సలిగంజి ప్రదీప్, మెట్టు లక్ష్మీ నారాయణ, సంఘీ కృష్ణ, నార్కట్పల్లి మచ్చగిరి, కట్ల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## జయంతి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు



ప్రజాపక్షం/నల్లగొండ: బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ల జయంతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అందరు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. ఏప్రిల్ 5 న బాబు జగ్జీవన్ రామ్,ఏప్రిల్ 14 న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణ విషయమై బుధవారం ఆమె ఉదయాదిత్య భవన్ లో వివిధ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ రెండు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు వివిధ సంఘాల నాయకుల అభిప్రాయాలను పరిగణలో తీసుకోని విజయవంతం చేసేందుకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అందువల్ల సంఘాల ప్రతినిధులు సమన్వయంతో ఉత్సవాల విజయవంతానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అదనపు ఎస్ పి రమేష్, జడ్‌పి సిఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్,డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, డి సి ఓ పత్యా నాయక్ పాల్గొన్నారు.

## సన్నబియ్యం పంపిణీ పట్ల సిపిఐ హర్షం



ప్రజాపక్షం/నేరేడుచర్ల (పాలకవీడు): రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయడం హర్షణీయమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు అన్నారు. బుధవారం పాలకీడు మండలంలోని గుండెబోయినగూడెంలో సిపిఐ గ్రామశాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. దశాబ్దాల కాలంగా దొడ్డు బియ్యం పంపిణీ చేయడంతో ప్రజలు తీనలేకపోయారని దీంతో ప్రతి సంవత్సరం రూ. 10వేల ప్రజాధనం లూటీ అయ్యేదన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంతో పేదలు కడుపునిండ అన్నం తింటారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ముళ్ళ జానయ్య, మహిళ సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ లక్ష్మి , నారాయణమ్మ, సైదమ్మ, మరియమ్మ పాల్గొన్నారు.

## డిఎస్‌పి రవిని సస్పెండ్ చేయాలని ధర్నా, రాస్తారోకో

ప్రజాపక్షం/నూతనకల్: ఇటీవల మడలంలోని మిర్యాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్య గౌడ్ హత్య కేసులో డిఎస్‌పి రవిని ఐజి కార్యాలయానికి అటాచ్ చేసినప్పటికి తిరిగి డిప్యూటేషన్‌పై సూర్యాపేట జిల్లాకు రావడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం మిర్యాల గ్రామస్తులు, మెంచు చక్రయ్య గౌడ్ కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని సూర్యాపేటదంతాలపల్లి రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డిఎస్‌పి రవిను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఐజీ కార్యాలయానికి అటాచ్ అయిన ఆయన తిరిగి జిల్లాకు రావడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామస్తుల ధర్నాతో రోడ్డుకు ఇరువైపుల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ఇన్‌చార్జీ సిఐ రఘువీర్ రెడ్డి, ఎస్ఐ మహేంద్రనాథ్‌లు ఉన్నతాధికారులతో మాట్లాడించి న్యాయం చేస్తామని చెప్పడంతో ధర్నాను విరమించారు.

# రికార్డు స్థాయిలో డిసిసిబి పురోగతి

### రాష్ట్రంలో నల్లగొండకు రెండవ స్థానం : చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి : నల్లగొండ డిసిసిబి 2024/25 ఆర్థిక సంవత్సరంలో అన్ ఆడిట్‌లో గ్రాస్ ప్రాఫిట్ రూ 42.31 కోట్లు సాధించి తెలంగాణ రాష్ట్రంలోని రెండవ స్థానంలో రికార్డ్ సాధించిందని డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బుధవారం డిసిసిబి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో ఉన్న ప్రాఫిట్ రూ 30.00 కోట్లు, ఉండగా ఈఆర్థిక సంవత్సరంలో రూ12.31 కోట్లు అదనపు ప్రాఫిట్ పొందడం జరిగిందని తెలిపారు.దీంతో రూ 2850.81 కోట్లు చేరుకోవడం జరిగిందని గత ఆర్థిక సంవత్సరంలో రూ 2300.00 కోట్లు ఉండగా ప్రస్తుతము అదనముగా రూ 550.81 కోట్లు పెంచుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా గత గత సంవత్సరం ఎస్‌పిఎ1.85 నుండి 1.38 కి తగ్గించుకోవడం జరిగిందని ఇలా అన్ని రంగాలలో పురోగతి సాధించడం సంతోషకరంగా ఉందన్నారు. గతములో ఎన్నడు లేని విధముగా ఈ ఆర్థిక సంవత్సరంలో అధిక లాభాలతో, వ్యాపార వృద్ధి వృద్ధి చెందిందన్నారు. తక్కువ ఎస్‌పిఎ సాధించడం ఈ ఆర్థిక సంవత్సరంలో జరిగిందని దీనిలో మేనేజ్మెంట్ ఉద్యోగస్తుల కృషి ఎంతగానో ఉన్నదని తెలిపారు. 202425 ఆర్థిక సంవత్సరం లో డిపాజిట్ల విషయములో కొత్తగా సహకార లక్ష్మి సహకార సమృద్ధి స్కీమ్లు ద్వారా రూ100.00 కోట్ల డిపాజిట్లను సేకరించడం జరిగిందని ఈ పాలకవర్గము వచ్చిన వెంటనే గతములో ఉన్న క్రాప్ లోన్ గరిష్ట పరిమితి రూ 1.00 లక్ష ఉన్న దానిని రూ1.50 లక్షల వరకు పెంచుకోవడం జరిగిందన్నారు. అదే విధముగా గతంలో ఎన్నడు లేని విధముగా కొత్తగా రూ 100.00 కోట్ల పంట ఋణాలు నూతన సభ్యులకు ఇవ్వడం జరిగిందని. మొత్తంగా బ్యాంకు ద్వారా రైతులకు రూ 614.00 కోట్ల పంట ఋణాలు బట్వాడా చేయడం జరిగిందని తెలిపారు.బంగారు ఋణాల పరిమితిని మార్కెట్ పెరుగుదలను అనుసరించి ఎప్పటికప్పుడు పెంచుకోవడం వలన ఈ ఆర్థిక సంవత్సరంలో రూ328.35 కోట్ల నుండి రూ623.91 కోట్లకు పెంచుకోగా ఈ నికర పెరుగుదల ఈ సంవత్సరంలో రూ 295. 56 కోట్లు. సాధించగా 2024/25లో కొత్తగా గ్రామీణ పట్టణ ప్రాంతాలలో నూతన ఇంటి నిర్మాణా లు చేసుకొనే వారికి ఉన్న ఇంటిని మార్టిగేజ్ ద్వారా రూ 35.00 లక్షల వరకు భూమి తనపై ఋణ పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా గొర్రెలు, నాటు కోళ్ళ పెంపకానికి సబ్సిడి స్కీమ్ ఎన్. ఎల్. ఎమ్ను ప్రారంభించుకోవడం జరిగిందని పిఎసిఎస్ ల నుండి గోడౌన్ల నిర్మాణానికి వరల్డ్ లార్జ్ గ్రెయిన్ స్టోరేజ్ ప్రాజెక్ట్ పథకమును ప్రారంభించమని పేర్కొన్నారు. అదే విధంగా ప్యాక్స్ వారు ప్రొక్యూర్ చేసుకున్న వరి ధాన్యాన్ని నిల్వ ఉంచుకొనుటకు సబ్సిడీల క్రింద గోడౌన్‌లు నిర్మాణము వెసులుబాటును కల్పించవలసినదిగా ఎఫ్‌సిఐ కి సంబంధించిన సౌత్ ఇండియా ఇడి అయిన జజింత లాజారస్ ను చెన్నై లో కలిశామని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో నూతనముగా తిప్పర్తి, ఆత్మకూర్, గరిడేపల్లి, నారాయణపూర్,దామరచర్ల 5 కొత్త బ్రాంచీలకు ఆర్‌బిఐ పర్మిషన్ ఇవ్వడం జరిగిందని ఈ బ్రాంచీలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. మిర్యాలగూడ,శాలిగౌరారం,పెద్దవూర,మోతె,చిలుకూరు, నాంపల్లి మొత్తం 6 కొత్త బ్రాంచీల ఏర్పాటుకై పర్మిషన్ కొరకు ఆర్‌బిఐకి పంపడం జరిగిందని తెలిపారు. పాలకవర్గము సొసైటీల అభివృద్ధికి ఎంతో కట్టుబడి ఉన్నదని 2025/26 ఆర్థిక సంవత్సరంలో అతి త్వరలోనే మంచి లక్ష్యాలను ఏర్పా టు చేసుకొని గత ఆర్థిక సంము 2024/25 లో సాధించిన అభివృద్ధికి మించి రైతులకు ఖాతాదారులకు మంచి సేవలందిస్తూ మంచి పురోగతిని సాధించుటకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. సిఈవో శంకరరావు, జనరల్ మేనేజర్ నర్మదా, ఏజీఎంలు వెంకటేశ్వర్లు,కృష్ణలత, ఉదయశ్రీ,డిజిఎం ఉపేందర్, డైరెక్టర్లు సంపత్ రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

## యుద్ధ ప్రాతిపదికన చౌకధర దుకాణాల ఖాళీలు భర్తీ

### పారదర్శకంగా సన్నబియ్యం పంపిణీ : కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం /తిరుమలగిరి సాగర్: పారదర్శకంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె నాగార్జునసాగర్ నియోజకవర్గం, తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి తో కలిసి సన్న బియ్యం పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా చౌకధర దుకాణాలలో తూకం సరిగా ఉండేలా చూడాలని చెప్పారు. మండలంలో ఖాళీగా ఉన్న అన్ని చౌక ధర దుకాణాల ఖాళీలను యుద్ధ ప్రాతిపదికన భర్తీ చేయాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ను ఆదేశించారు.రేషన్ కార్డులు నిరంతర ప్రక్రియ అని , కొత్త రేషన్ కార్డులకు మీ సేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని, రేషన్ కార్డులో పేర్లను సైతం మీ సేవ కేంద్రాలద్వారా చేర్చుకోవచ్చని చెప్పారు. దర్తి ఆబా యోజన కింద గిరిజన గ్రామాలలో మౌలిక సదుపాయాలను కల్పించడం జరుగుతుందని, తిరుమలగిరి సాగర్లోని గిరిజన ప్రాంతాల్లో మౌలి క సదుపాయాలు కల్పిస్తామని కలెక్టర్ అన్నారు. స్థానిక శాసనసభ్యులు కుందూరు జైవీర్ రెడ్డి మాట్లాడుతూ సన్న బియ్యం పథకం చారిత్రక కార్యక్రమాన్ని అన్నారు. 40 ఏళ్లుగా దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వాలు పంపిణీ చేస్తున్నప్పటికీ వాటిని ఎవరు తినటం లేదని ,అవన్నీ రీసైక్లింగ్ అవుతున్నాయని, అలాంటిది తమ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేయడం సంతోషమన్నా రు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయ ణ అమిత్, తిరుమలగిరి సాగర్ స్పెషలాఫీసర్, ఏపీ డి శారద, గృహ నిర్మాణ శాఖ పి డి రాజ్ కుమా ర్,మాజీ జెడ్పిటిసి లింగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## సంక్షేమ బోర్డులో అవకతవకలు సరిదిద్దాలి : వెంకటేశ్వర్లు

ప్రజాపక్షం/డిండి: భవన నిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి) నల్గొండ జిల్లా 7వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం డిండి మండల భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం సిపిఐ కార్యాలయంలో బుసిపాక సాయిలు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నూనె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ చట్టం తీసుకురావాలని ఎఐటియుసి ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టం 1996లో ఏర్పడిందని, సంక్షేమ బోర్డులో కార్మికులకు అనేక అవకతవకలు ఉన్నాయని కార్మికులకు ఫలాలు అందడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికులకు 55 సంవత్సరాల వారికి నెలకు 5వేల పెన్షన్ ఇవ్వాలని, కాన్పుకు 50వేలు ఇవ్వాలని, సాధారణ మరణానికి 3లక్షలు, పెళ్ళికానుక లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. నల్గొండలో జరిగే జిల్లా 7వ మహాసభలకు మండల నుండి కార్మికులు అధిక సంఖ్యలో ప ఆల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బుసిపాక సాయిలు, దేవయ్య, లింగమయ్య, తిరుపతయ్య, రామస్వామి పాల్గొన్నారు.

## మహిళా సంఘాలతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, డిపిఎంలు, ఎపిఓలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపిఓ తార శ్రీనివాసరావు అకాల మరణం పట్ల రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. శ్రీనివాసరావు కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ఆర్‌జిఎస్, పెన్షన్ యూనిఫామ్స్, సెర్ప్‌కు సంబంధించిన పనులను వేగవంతం చేయాలన్నారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తుదారుల కోసం మున్సిపల్ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి సహకారం అందించాలన్నారు. జిల్లాలో 4549 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని ఎంపిడిఓలు, హౌజింగ్ అధికారులు సమన్వయంతో పని చేసి అర్హులైన వారికి మంజూరు జరిగేలా చూడాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా జరిగిన పనుల వివరాలు, మిగిలిన నిధుల నివేదికను అందించాలని ఆదేశించారు. 500 కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో సోలాల్ విద్యుత్ కోసం దరఖాస్తులు స్వీకరించాలన్నారు. స్కూల్ యూనిఫాం జాగ్రత్తగా కుట్టాలన్నారు. మహిళా స ంఘాలకు మాస్టర్ ట్రనీస్ ద్వారా ఎంబ్రాయిడరీ, నూతన స్టిచ్చింగ్ విధానాలు నేర్పించాలన్నారు. అదనపు కలెక్టర్ పి రాంబాబు, డిఆర్‌డిఏ పిడి వివి అప్పారావు, ఎంపిడిఓలు, డిపిఎంలు, ఐపిఎంలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మారుమూల ప్రాంతాల ప్రజలకు పోలీస్ శాఖ చేరువ : ఎస్‌పి

ప్రజాపక్షం/సూర్యాపేట: పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో గ్రామాల్లోని మారుమూల ప్రాంతాల ప్రజలకు పోలీస్ శాఖను చేరవ చేయాలని జిల్లా ఎస్పి కె నర్సింహ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పౌరుడు చట్టానికి లోబడి నడుచుకోవాలని, పోలీసులు మీ రక్షణ, భద్రత కోసం ఉన్నారని గ్రహించాలన్నారు. అవగాహన లేకుండా చట్టాన్ని ఉల్లంఘించి ఇతరులపై, ఇతురల ఆస్తులపై దాడులు చేయవద్దని తెలిపారు. సమాజంలో అవగాహన లోపంతో నేరాలకు పాల్పడితే జీవితాలను జైలుపాలు చేసుకోవద్దని వివరించారు. గ్రామాల్లో అలజడి వాతావరణం, సమస్యలు సృష్టించే వారిలో మార్పు తీసుకరావడం, సామమాజికంగా ఉన్న సమస్యలను గుర్తించి వాటిని నిర్మూలించడంతో శాంతియుత వాతావరణం నెలకోల్పడమే ప్రజా భరోసా కార్యక్రమమం ఉద్దేశమన్నారు. ప్రతి బుధవారం జిల్లా వ్యాప్తంగా సర్కిల్ పరిధిలో ఒక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్రామాన్ని ఎంచుకోని డిఎస్‌పి పై స్థాయి అధికారి అందుబాటులో ఉండేలా చూస్తూ పోలీసు ప్రజా భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

## ప్రభుత్వ భూముల్లో నివాస స్థలాలకు పట్టాలు ఇవ్వాలి



సిపిఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేత

ప్రజాపక్షం/యాదాద్రి : ప్రభుత్వ భూములు నివేషణ స్థలాలకు పట్టాలు ఇవ్వాలని శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి వ్యక్తిగత సహాయకులు పీఏకి సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం మెమోరాండం అందజేశారు. గత రెండు సంవత్సరాలుగా భువనగిరి పట్టణంలో ఇళ్ల స్థలాలు లేని 2000 మందికి హుస్సేనాబాద్ సర్వేనెంబర్ 107లో బొమ్మాయిపల్లి పట్టాలు పొందిన వారికి అలాగే హన్మాపురం సర్వేనెంబర్ 28లో 76 ఎకరాలు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేయించి ప్రతి కుటుంబానికి 100 గజాల చొప్పున తక్షణమే పట్టాలు ఇవ్వాలని స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో వారి వ్యక్తిగత సహాయకులు బోరెడ్డి సంతోష్ రెడ్డికి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని భువనగిరి పట్టణం ప్రసిద్ధిగాంచినదని అమరజీవి కామ్రేడ్ రావి నారాయణరెడ్డి ,ప్రముఖులు ఉన్న భువనగిరి కానీ చాలా వెనుకబడినది భువనగిరి పట్టణంలో వందలాది మంది అద్దె ఇళ్లలో కిరాయికి ఉంటూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. ఈ నెలాఖరులో కలెక్టర్ కార్యాలయం దగ్గర నిరసన ఆందోళన నిర్వహిస్తామని ప్రకటించినారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్ మాట్లాడుతూ భువనగిరి పట్టణంలో ఇండ్లు ఇంటి స్థలాలు లేవని జిల్లా స్థాయి ప్రభుత్వ అధికారులే సర్వే చేసి నిర్ధారణ చేసినారని వెంటనే ప్రభుత్వం నిర్ణయించిన వారందరికీ ఇంటి నివేషణస్థలాలతోపాటు దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దాసరి లక్ష్మ య్య, చొప్పరి సత్తయ్య, చింతల పెంటయ్య, బద్దం వెంకటరెడ్డి, షర్ఫుద్దీన్, ఎండి బాబా, ఎండి జహంగీర్, నాగపురి యాదగిరి, కూరాకుల అబ్బులు, ముదుగుల ఉప్పలయ్య, నజ్మా సుల్తానా, మరిపెల్లి ఇందిరా, బబ్బురి అంజమ్మ, కోట శంకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

## పురాతన కట్టడాలను పరిరక్షించాలి



ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లాలో పురాతన కట్టడాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాజ కుటుంబాలు (వారసులు) కొత్తబావిని పరిరక్షించాలని, పునరుద్దరించాలని గత రెండు నెలలుగా జరుగుతున్న పరిణామాలు తీవ్ర ఆందోళనలు కలిగిస్తున్నాయని గద్వాల పట్టణంలోని పురాతనమైన కొత్తబావిని, అన్ని కట్టడాలను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ ను గద్వాల సంస్థానాధీశులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంబి సంతోష్ సంస్థాధీశుల కుటుంబాలతో మాట్లాడుతూ పట్టణంలోని ఇతర బావుల్ని ఎలా సంరక్షించామో అదే మాదిరిగా కొత్త బావిని కూడా సంరక్షించి పర్యాటక కేంద్రంగా మారుస్తామని అన్ని విధాల అన్ని హంగులతో తిరిగి యదాస్థితికి వారం రోజుల్లో తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు. సంబంధిత వ్యక్తితో మాట్లాడటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాజ కుటుంబాల వారసులు విక్రమ సువాసినీ రెడ్డి, వెంకటకృష్ణరెడ్డి, వెంకటాద్రి రెడ్డి, విక్రమ్ సింహరెడ్డి, విలేకరులతో మాట్లాడుతూ రాజకుటుంబాలమైన మేము ఏనాడు రాజా వంశస్తులకు చెందిన ఆస్తులను కట్టడాలను ఏనాడో మా పెద్దలు వాటిని ప్రజల వరం చేశారని ఆ ఉద్దేశాన్ని లక్ష్యాన్ని తాము ఆటంక పరచలేదని అవి ప్రజలకు చెందాలని మేము భావిస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్ ఫోరం పురాతన కట్టడాల పరిరక్షణ సమితి అధ్యక్షులు మోహన్ రావు, అఖిలపక్ష కమిటీ జిల్లా అధ్యక్షుడు నాగర్‌దొడ్డి, వెంకటరాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, బిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య, సిపిఎం జిల్లా నాయకుడు నరసింహ, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు కేశవరెడ్డి, ప్రజా సంఘాల నాయకుడు సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకు



ప్రజాపక్షం/యాదాద్రి : బడుగు, బలహీన వర్గాలు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకు వెళ్ళాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బహుజన రాజ్యాన్ని స్థాపించిన మొట్ట మొదటి మహాయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. ఈ కార్యక్ర మంలో బీసీ సంక్షేమ అధికారి యాదయ్య, ఎస్సీ షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వసంత కుమారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, కుల సంఘ నాయకులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్

# కళారంగం

## క్యూబా జానపదాలకు రూపమిచ్చిన ఫ్యూన్టెస్



క్యూబా జానపద సంగీత చరిత్రను వెలికితీసి, ఎన్నో పుస్తకాలు రచించిన ఎడ్యుయార్డో సాంచెజ్ డి ఫ్యూన్టెస్ స్వయంగా స్వరకర్త కూడా. 1874, ఏప్రిల్ 3న హవానాలో జన్మించిన ఫ్యూన్టెస్, 1944, సెప్టెంబర్ 7న తుది శ్వాస విడిచాడు. కేవలం 16 సంవత్సరాల వయసులోనే అతను రాసిన 'హబనేరా టూ' సంచలనం సృష్టించింది. అతని స్వరపరచిన గీతాల్లో దీనికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఒపెరా 'యుమురి', ఒరేటోరియా 'నావిడాడ్', ఒరేటారియో 'నావిడాడ్', కాంటాటా 'అనకోలా' వంటి సుప్రసిద్ధ మ్యూజికల్ హిట్స్ ఆయన ఖాతాలోవే. అతని రచనలు, సంగీతం నిత్యనూతనం. నేటికీ క్యూబాలో ఎంతోమంది ఆయన రాసిన జానపద గీతాలను పాడుకుంటారు. సంగీతాన్ని ఆస్వాదిస్తారు. సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి అవసరమైన సమాచారం కూడా ఫ్యూన్టెస్ రచనల్లో ఉంటుంది. క్యూబాలో ఆఫ్రికన్ల ఆధిపత్యాన్ని తిప్పికొట్టాడని ఫ్యూన్టెస్‌ను కొంతమంది పొగడ్తలతో ముంచెత్తితే, వారి సహకారాన్ని తక్కువ చేసి చూపించాడని కొంతమంది విమర్శిస్తారు. ఈ విమర్శ అతను జీవించి ఉన్నప్పుడే వచ్చింది. అయితే, క్యూబా అసలు ఆదివాసీల సహకారాన్ని తీసుకున్నానని, ఇందులో ఇతరులను విస్మరించడం లేదా విమర్శించడం లేదని అతను పలు సందర్భాల్లో స్పష్టం చేశాడు. అతని మాటలు అక్షర సత్యాలని చరిత్రకారులు తర్వాతి కాలంలో నిర్ధారించారు. ఫ్యూన్టెస్ వెలికితీసిన ఎన్నో జానపద గీతాలు ఆయా కాలాల సామాజిక పరిస్థితులకు అద్దం పడుతున్నాయని కితాబునిచ్చారు. జానపద గీత రచయితగా, చరిత్రకారుడిగా, స్వరకర్తలు క్యూబా ప్రజల మనసుల్లో శాశ్వత ముద్ర వేసిన ఫ్యూన్టెస్‌ను అతని జయంతి సందర్భంగా గుర్తుచేసుకోవడం సంగీతాభిమానుల విధి.

## నటనకు నడకలు నేర్పిన రితుపర్ణ



ప్రముఖ రంగస్థల, సినీనటి రితుపర్ణ సేన్‌గుప్తా నటనా సామర్థ్యం గురించి కళాభిమానులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. జాతీయ అవార్డు గ్రహీత రితుపర్ణ నటనకు నడకలు నేర్పే రీతిలో ఆయా పాత్రల్లో జీవిస్తుంది. సాధారణ గృహిణి కావచ్చు... తల్లి కనుసన్నల్లో మెలిగే కుమార్తె కావచ్చు... పాత్ర ఏదైనా, ఆమె అందులో ఇమిడిపోతుంది. పద్మభూషణ్ అవార్డు గ్రహీత షర్మిలా ఠాగూర్ కుమార్తెగా రాబోయే బెంగాలీ చిత్రం 'పురాతన్'లో నటించిన రితుపర్ణ ఒక ఇంటర్వ్యూలో రంగస్థల అనుభవాలను ప్రస్తావించింది. షర్మిలా ఠాగూర్ వంటి మేటి నటీమణులతో పనిచేసిన ఆమె, తన ఆన్‌స్క్రీన్, ఆఫ్‌స్క్రీన్ ముచ్చట్లు పంచుకుంది. 'అమర్ ప్రేమ్' నటి షర్మిలా ఠాగూర్ తన ఆరు దశాబ్దాల కెరీర్‌లో వివిధ శైలులలోని దిగ్గజ దర్శకులతో తన గొప్ప షూటింగ్ అనుభవాల గురించి అప్పుడప్పుడు ఎలా పంచుకునేదో గుర్తుచేసుకుంది. విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రనిర్మాత సుమన్ ఘోష్ దర్శకత్వం వహించిన 'పురాతన్'లో ఆమెతో కలిసి నటించడం తన అదృష్టంగా పేర్కొంది. 'షర్మిలా ఠాగూర్ వివిధ శైలులను కలిగిన, భిన్నమైన కాలాల్లో పనిచేసింది. 'దేవి' నుండి 'కాశ్మీర్ కి కలి', 'ఆరాధన' వరకు, ఆమె ఎన్నో గొప్ప చిత్రాల్లో నటించింది. అలాంటి అరుదైన, అపారమైన అనుభవం ఉన్న నటికి కుమార్తెగా నటించడం నా అదృష్టం' అని 'దహన్' చిత్రానికిగాను జాతీయ అవార్డును గెల్చుకున్న రితుపర్ణ పేర్కొంది. 'పురాతన్'లో షర్మిలతో తన ఆన్‌స్క్రీన్ కెమిస్ట్రీ గురించి మాట్లాడుతూ, 'ఈ కథ తల్లి మరియు కుమార్తె (మామేయర్ దారున్ సంపర్కో) మధ్య లోతైన, భావోద్వేగ బంధం చుట్టూ తిరుగుతుంది. అనుభవజ్ఞురాలైన తల్లి పాత్ర ఆలోచనలన్నీ పాత కలలు, పూర్వీకుల ఇంటిలో పాతుకుపోతాయి. అయితే కుమార్తె కార్పొరేట్ ప్రపంచంలో ఎదగాలని కోరుకుంటుంది. దీనితో గతం, వర్తమానం మధ్య ఘర్షణ మొదలై, సందిగ్ధతకు దారితీస్తుంది' అని వివరించింది. దర్శకుడు అందంగా అభివృద్ధి చేసిన ఒక ప్రత్యేకమైన కెమిస్ట్రీ ఉందని, ఇది తల్లీకుమార్తె మధ్య ఉండే అనురాగం, సంబంధం, షరతులు లేని స్వచ్ఛమైన ప్రేమను చిత్రీకరిస్తుందని వివరించింది. ఈ చిత్రం భార్యాభర్తల సంబంధ గతిశీలతను కూడా అన్వేషిస్తుంది కాబట్టి, ఆయా సంబంధాల ఆధారిత చిత్రంగా వర్ణించవచ్చని రితుపర్ణ వివరించింది. తల్లీ కూతురు బంధాన్ని ఉద్వేగభరితంగా, భావోద్వేగంగా, ఉద్వేగభరితంగా చిత్రీకరించారని వివరించింది. షర్మిలా ఠాగూర్‌కు తల్లిపాత్రలో నటించడం కొత్తకాదు.. భావాలను పండించడంలో ఆమెకు తిరుగులేదు. అలాంటి గొప్ప కళాకారిణితో కలిసి మరో గొప్పనటి రితుపర్ణ నటించడం ప్రేక్షకులకు గొప్ప అనుభూతినిస్తుంది. రితుపర్ణ నటిగానేగాక, ఆ చిత్ర నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నది. అసాధారణ ప్రతిభను సొంతం చేసుకొని, సహజ నటిగా పేరు సంపాదించిన ఆమె, రంగస్థల, సినీ రంగాల్లో రాణిస్తున్నది. ఆమె నుంచి దేశం గర్వించతగ్గ చిత్రాలు రావాలని కోరుకుందాం.

## వాయిద్యాల్లో రారాజు పియానో!





అన్ని సంగీత వాయిద్యాల్లో రారాజుగా పియానోకు పేరుంది. అన్ని వయస్సుల పినానో ప్రేమికులు, పియానో అభిమానుల ముందు పబ్లిక్ ప్రదేశాల్లో ఈ రోజున పియానో వాయించడం ఒక ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. 2015లో నిల్స్ ఫ్రామ్ చొరవతో ప్రపంచ పియానో దినం పాటించడం ప్రారంభమైంది. 1700 సంవత్సరంలో బార్టోలోమియో క్రిస్టోఫోరీ కనుగొన్న పియానో కాలక్రమం తన ఆకారాన్ని మార్చుకుంటూ నేడు ఈ రూపంలోకి వచ్చింది. ఆనందం, వినోదం పంచడానికి పియానో వాయిద్యం వినియోగపడుతున్నది. పియానో వాయించడం లేదా పియానో వినడం వలన జ్ఞాపకశక్తి పెరగడం, చేతులునేత్రాల మధ్య సమన్వయం మెరుగుపడడం, మానసిక ఆందోళన లేదా ఉద్రేకం తగ్గడం జరుగుతుంది. పియానో వాయిద్యానికి తోడుగా సంపోజర్స్, పెర్ఫామర్స్, పియానో ప్రేమికులు, ట్యూనర్స్, బిల్డర్స్ సమన్వయంతో సంగీత విభావరి ఆద్యంతం ఆకట్టుకుంటుంది.

## మాతృమూర్తికి అంకితం.. ఛతీ నృత్యం

ఛతీ పండుగ సందర్భంగా ప్రదర్శించే నృత్యానికి ఛతీ నృత్యం అని పేరు స్థిరపడింది.ఈఛతీ ఒక ప్రత్యేక మైన నృత్యం. ఛతీ నృత్యం అనేది ఒక కొత్త జీవితం/జీవి కుటుంబం లోకి వచ్చిన సంతోషం వ్యక్తీకరణ పండుగ. పుట్టుకను శుభ సూచికగా భావిస్తారు. ప్రసవం తరువాత భగవంతుని కృప ఆశీర్వాదం కోరుతూ చెసే నృత్యం.



మహిళలు తలపై మట్టి కుండలను పెట్టుకుని,అవి కింద పడకుండా సమతులనం పాటిస్తూ, పాటలు పాడుతూ, నృత్యం చేస్తారు. ఈనృత్యం మాతృ ఆనందంను తెలియ చెసే విశిష్టమైన గుణం కలిగి ఉంటుంది. సమాజంలో తల్లి ప్రాముఖ్యతను సంస్కృతి పరంగా తెలియచెసే ప్రక్రియ ఈ ఛతీ నృత్యం. భారతదేశంలోని అనేక ప్రదేశాలలో, నవజాత శిశువు పుట్టుకను ఆనందంగా జరుపుకుంటారు. ఛతీ నృత్యం కూడా అలాంటి ఒక ఆచార నృత్యమే. అదే సందర్భంలో ప్రదర్శిస్తారు. కానీ, మగబిడ్డ పుట్టినప్పుడు మాత్రమే ఈ నృత్యం చేస్తారు. మహిళలు పుట్టిన ఆరవ రోజున ఈ నృత్యం చేస్తారు. ఇది శృంగార నృత్యం, రాత్రి సమయంలో ప్రదర్శించబడుతుంది. వేడుక ముగింపులో, ప్రదర్శనకు హాజరైన సభ్యులందరికీ ఉడికించిన గోధుమలు, చానా పంపిణీ చేస్తారు.

## సామాజిక ధోరణులే కళాప్రదర్శనల భావనలు!



సమాజాన్ని, కళలను వేరువేరుగా చూడలేం. అభూత కల్పనలు, అతిశయోక్తి కథాంశాలు ఎప్పుడూ సామాజిక అంశాల స్థాయిలో ప్రజలను ప్రభావితం చేయవు. సామాజిక ధోరణులను ప్రదర్శించవు. సమకాలీన సమాజాన్ని చూడాలన్నా, గత సమాజ పోకడలను అర్థం చేసుకోవాలన్నా కళారూపాలను మించిన ఉత్తమ మాధ్యమం మరొకటి లేదు. నాట్యం లేదా నాటకం.. చిత్రం లేదా శిల్పం.. రూపం ఏదైనా, సామాజిక ధోరణులే కళాప్రదర్శనల భావనలవుతాయి. వాటినే ప్రతిబింబిస్తాయి. వీటిలో ప్రదర్శన కళలకు విస్తారమైన ఆదరణ ఉంది. ప్రదర్శన కళ అనేది కళాకారుడు లేదా అందులో పాల్గొనే వారు తమ నటన లేదా నాట్యం లేదా సంగీతం లేదా ఇతర మాధ్యమాల ద్వారా సృష్టించే కళా కృతి లేదా ప్రదర్శన. దీనిని ప్రత్యక్షంగా లేదా డాక్యుమెంటేషన్ ద్వారా చూడవచ్చు. కొన్ని ప్రదర్శనలను ఆకస్మితకంగా అభివృద్ధి చేస్తారు. అంటే, అప్పటికప్పుడు, సమయానుకూలమైన వస్తువును తీసుకొని, దాటి చుట్టూ ప్రదర్శనను అల్లుకుంటారు. సాంప్రదాయకంగా కళా ప్రదర్శనలను ప్రజల సమక్షంలో నిర్వహిస్తారు. అందుకే, దీనిని కళాత్మక చర్య అని కూడా పిలుస్తారు. సంవత్సరాల తరబడి కళను ప్రత్యక్షంగా ప్రదర్శించడం ద్వారా, కొన్ని కథాంశాలు లేదా ప్రదర్శనలు తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటాయి. ప్రదర్శనలకు ప్రధానంగా, సమయం, స్థలం, కథాంశం, కళాకారుడి ఉనికి, కళాకారుడుకి ప్రజలకు మధ్య ఉన్న సంబంబంధం అనే ఐదు ప్రధాన అంశాలు ఉంటాయి. ఆర్ట్ గ్యాలరీలు, ఎగ్జిబిషన్లను ఎప్పుడైనా, ఎక్కడైనా నిర్వహించవచ్చు. ప్రతిచర్యలను సృష్టించడం, కొన్ని సందర్భాల్లో మెరుగుదలను ప్రేరేపించడం ఈ ప్రదర్శనల లక్ష్యం. అయితే, కళాకారులు ప్రత్యక్షంగా ప్రదర్శించే కళాకృతులకు ఒక స్పష్టమైన ప్రదేశం లేదా ప్రాంతం అవసరం. సమయం కూడా చాలా కీలకం. కళాకారుడి జీవితానుభవాలే అత్యధిక శాతం కళా ప్రదర్శనల్లో కనిపిస్తాయి. సామాజిక రుగ్మతలను ప్రస్తావించడం, ఎండగట్టడం, మార్పును కోరుకోవడం, మార్పును తెచ్చే మార్గాలను వివరించడం వంటి అనేకానేక బాధ్యతలను కళా ప్రదర్శనలు స్వీకరిస్తాయి. అందుకే, వాటికి అంతటి ప్రాధాన్యం. కొన్ని శతాబ్దాలుగా కళా ప్రదర్శనలు ప్రజల మన్నన పొందుతునే ఉన్నాయి. సమాజానికి అద్దం పడుతునే ఉన్నాయి. ప్రజల పక్షాన నిలుస్తున్నాయి.



## క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు మహాసభలు

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/ఇల్లందు:** క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకే శాఖ మహాసభలు నిర్వహించుకుంటున్నామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని నెంబర్ 2 బస్తి ఆరో వార్డులో బుధవారం జరిగిన మహాసభలో సాబీర్ పాషా మాట్లాడుతూ ఇల్లందు ప్రాంతంలో ఎన్ని కష్టనష్టాలు వచ్చినా కమ్యూనిస్టు పార్టీని ఎర్రజెండాని వీడకుండా నమ్మిన సిద్దాంతం కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఇల్లందు కమ్యూనిస్టు శ్రేణులకు జిల్లా పార్టీ విప్లవ జేజేలు పలుకుతుందని అన్నారు. కమ్యూనిస్టులు తర తమ భేదం లేకుండా నిస్వార్ధంగా ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడతారనేటువంటి భావన ప్రజల్లో ఉంది కనుకనే సిపిఐ పార్టీ అభ్యర్ధిగా ప్రజల మనిషి ప్రజానాయకుడు కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం నుండి గెలిచి అసెంబ్లీలో మాట్లాడుతున్నటువంటి తీరు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య, యూనియన్ వైస్ ప్రెసిడెంట్ రాజారామ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాస శ్రీనివాసరావు, మండల సహాయ కార్యదర్శి వల్ల శ్రీను, ఆవర వార్డు శాఖ కార్యదర్శి వల్లాల రాజమౌళి, ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హరీష్, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుల గికురు వెంకన్న, షేక్ వలి, కొమరయ్య, అంజయ్య, దొంతర బోయిన రాము, కాశ బోయిన నగేష్, ఈర్ల శివుడు, ధర్మేందర్ మోహన్, సాయి, బంధం లక్ష్మీ, రాజేశ్వరి, నీల, మల్లేశ్వరి, సరిత, లక్ష్మీ, శాఖ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు చలో సెక్రటేరియట్

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** పట్టణ కేంద్రంలో ఎఐఎస్ఎఫ్ సమావేశం శేషగిరి భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.ఫహీమ్ దాదా మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సంబంధించిన 400 ఎకరాల భూమి వేలాన్ని నిలిపివేయాలని ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం జరిగే చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు భవిష్యత్తులో ప్రయోగశాలలకు అవసరమైన భూములు చేజారిపోతే భవిష్యత్ తరాల విద్యార్థులకు యూనివర్సిటీ ఉనికికి ప్రమాదమని న్యాయబద్ధంగా భూముల రక్షణ కోసం పోరాటాన్ని కొనసాగిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల గొంతు నొక్కి అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల అరెస్టును ఎఐఎస్ఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని విరమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అజీత్, సృజన్, వంశీ, రణదీర్, వినయ్, గిరిప్రసాద్, నాగరాజు వెంకట్, విజయ్ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, రాజ్యాంగ రక్షణకు పోరాడుదాం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు, రాజ్యాంగ రక్షణకు పోరాటాలు చేయాలని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో మెట్టు శ్యాంసుందర్ రెడ్డి అధ్యక్షతన హనుమకొండ జిల్లా సిపిఐ మహాసభల ఆహ్వాన సంఘ ఏర్పాటు సభకు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం ఇడి, సిబిఐని వాడుకుంటూ ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేస్తూ రాజ్యాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నరన్నారు. ప్రాంతీయ పార్టీలు, ప్రతిపక్ష పార్టీలపై సిబిఐ, ఇడిని వాడుకొని భయపెడుతూ మైనార్టీ ప్రభుత్వాలను మెజార్టీగా మార్చుకుంటున్న చరిత్ర బిజెపిది అన్నారు. మోడీ హయాంలో మైనార్టీలపై, దళితులపై దాడులు పెరిగాయన్నారు. చత్తీస్‌గడ్‌లో ఆపరేషన్ కగార్ పేరుతో నరమేధం జరుగుతున్నదన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో మహిళలను, గిరిజనులను, అమాయకులను చంపడం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు మోతె లింగారెడ్డి, నేదునూరి రాజమౌళి, కర్రె లక్ష్మణ్, మునిగాల బిక్షపతి, మహిళా సమాఖ్య హనుమకొండ జిల్లా కార్యదర్శి మంచాల రమాదేవి, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కు రాజుగౌడ్, వేల్పుల సారంగపాణి, నాయకులు నకిర్తి ఓదెలు, సుదర్శన్, ఏదునూరి వెంకట్రాజం, షేక్ బాబు, రేణిగుంట్ల దుర్గాప్రసాద్, దొమ్మాటి ప్రవీణ్ కుమార్, రాజయ్య, నేదునూరి సాంబయ్య, రేణిగుంట్ల వంశీ, వడ్లూరి సుధాకర్, గిన్నారపు రాజు, పస్కుల భరత్ తదితరులు పాల్గొన్నారు.

**మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు...**మే 26, 27 తేదీలలో హసన్ పర్తి లో సిపిఐ జిల్లా మహాసభలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. మహాసభల ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా మోతే లింగారెడ్డి, అధ్యక్షుడిగా నేదునూరి రాజమౌళి, ప్రధాన కార్యదర్శిగా నేదునూరి జ్యోతి, చీప్ పాట్రన్‌లుగా ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి తో పాటు 25 మంది సభ్యులతో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు.

## హెచ్‌సియు భూముల స్వాధీనం ఆపాలి

విద్యార్థులపై నిర్బంధం దుర్మార్గ చర్య

ఖమ్మంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సియు) భూముల స్వాధీనాన్ని ఆపాలని, విశ్వవిద్యాలయంలో దౌర్జన్య పూరిత వాతావరణాన్ని సృష్టించడం అప్రజాస్వామిక చర్య అని విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. విద్యార్థులపై నిర్బంధం, లాఠీచార్జిలను నిరసిస్తూ ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, జార్జిరెడ్డి పిడిఎస్‌యు, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. యూనివర్సిటీ అనుబంధ పిజి కళాశాల నుంచి ఇల్లందు క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి మస్తాన్, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు మంద నరేష్‌లు మాట్లాడుతూ విశ్వ విద్యాలయాల్లో విద్యార్థులపై నిర్బంధాన్ని ప్రయోగించడం, పోలీస్ బలగాలతో నిర్బంధించడం దుర్మార్గపు చర్య అన్నారు. భూములు స్వాధీనం చేసుకోవాలనే ఆలోచనను విరమించుకుని విశ్వ విద్యాలయంలో ప్రజాస్వామ్య వాతావరణం కల్పించాలని, విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు సుధాకర్, శివ, మనోజ్‌రాజ్, అజయ్, సాగర్, భాను, సాయి, వినోద్, ప్రతాప్, గణేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.



## ఊర్కొండపేట నిందితులను కఠినంగా శిక్షించాలి

మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ పేటలో ఓమహిళపై అత్యంత కిరాతకంగా, రాక్షసంగా గ్యాంగ్ రేప్ పాల్పడిన తొమ్మిది మంది కామాంధులను కఠినంగా శిక్షించాలని మహిళా సమాఖ్య(ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి కొండికంటి పద్మావతి ప్రభుత్వాన్ని డిమండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ ఊర్కొండ పేటలో జరిగిన సామూహిక అత్యాచారం సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయంగా ఆలయ ఉద్యోగి దారుణానికి పాల్పడడం అత్యంత బాధాకరమన్నారు. ఇలాంటి కిరాతకులను ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని, ఈ ఘటనలో ఎవరెవరికి సంబంధం ఉందో విచారించి ఏ ఒక్కరిని కూడా వదలొద్దని కోరారు. బాధిత మహిళలకు సత్వరం న్యాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా నాయకులు మాధవి, సత్యమ్మ, సింధు, లక్ష్మి కళ, వరలక్ష్మీ, పద్మ, జ్యోతి, మణెమ్మ, అనన్య తదితరులు పాల్గొన్నారు.




## భవన నిర్మాణ కార్మికులకు రూ.5వేలు పెన్షన్

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఉజ్జిని రత్నాకర్‌రావు




**ప్రజాపక్షం/చండూరు :** భవన నిర్మాణ రంగంలో పనిచేస్తూ 50 సంవత్సరాలు దాటిన కార్మికులకు నెలకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలని ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఉజ్జిని రత్నాకర్ రావు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం చండూరులో జరిగిన భవన నిర్మాణ కార్మిక సంఘం మండల 5వ మహాసభలో ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న సంక్షేమ బోర్డు ఈ రోజు సమస్యల నిలయంగా మారిందని ఆరోపించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎఐటియుసి నిరంతరం అండగా నిలిచి పోరాడుతుందన్నారు. గత కొన్ని నెలలుగా కార్మికులకు డబ్బులు ఇవ్వడం లేదని ఆన్‌లైన్‌లో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిష్కరించడంలో లేబర్ డిపార్ట్‌మెంట్ వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఆన్‌లైన్ అప్‌డేట్ పేరుతో కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ అప్‌డేట్‌కు కార్మికులు రోజుల తరబడి లేబర్ కార్యాలయం చుట్టూ తిగాల్సివస్తుందన్నారు. అన్‌లైన్ అఫ్‌డేట్ పేరుతో గత ఆరు నెలలుగా కార్మికులను ఆఫీస్ చుట్టు తిప్పుకుంటూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కార్మిక సంక్షేమ బోర్డులో జమ కావాల్సిన సెస్సు సక్రమంగా వసూలు చేయకపోవడం వల్ల కార్మిక సంక్షేమ నిధులు పెరగడం లేదన్నారు . సంక్షేమ బోర్డులో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మెడికల్ చెకప్‌ల పేరుతో జరుగుతున్న ఆర్థిక దోపిడీపై సమగ్ర విచారణ జరిపించాలని ఆయన కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మిక చట్టాల వలన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంక్షే బోర్డును ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆరోపించారు. దాని రక్షించుకోవలసిన బాధ్యత కార్మికులపై ఉందన్నారు. కార్మిక వ్యతిరేక విధాలు తిప్పికొట్టేందుకు పోరాటాలు తీవ్రతరం చేయాలని రత్నాకర్ రావు కార్మికలోకానికి పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ నిర్మాణ రంగంలో నిజమైన కార్మికులు లబ్ధి పొదే విధంగా లేబర్ డిపార్ట్‌మెంట్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బోగస్ కార్డులు విచారణ చేసి రద్దు చేయాలని కోరారు. ఈనెల 12న నల్లగొండలో జరిగే జిల్లా 12వ మహాసభ ను జయప్రదం చేయాలని కోరారు. మహాసభ లో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎన్.రామలింగయ్య, ఎఐటియుసి జిల్లా మాజీ అధ్యక్షుడు నల్పరాజు సతీష్ కుమార్, ఎఐటియుసి జిల్లా మాజీ సహాయ కార్యదర్శి దోటి వెంకన్న, బరిగెల వెంకటేశ్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు భూతరాజు శ్రీను, జెల్లా శ్రీను, ఆలేటి జగన్, బల్సుల సైదులు, ఎ.లింగయ్య, పి.రామాంజనేయులు, జి.యాదయ్య, పి.శ్రీను, ఎం.వెంకటేశం, నాగరాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## వీధి నాటకాలను ప్రోత్సహించాలి : శరత్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/పరిగి :** వీధి నాటకాలను ప్రోత్సహించాలని కెవిఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో అంతరించి పోతున్న వీధి నాటకాలకు కళా కారులు జీవం పోస్తున్నారని తెలిపారు. దోమ మండల పరిధిలోని ఊట్టుపల్లి గ్రామంలో అంజ నేయ స్వామి భజన బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నా శ్రీ మల్లికార్జున స్వామి మహత్యం అనే వీధి నాటకానికి హాజరయ్యారు. గ్రామాల్లో నాటకాలు ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బొంగు మల్లేశం , గోవర్ధన్ , నర్సింలు , మణికంఠ ,ఎల్లయ్య , సత్యనారా యణ, అనంతయ్య , జగన్ , గోపాల్ , శివయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.




## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/అల్వాల్ :** వెంకటాపురం డివిజన్ సుభాష్ నగర్ లో వేసవిని దృష్టిలో పెట్టుకుని చలివేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ సబితా అనిల్ కిషోర్ గౌడ్ తో కలిసి మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చల్లటి త్రాగునీటిని అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఎంబిసి కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్, స్థానిక నాయకులు అనిల్ కిషోర్ గౌడ్, డోలి రమేష్, సయ్యద్ మోసిన్, శ్రీనివాస్, సంపత్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



## 'ప్రశ్నించే గొంతులో పాలకుల అణచివేత'సభను విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/అల్వాల్ :** వెంకటాపురం డివిజన్ యాదమ్మ నగర్ కు గద్దర్ కు విడదీయరాని బంధం ఉందని గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి జీవి సూర్యకిరణ్ చెప్పారు. ఏప్రిల్ 6న ప్రజా యుద్ధనౌక గద్దర్ పై మీద కాల్పులు జరిపిన రోజు అందుకు నిరసనగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ప్రశ్నించే గొంతులో పాలకుల అణచివేత అనే అంశం పైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సభను విజయవంతం చేయడానికి పాలమూరు యాదమ్మ నగర వాసులు అందరూ పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.



## క్రికెట్ టికెట్లు బ్లాక్‌లో విక్రయాలపై యూత్ కాంగ్రెస్ ధర్నా

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో క్రికెట్ టికెట్లు బ్లాక్‌లో విక్రయాలకు పాల్పడుతున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. యూత్ కాంగ్రెస్ నేత ఆకారపు అరుణ్ పటేల్ నేతృత్వంలో బుధవారం స్టేడియం ఎదుట యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరి టికెట్లు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలంటూ నినదదిస్తూ ధర్నా చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి కాలంలో జరిగిన క్రికెట్ క్రీడలకు సంబంధించి టికెట్లను హెచ్‌సిఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, ఓ ప్రయివేట్ కళాశాల యాజమాన్యంతో కుమ్మక్కై టికెట్లను భారీగా బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించారని ఆరోపిస్తూ జగన్‌మోహన్‌రావుపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.




## రాజ్యాంగాన్ని అవమానిస్తున్న బిజెపి
### కొలను హన్మంత రెడ్డి

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** అప్రజాస్వామిక నిర్ణయాలతో రాజ్యాంగాన్ని అవమానిస్తున్న బిజెపి పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నా రు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 7, 8, 9 డివిజన్‌లలో ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యం లో జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ ఉజ్మా షాకీర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డిలు విచ్చేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పలు వీధులలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జై బాబు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, దేశ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు, దేశ అభివృద్ధి కోసం చేసిన కృషిని ప్రజలకు వివరించడమే కార్యక్రమం ముఖ్యఉద్దేశ్యమని అన్నారు. దేశం లో బిజెపి ప్రభుత్వం ఏ విధంగా రాజ్యాంగాన్ని అవమానిస్తూ కించపరుస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తుందని, అప్రజాస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించడం జరుగుతుందని తెలిపా రు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ ఆదేశాలను అమలు చేయాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గిస్తూ ప్రజ ల సమస్యలు తెలుసుకోవడానికి కాంగ్రెస్ చేసిన పనులను ప్రజలకు వివరించాలని అన్నారు. రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో నిజాంపేట్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ సత్తాను చాటుతామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ వడ్ల నాగేశ్ చారి, మాజీ కార్పొరేట ర్ చిట్ల దివాకర్, నాయకులు కొలను జీవన్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, కుమార్ యాద వ్, ఇందిర, మదుసూదన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ అధికారుల తీరుతో
## ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం





**ప్రజాపక్షం/దుండిగల్ :** అవినీతి అధికారుల పనితీరుతో, కాంగ్రెస్ ప్రభుత్వం కొంతమంది రెవిన్యూ అధికారుల పని తీరు వలన అప్రతిష్టపాలవుతుంది. పాలనలో ప్రభుత్వం పలు పాత జి.ఓ లను రద్దు చేస్తూ నిర్మాణాలు నై అన్నా అవినీతి అధికారులు మాత్రం లేదు సై సై అంటూ కాసులకు కక్కుర్తి పడి అక్రమ నిర్మాణాలకు ఆజ్యం పోస్తున్న ఘటన దుండిగల్ మండలంలో వెలుగులోకి వచ్చింది. దుండిగల్ మండల రెవిన్యూ కార్యాలయం పరిధిలోని సర్వే నెంబర్ 120 ప్రభుత్వ స్థలంలో పాత జీవో 58, 59 పేరుతో అక్రమ నిర్మాణా లు ఊపందుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర నూతన ప్రభుత్వం 58, 59 జి.ఓ లు ఇక చెల్లవని మార్గదర్శకాలు జారీ చేసిన, అక్రమ నిర్మాణదారులు మాత్రం పాత జి.ఓలను అడ్డం పెట్టుకొని ఇప్పుడు కొత్తగా నిర్మాణాలు చేపడుతూ వ్యాపారం సాగిస్తున్నారు. వీటికి అడ్డు కట్ట వెయ్యవలసిన రెవిన్యూ అధికారులు ఆమ్యామ్యలకు అలవాటుపడి నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు ఒక్కో రేటు అధికారులు కుదుర్చుకొని అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలుకుతున్నారు.విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉంటూ అక్రమదారుల ను కూల్చివేయ్యాల్సిన రెవిన్యూ అధికారులు అమ్ముడుపోయి చర్యలకు వెనుకాడడంతో దుండిగల్ మండలంలో ప్రభుత్వ స్థలాలు అంగడి ఫలహారాలు అవుతున్నాయి.

సర్వే నంబర్ 120/23 దర్గా వెనకాల 50లక్షల విలువచేసే 200 గజాల స్థలా న్ని అధికార పార్టీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకుడు చెరబట్టి స్లాబుతో నిర్మాణం చేపడుతున్నారు. వీటిపై అదే కాలనీకి చెందిన పలువురు పదేపదే ఫిర్యాదు చేసినా తహసీల్దార్ పట్టించుకోరు. కాసులకు కక్కుర్తి పడుతున్న రెవెన్యూ ఇన్ స్పెక్టర్ సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిఆర్ఎస్ భవన్ వెనక ప్రభు త్వ స్థలంలో 58 జిఒ పేరుతో అక్రమనిర్మాణాలు సాగిస్తు న్న తీరు పలు విమర్శలకు తావిస్తుంది. పాత జిఒ లను అడ్డంపెట్టుకొని అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అక్రమ నిర్మాణాలపై ఆర్డిఓ సీరియస్**
గండిమైసమ్మ 120 సర్వే నెంబర్ ప్రభు త్వ భూమిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై మల్కాజ్గిరి ఆర్.డి.ఓ శ్యాం ప్రకాష్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులపై సీరియస్ అయినట్లు సమాచారం. అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోమని ఆర్డీఓ ఆదేశించడంతో ఉలిక్కిపడ్డ అక్రమ నిర్మాణదారులు లంచాలిచ్చిన అధికారుల వద్దకు పరుగులు పెట్టారు. ఎవరై నా అడిగితే పాత జిఒ కాపీలు చూపించండి మేము అన్ని సరిగ్గా ఉన్నాయని చెబుతామంటూ అధికారులే సలహాలుఇస్తున్నట్టు సమాచారం. ఆర్డిఒ పర్యటించిన అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి.



### సన్నబియ్యం పంపిణీతో
## కడుపునిండా పేదలకు భోజనం
### స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :**వికారాబాద్ నియోజకవర్గంలోని ధారూర్ మండల పరిధిలోని కెరెల్లి గ్రామంలో ,వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని పాతగంజ్‌లో చౌక ధరుల దుకాణం వద్ద తెల్ల రేషన్ కార్డు లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి ప్రసాద్ కుమార్ అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో 94 కళ్యాణలక్ష్మి షాదిముబారక్ చెక్కులను, 9సిఎంఆర్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుంది అన్నారు. సన్న బియ్యం పంపిణీతో పేదలు తృప్తిగా అన్నం తింటారు, ప్రతి వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున అందజేశాస్తామని అన్నారు. త్వరలో అందరికి రేషన్ కార్డులు అందజేయడం జరుగుతుంది అని తెలిపారు. సన్నరకం వరికి రూ.500ల బోనస్ ఇవ్వడం జరుగుతుంది అని అన్నారు. తెలంగాణ నుండి ఇతర దేశాలకు బియ్యం ఎగుమతితో ఇక్కడి రైతుల వద్లకు మంచి ధర లభిస్తుంది అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వం రైతుల అభివృద్ధి,పేదల సంక్షేమం కోసం కృషి చేస్తుంది. బడ్జెట్లో వ్యవసాయం, సంక్షేమ రంగాలకు అధిక నిధులను కేటాయించారు. మన బాగుకోసం మన పిల్లల భవిష్యత్తు కోసం కష్టపడుతున్న ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్‌డిఓ వాసుచంద్ర, కాంగ్రెస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యేక బస్ స్టేషన్ల ఏర్పాటుకు సిపిఐ డిమాండ్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ఉప్పల్ చౌరాస్తాలో తీవ్ర రద్దీకి కారణమవుతున్న ఆర్టీసీ సిటి, జిల్లా బస్సులకు రోడ్డుపై కాకుండా మరో చోట ప్రత్యేకంగా బస్‌స్టేషన్‌లను ఏర్పాటు చేయాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఈ విషయమై ఉప్పల్ ట్రాఫిక్ జోన్1 డిసిపి మల్లారెడ్డిని సిపిఐ బృందం బుధవారం కల్సి వినతిపత్రం సమర్పించారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్, సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ కార్యదర్శి జి.దామోదర్‌రెడ్డిలు మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా ఉప్పల్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ నుండి జిహెచ్‌ఎంసి కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఉప్పల్ చౌరాస్తా వరకు రేయింబవళ్లు వరంగల్ వైపు వెళ్లే వందలాది ఆర్టీసీ డిస్ట్రిక్ బస్సులు, ఇదే ప్రాంతంలో ఘట్‌కేసర్, ఎల్‌బి నగర్, కోఠి వైపు వెళ్లే ఆర్టీసీ సిటి, సబర్బన్ బస్సులు ప్రయాణీకుల రాకపోకలకు గాను రోడ్డు పక్కనే ఆగుతుంటాయన్నారు. ఈ బస్సుల్లో రాకపోకలు చేసే ప్రయాణీకులు ప్రతి రోజు వేలాది మంది ప్రయాణించటం, ఒకే సారి వందల సంఖ్యలో బస్సుల కోసం వేచి చూస్తుండటం, ఇదే ప్రాంతంలో యూ టర్న్ చేసుకొనే ప్రాంతం ఉండటం వల్ల తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ కారణంగా ఈ ప్రాంతంలో పలు సార్లు చోటు చేసుకొన్న రోడ్డు ప్రమాదాల్లో పలువురు క్షతగాత్రులవ్వటమే కాక ప్రాణాలు సైతం కోల్పోయారని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి గాను ఆర్టీసీ డిస్ట్రిక్, సిటీ బస్సు సర్వీసులు ప్రయాణీకుల రాక పోకలకు గాను ఆగేందుకు ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, దీనికోసం సమీపంలోనే ఉన్న ప్రభుత్వ రంగ సంస్థ సర్వే ఆఫ్ ఇండియా స్థలం అనుకూలంగా ఉంటుందని సూచించారు. తీవ్ర సమస్యగా ఉన్న దీని శాశ్వత పరిష్కారం కోసం సిపిఐ ఇకపై రాజకీయ పోరాటం చేస్తుందని వారు స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్, సిపిఐ ఉప్పల్ మండల కార్యవర్గ సభ్యులు జంగా రెడ్డి,రాజేంద్రప్రసాద్, సబ్బు, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.



## స్వామి సల్లంగ చూడవయ్యా...
### శ్రీవారి సన్నిధిలో సిఎం రేవంత్ కూతురు

**ప్రజాపక్షం / కొడంగల్ :** పేదల తిరుపతిగా పేరుగాంచి భక్తులకు కొంగుబంగారంగా నిలిస్తున్నా కొడంగల్ శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి 45వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదవరోజు శ్రీవారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. 9 రోజుల పాటు వైఖనసాగమ శాస్త్ర ప్రకారంగా అత్యంత వైభోపేతంగా సాగే ఈ బ్రహ్మోత్సవాలలో 29వ తేదిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించడం జరిగింది. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం స్వామి వారి రథోత్సవాన్ని పురస్కరించుకుని రేవంత్‌రెడ్డి కూతురు నైనిశరెడ్డి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీనివాసుడు భక్తుల మనోరథాలను అధిరోహించి తీరువీధులలో వైభవంగా కోలాటాలతో రథోత్సవంలో పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డి కూతురు దంపతులకు ఆలయ ధర్మకర్తలు, పూజారులు ఘనస్వాగతం పలికి వేద ఆశీర్వచనంతో తీర్థప్రసాదాలను అందించారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులున్నారు.

### రాజీవ్ యువ వికాసం పథకం అమలులో
## అప్రమత్తంగా ఉండి విజయవంతం చేయాలి
### కలెక్టర్ ప్రతీక్‌జైన్

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:**రాజీవ్ యువ వికాస పథకం అమలుకు అధికారులు అప్రమత్తంగాఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. బుధవారం దృశ్యమాధ్యమం ద్వారా ఎంపిడిఓలను, తహసీల్దార్లను,మున్సిపల్ కమిషనర్‌లన్లుతో జిల్లా కలెక్టర ప్రతీక్‌జైన్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మండల కేంద్రములో రాజీవ్ యువ వికాస కేంద్ర ఏర్పాటు చేసి రాజీవ్ యువ వికాస కేంద్రం ద్వారా లబ్ధి దారులనుండి దరఖాస్తులు స్వీకరించాలని అదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తుందని అందుకుగాను అధికారులు అప్రమత్తంగా ఉండి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, నిరుదోగ్య యువత వారి కాళ్లపై వారు నిలబడాలన్న మహోన్నత ఆశయంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి పది వేల కోట్ల ఖర్చు చేస్తుంది అని, అధికారులు మనుసు పెట్టి పని చేయాలని ఆదేశించారు. కుల ఆదాయ ధృవీకరణలను తహసీల్దార్‌లు వెంటనే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. 50వేల వరకు లబ్ధిదారులకు వారం రోజుల పాటు,రెండు లక్షల నుండి 4లక్షల వరకు ప్రయోజనం పొందిన వారికి నెలరోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని,శిక్షణ పూర్తి చేయాలని ఆదేశించారు. సమస్యను పరిష్కరించడానికి ప్రతి మండలంలో ఓక యువ అధికారిని నియమించాలని అదేశించారు. సన్నబియ్యం పథకం అందరికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీలర్లు సన్న బియ్యం కాకుండా దొడ్డు బియ్యం ఇస్తే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్ , డిఆర్‌డిఓ శ్రీనివాస్, నవీన్, హనుమంతురావు, కమలకర్‌రెడ్డి పాల్గొన్నారు.



**బలహీనవర్గాల పోరాట పటిమ సర్దార్ పాపన్నగౌడ్**
బడుగు బలహీనవర్గంల పోరట పటిమ అని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సర్దాయి పాపన్నగౌడ్ వర్దంతి సందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ బహుజన రాజ్యాన్ని స్థాపించిన మొట్టమొదటి మహాయోదుగు సర్దార్ సర్వాయి పాపన్న అన్నారు. సాధారణ కుటుంబంలో జన్మించి గీత కార్మికుడిగా తన ప్రస్థానంలో భాగంగా అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పోరాటంచేసిన మహాయోధుడు అన్నారు.

## బాలుడు చికిత్స పొందుతూ మృతి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** రోడ్డు ప్రమాదంలో సోమవారం గాయపడిన బాలుడు బుధవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ హరిందర్ తెలిపారు. చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బిఎన్ రెడ్డి కాలనీకి చెందిన పుల్లారావు(32)తన బార్య ఇద్దరు కుమారులతో కలసి చర్లపల్లి వైపు దిచక్ర వాహనం(ఏపి 09 ఏఎన్ 1691)పై వెళ్తుతుండగా ఇన్నోవా కారు(టిఎన్ 07 యుహెచ్ 656 2) కారు డ్రైవర్ నిర్లక్షంగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో పుల్లారావు అక్కడిక్కడే మృతి చెందాడు. గాయపడి చికిత్స పొందుతున్న కుమారుడు రాజేష్(6) నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు.

## సర్వాయి పాపన్న గౌడ్ అడుగు జాడల్లో పోరాడాలి
### బొడ్డుపల్లి కృష్ణ

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మొగలాయి పాలకులు ఆక్రమించుకొన్న తెలంగాణా విముక్తి కోసం పోరాటం చేసిన సర్వాయి పాపన్న గౌడ్ అడుగు జాడల్లో బహుజనులు చైతన్యవంతులై కదలాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సభ్యుడు బొడ్డుపల్లి కృష్ణ పిలుపిచ్చారు. సిపిఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయం ఎస్ఎ డాంగే భవన్ లో ఉడుతల మల్లేష్ అధ్యక్షతన బుధవారం పాప న్న 374వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పాపన్న చిత్రపటాని కి పూలమాలలు వేసి ఘనం గా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బి.అఖిల్, మల్లేష్, రవి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.





**మల్లాపూర్‌లో....**మల్లాపూర్ డివిజన్‌లోని ఓల్డ్ మల్లాపూర్ ప్రాంతంలోని కౌండిన్య భవన్ వద్ద సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దంతూరి రాజు గౌడ్, శ్రీనివాసగౌడ్, అశోక్ గౌడ్, ప్రసాద్, సాయి, సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టరేట్‌లో నివాళులు :** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 374వ వర్థంతి కార్యక్రమం నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా వెనుక బడిన తరగతుల అభివృద్ధి శాఖాధికారి టి.ఝాన్సిరాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎల్, రామ్మోహన్, జిల్లా ఎస్‌సి అభివృద్ధి శాఖాధికారి జి.వినోద్, జిల్లా ట్రెజరీ అధికారి వి.వెంకటేశ్వర్లు, మేడ్చల్ జిల్లా కల్లు గీత కార్మిక సంఘ అధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.



**ఘట్‌కేసర్‌లో :** సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఒబిసి మోర్చా అధ్యక్షుడు మహేందర్, మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు బిక్కు నాయక్, ఒబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు గొంగళ్ళ మహేష్, ఒబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్ల ఆంజనేయులు గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ అచ్చిని నరసింహ, మండల అధ్యక్షులు బస్వారాజ్ గౌడ్, సురేష్ నాయక్, బ్యాంక్ మాజీ అధ్యక్షులు సారా శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు సురేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్‌లు, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నా రు.

**మల్కాజిగిరిలో:** మల్కాజిగిరిలో గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్వారి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంక్షేమ సంఘం మల్కాజిగిరి నియోజకవర్గ అధ్యక్షుడు బత్తిన నరసింహగౌడ్, ఆర్టీసీ చైర్మన్ కౌనకళ్ల నారాయణ గౌడ్, బిజెపికి చెందిన మహేష్, నవీన్, శ్రీనివాస్, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గౌడ సంఘం అధ్యక్షుడు చింతల మల్లేష్ గౌడ్, బిసి కులాల ఐక్య సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మెన రాజు గౌడ్, సుదర్శనగౌడ్, నరహరిగౌడ్, సతీష్‌గౌడ్, కామేశ్వర గౌడ్,బాలరాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాసరెడ్డి, కౌండిన్య సంక్షేమ సంఘానికి చెందిన వెంకన్న గౌడ్, తదితరులు పాల్గొన్నా రు.



## వ్యక్తిని ఢీకొట్టిన కంటైనర్

**ప్రజాపక్షం/నాగారం:** ఔటర్ రింగ్ రోడ్డుపై కారు డ్రైవర్‌ను కంటైనర్ ఢీకొట్టి వ్యక్తి మృతి చెందిన సంఘట న కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం ఓఆర్ ఆర్ మొబైల్ ద్వారా పిఎస్‌కు సమాచారం వచ్చింది. వివరాల్లోకి వెళ్తే శంషాబాద్ ఎయిర్ పోర్టు నుండి మంచిర్యాల్‌కు వెళ్తున్న కారు(టిఎస్ 02 ఇఇ 6302) కీసర శామీర్‌పేట్ 69 800 మైల్‌స్టోన్ వద్ద కారు డ్రైవర్ మారేందుకు కారును ఆపారు. వెనకాల నుండి వచ్చిన కంటైనర్ ఢీకొట్టడంతో కారు డ్రైవర్ విజయ్ అక్కడిక్కడే మృతి చెందాడు.

గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించామని సిఐ తెలిపా రు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ముగిసిన పదో తరగతి పరీక్షలు



**ప్రజాపక్షం/కొందుర్గు:** కొందుర్గు మండలంలో బుధవారం పదో పరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏ పరీక్ష కేంద్రంలో 163 మంది విద్యార్థులకు గాను, 163 మంది హజరుకాగా, బి పరీక్ష కేంద్రంలో 162 మంది విద్యార్థులకు గాను, ఒక విద్యార్థి గైరాజరుతో 161 మంది విద్యార్థులు పరీక్షలకు హజరైనట్లు ఎంఈవో గాయత్రిదేవి తెలిపారు. గత నెల 21న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు బుధవారంతో ముగిశాయి.

## నేడు, రేపు సిపిఐ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులు

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** సిపిఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఏప్రిల్ 3,4 తేదీలలో నాగోల్ బండ్లగూడలోని నవచేతన విజ్ఞాన సమితి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. శిక్షణ తరగతుల ప్రారంభ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. రెండు రోజుల రాజకీయ శిక్షణ తరగతులు విజయవంతం చేయడానికి సభ్యులు రెండు రోజులకు తగిన ఏర్పాట్లతో హాజరు కావలసిందిగా వారు కోరారు.

## మేలో మున్నూరు కాపుల గర్జన



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మున్నూరు కాపుల గర్జన మే నెలలో నిర్వహించన్నుట్టు మున్నూరు కాపు గర్జన సన్నాహక కమిటీ రాష్ట్ర కో–ఆర్డినేటర్లు కొత్త లక్ష్మణ్ పటేల్, చందు జనార్దన్ పటేల్ తెలిపారు. సభకు సంబంధించి సన్నాహక సమావేశం ఈనెల 13న జలవిహార్‌లో ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ ఈ పోరు గర్జనలో అన్ని రాజకీయ పార్టీల నుంచి ఎంఎల్ఏలు, ఎంపిలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో మున్నూరుకాపు సంఘం అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ సర్దార్ పుటం పురుషోత్తం పటేల్, ప్రముఖ మెజీషియన్ సామల వేణు, మున్నూరుకాపు మహాసభ అధ్యక్షులు మణికొండ వెంకటేశ్వర్లు, ఎడ్ల రవి పటేల్, బండి పద్మ, బండి సంజీవ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు మంత్రి వర్గంలో చోటు కల్పించాలని కోరుతూ ఈ నెల 5న ఇందిరాపార్కు వద్ద దీక్ష చేపట్టనున్నట్టు ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ అల్లారం రత్నయ్య మాదిగ తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 32 లక్షలకుపైగా ఉన్న మాదిగలను అన్ని రాజకీయ పార్టీలను చిన్నచూపు చూస్తున్నాయన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా మాదిగలను పట్టించుకోలేదన్నారు. దశాబ్దాల కల ఎస్‌సి వర్గీకరణను నెరవేర్చిన సిఎం రేవంత్‌రెడ్డి మాదిగలను మంత్రి పదవి ఇచ్చేలా చొరవ చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ జిల్లాల కో–ఆర్డినేటర్లు పెద్దాల లింగన్న, స్వామిదాస్, అల్లారం సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీహాళ్ల అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు కమ్యూనిటీ హాళ్లు ఎంతగానో ఉపయోగపడతాయని, వీటి అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేస్తున్నదని కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా.కోట నీలిమ అన్నారు. అమీర్‌పేట డివిజన్ పరిధిలోని బిజెఆర్ నగర్–1 కమ్యూనిటీ హాల్ మరమ్మతులు, నిర్వహణ పనులను రూ.12.50లక్షల వ్యయంతో పూర్తిచేశారు. ఈ సందర్భంగా నీలిమ కమ్యూనిటీ హాల్‌ను బుధవారం పరిశీలించారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో అమీర్‌పేట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి నీలిమ పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కెజిబివిలో తాగునీటి సమస్య తీర్చుతాం



**ప్రజాపక్షం/కొందుర్గు:** మండల పరిధిలోని పులుసుమామిడి కెజిబివిలో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చుతామని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఎ.కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పులుసుమామిడి కెజిబివిని కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. పాఠశాలలోని 9మంది విద్యార్థులను ఎలుకలు కరిచిన నేపథ్యంలో వీరు పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్య సిబ్బంది లూథియా, రాఘవులును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలను సందర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు కందుకంల రాములు గౌడ్, కె.జహంగీర్, బి.నరేందర్, జిబి కృష్ణ, మల్లయ్య, బి.రవి పాల్గొన్నారు.
**పాఠశాలను సందర్శించిన ఉన్నతాధికారులు...** పులుసుమామిడి కెజిబివి పాఠశాలలో విద్యార్థులను ఎలుకలు కరిచిన నేపథ్యంలో బుధవారం కెజిబివి పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు, జిసిడిఒ సుజాత, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, ఎంపిడిఒ అనురాధ, ఎఇఒ గాయత్రిదేవి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి, వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలను అధికారులు పరిశీలించారు.

## ఘనంగా వార్షిక బ్రహోత్సవాలు

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** భూలక్ష్మీ దేవి, గణపతి స్వామి, వేణుగోపాల స్వామి వార్ల 6వ వార్షిక బ్రహోత్సవాలను బుధవారం గాంధీనగర్ సౌత్ కాలనీ వాసులు ఘనంగా నిర్వహించారు. బ్రహోత్సవాలకు ముఖ్య అతిథిగా బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు భగవంతుని ఆశీస్సులు అందరికీ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, సురేష్ కుమార్, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పురోగతిలోనే 'రియల్' రంగం



గత సంవత్సరం కంటే పెరిగిన అనుమతులు
13421 భవన నిర్మాణ అనుమతులు జారీ
వీటి ద్వారా జిహెచ్ఎంసికి రూ.1138.44 కోట్ల ఆదాయం
వార్షిక నివేదికను వెల్లడించిన జిహెచ్ఎంసి టౌన్‌ప్లానింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రియల్ ఎస్టేట్ రంగం పురోగతి కొనసాగుతోంది. రియల్ ఎస్టేట్ రంగం కుదేలైనట్లు ప్రచారం జరుగుతోంది. కానీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మాత్రం స్థిరంగా కొనసాగుతోంది. ఇందుకు 2024–25 సంవత్సరంలో మంజూరు చేసిన భవన నిర్మాణ అనుమతుల జారీనే ప్రత్యక్ష నిదర్శనంగా పేర్కొనవచ్చు. మొత్తం 13421 భవన నిర్మాణ అనుమతులు జారీ చేయడం ద్వారా జిహెచ్ఎంసికి రూ.1138.44 కోట్ల వార్షిక ఆదాయం సమకూరింది. 2022–23, 2023–24 సంవత్సరాలలో ఇంచుమించు నిర్మాణ అనుమతులు, వసూలైన రుసుము దాదాపు సమానంగా నమోదయ్యాయి. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కావడంతో 2024–25 ఆర్థిక సంవత్సరం గణాంకాలను జిహెచ్ఎంసి పట్టణ ప్రణాళిక విభాగం( టౌన్ ప్లానింగ్) బుధవారం వివరాలు వెల్లడించింది. చివరి మూడు నెలల్లో అనుమతుల జారీ ఊపందుకున్నట్లు జిహెచ్ఎంసి లెక్కల ద్వారా తేలింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మరిన్ని అనుమతులను జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని, టౌన్ ప్లానింగ్ ఆదాయాన్ని పెంచుతామని అధికారులు దీమా వ్యక్తం చేస్తున్నారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని కొండాపూర్‌లో 49 అంతస్తులతో కూడిన 9 భవనాలకు ఒకేసారి గత ఆగస్టు మాసంలో అనుమతులు మంజూరు చేశారు. ఇదే కోవలో మరో ఐదారు దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని జిహెచ్ఎంసి చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్ వెల్లడించారు.

### అత్యధిక అనుమతులు వెస్ట్ సైడే..

నివాస, వాణిజ్య కేటగిరీలతో పాటు ఆస్పత్రులు, ఐటి, ఇతరత్రా సంస్థల కేటగిరిలో జారీ అయ్యే అనుమతుల దృష్ట్యా నగరానికి పశ్చిమాన ఉన్న శేరిలింగంపల్లి జోన్ మొదటి స్థానంలో నిలిచింది. మియాపూర్ నుంచి నానక్ రామ్‌గూడ వరకు ఎక్కువ సంఖ్యలో వాణిజ్య భవనాలు అనుమతులు జారీ చేశారు. బహుళ అంతస్తుల శేరిలింగంపల్లి జోన్ నుంచే దరఖాస్తులు వస్తున్నాయి. 2022–23 సంవత్సరంలో స్థిరాస్తి రంగం గ్రేటర్ హైదరాబాద్‌లో కొంత వరకు మందగించింది. అనుమతులు, రుసుము వసూళ్లలో చోటు చేసుకున్న తగ్గుదల. తర్వాతి రెండేళ్లలో కొనసాగలేదని అధికారులు గుర్తు చేస్తున్నారు. జారీ అయిన నివాసయోగ్యపత్రాలను మినహాయిస్తే 2023–24తో పోలిస్తే 2024–25 సంవత్సరంలో 250 నిర్మాణ అనుమతులు అధికంగా జారీ చేశారు.

### బిల్డ్‌నౌలోనే కొత్త దరఖాస్తులు..

నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియను సులభతరం చేసేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 2019లో టిఎస్ బిపాస్ చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. అయితే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సాంకేతికతతో బిల్డ్‌నౌ పేరిట ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సరికొత్త విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. నెలల సమయం పట్టే బహుళ అంతస్తులు, లేఔట్, విల్లాల ప్లాన్‌లు బిల్డ్‌నౌ ద్వారా క్షణాల్లో పని పూర్తవుతోంది. జిహెచ్ఎంసిలో బిల్డ్‌నౌ విధానం ప్రయోగాత్మకంగా అధికారులు అమలు చేస్తున్నారు. ఇక నుంచి కొత్తగా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే వారు బిల్డ్‌నౌ ద్వారా చేసుకోవాల్సి ఉంటుంది. అయితే పూర్తి స్థాయిలో బిల్డ్‌నౌ అమల్లోకి వచ్చే వరకు టిజి బిపాస్ విధానం కొంతకాలం పాటు కొనసాగించనున్నారు.

## ప్రోటోకాల్ పేరుతో కాంగ్రెస్ కుట్ర రాజకీయాలు

బిఆర్ఎస్ నాయకుల విమర్శ



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్‌లు ఇంచార్జి మంత్రి పేరు అడ్డుపెట్టుకుని ఎల్‌బి నగర్ ఎంఎల్ఎ సుధీర్‌రెడ్డిని శంకుస్థాపనలకు రాకుండా కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్ కుట్ర చేస్తున్నారని, ప్రోటోకాల్ పేరుతో నియోజకవర్గ ప్రజలకు తప్పుడివ పట్టిస్తున్నారని బిఆర్ఎస్ మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా విమర్శించారు. బుధవారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంఎల్ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కృషిచేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు మిట్ట మోహన్, కామల్ల రవికుమార్, కుచ్చాల రాంబాబు, రాజేష్, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రేషన్‌షాప్‌లో ప్రధాని మోడీ చిత్రపటం



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** గరీబ్ కళ్యాణ్ యోజన పథకం ద్వారా పేదలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా నిత్యావసర సరుకులు అందజేస్తుందని బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రామకృష్ణారెడ్డి, రామిడి వీర కర్ణరెడ్డి ఆధ్వర్యంలో ప్రతి రేషన్ షాప్‌లో ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ బాలాపూర్ మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ డీలర్లు సరుకులు పంపిణీ చేసిన వెంటనే లబ్ధిదారులకు రసీదు అందించాల్సిందిగా తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో నడిగూడ యాదగిరి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అనితాప్రభాకర్, రమాదేవిశ్రీనివాస్, గూడెపు ఇంద్రసేనా, జగదీశ్వర్‌రాజు, తీగల సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉపాధి పనులు వేగవంతం

ఎంపిడిఒ నరేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/యాచారం :** గ్రామాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని ఎంపిడిఒ నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పని అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలన్నారు. గ్రామాల్లో ఉపాధి కింద చేస్తున్న ఫాం ఫాండ్స్‌ను త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో నర్సరీలు ఎండిపోకుండా తగిన జాగ్రలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శులను అదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థవంతగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిఒ శ్రీలత,ఉపాధి ఎపిఒ లింగయ్య, ఉపాధి ఇంజనీర్ శివ శంకర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



## నిరుపేదల కడుపు నింపడమే ప్రభుత్వ ధ్యేయం



ఎమ్మెల్యే అరెకపూడీ గాంధీ



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** నిరుపేదల కడుపు నింపడమే ప్రభుత్వ ధ్యేయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడీ గాంధీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పథకాన్ని బుధవారం చందానగర్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మున్సిపాల్ కల్యాణ మండపంలో పేదవారికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్న బియ్యం అందజేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అరెకపూడీ గాంధీ, రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్, ఎంబిసి చైర్మన్ జేరిపాటి జైపాల్ హాజరై కార్డుదారులకు సన్నబియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీమతి మంజుల రఘునాథ్‌రెడ్డి, దొడ్ల వెంకటేష్, ఉప్పలపాటి శ్రీకాంత్,నార్నె శ్రీనివాస్‌రావు, డిఎస్ఒ శ్రీనివాస్, ఎఎస్ఒ పుల్లయ్య, డిఎం గోపికృష్ణ, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**షాబాద్ :** పేదలకు నాణ్యమైన సన్న బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొమరబండ గ్రామంలో కార్డుదారులకు సన్న బియ్యం అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ చైర్మన్ వెంకటయ్య, డీలర్ నరసింహ్మా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుభాష్ చంద్రబోస్, మాదవరెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## కబ్జాలో వున్న ప్రతి కుటుంబానికి ఇంటి స్థలం

సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** రామోజీ ఫిల్మ్ సిటీ ప్రభుత్వ భూమిలో కబ్జాలో వున్న ప్రతి కుటుంబానికి 60గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ ఇబ్రహీంపట్నం మండల సమితి సమావేశం మండల కార్యదర్శి మొలుగు నర్సింహ్ అధ్యక్షతన రాయపోల్ గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాలమాకుల జంగయ్య హాజరై మాట్లాడారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పోల్కంపల్లి, నాగనపల్లి, రాయపోల్, ముక్కునూర్, గ్రామాల్లోని ఇండ్లు లేని నిరుపేదలకు రామోజీ ఫిల్మ్ సిటీ కబ్జాలో వున్న సర్వే నెంబర్ 189/1,203లలో ప్రతి కుటుంబానికి 60 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఆ భూమి రామోజీ ఫిల్మ్ సిటీ ఆధీనంలో కబ్జాలో ఉందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రా చారి, రాష్ట్ర సమితి సభ్యులు కావలి నర్సింహ్మా మాట్లాడుతు ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాలను పేద ప్రజలకు ఇచ్చి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పందించి ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి పేదలకి ఇండ్ల పట్టాలిప్పించాలని కోరారు. సమావేశంలో సిపిఐ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల యాదిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు పోచమోని నీలమ్మ, మండల కార్యదర్శి మొలుగు నర్సింహ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివరాల లక్ష్మయ్య, నాయకులు బండ నర్సింహ్, హనుమండ్ల శ్రీహరి, అంజయ్య, సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 21,22వ తేదీలలో శంషాబాద్‌లో భవన కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ఈనెల 21, 22వ తేదీలలో శంషాబాద్‌లో జరిగే తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి, మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు. బుధవారం సరూర్‌నగర్ ఎస్‌పి డాంగే భవన్‌లో ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యధర్శి ప్రవీణ్‌కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రసాద్‌లతో కలిసి పానుగంటి పర్వతాలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది కార్మికులకు పనిలో భద్రత లేకుండా పోయిందన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన, అంగవైకల్యం చెందిన ఆదుకునే నాధుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వలస కార్మికులకు సేఫ్టీ పరికరాలు ఇవ్వకుండా బహుళ అంతస్తులలో పనులు చేయిస్తూ అతి తక్కువ జీతాలు ఇస్తున్నారన్నారు. వలస కార్మికులను శ్రమదోపిడీకి గురి చేస్తున్న కార్పోరేట్ బహుళ నిర్మాణ కంపెనీల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎల్‌బినగర్ ఎఐటియుసి నాయకులు రాములుగౌడ్, మద్దిలేటి, అంకన్న, వీరస్వామి పాల్గొన్నారు.

# బహుజనయోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్

రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** సొంత సైన్యాన్ని సమకూర్చుకుని మొఘలాయిలను ఎదురించిన మొట్టమొదటి బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్ఒ)సంగీత అన్నారు. బుధవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ భవనంలోని బిసి సంక్షేమ శాఖ కార్యాలయంలో బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సర్దార్ సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం అన్నారు. సొంత సైన్యాన్ని సమకూర్చుకుని మొఘలాయిలను ఎదురించిన మొట్టమొదటి తెలంగాణ రాజు సర్దార్ సర్వాయి పాపన్న అన్నారు. తెలంగాణ ప్రజలందరికీ సర్వాయి పాపన్న గౌడ్ ఆదర్శ ప్రాయుడని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి బి.కేశురామ్, కలెక్టరేట్ ఎఒ సునీల్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు పి.రమేష్, వై.మాధవ రెడ్డి, కుల సంఘం నేతలు బోయపల్లి సుధాకర్ గౌడ్,నర్సింహ గౌడ్, బండి రాజుగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.





### బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి

**సరూర్‌నగర్ :** బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని సరూర్‌నగర్ గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి కందికంటి శ్రీధర్‌గౌడ్ అన్నారు. లింగోజిగూడ డివిజన్‌లోని సరూర్‌నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ మొగల్ పాలకుల అరాచకాలపై తిరుగుబాటు చేసి తన ప్రాంతానికి స్వాతంత్ర్యం ప్రకటించుకున్న యోధుడు పాపన్నగౌడ్ అన్నారు. కార్యక్రమంలో జి.దయానంద్‌గౌడ్, స్వామిగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, రాజ్‌కుమార్‌గౌడ్, నాగేష్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, ప్రసాద్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రీడ

# బట్లర్ మెరుపులు..



17.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి.. 170 పరుగులు చేసి.. 8 వికెట్ల తేడాతో గుజరాత్ గెలుపు

## హ్యాట్రిక్‌పై కన్నేసిన ఆర్సీబీకి గుజరాత్ షాక్

హ్యాట్రిక్‌పై కన్నేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు షాక్ తగిలింది. ఐపీఎల్ 18లో గుజరాత్ టైటాన్స్ వరుసగా రెండో విజయం సాధించింది. ఆర్సీబీతో జరిగిన పోరులో ఆ జట్టు 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఆర్సీబీ నిర్దేశించిన 170 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ 17.5 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జోస్ బట్లర్ (73*: 39 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు) చెలరేగిన వేళ గుజరాత్ ఆడుతూ పాడుతూ గెలుపొందింది. మరో బ్యాటర్ సాయిసుదర్శన్ (49: 36 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) మరోసారి విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. రుథర్‌ఫర్డ్ (30*: 18 బంతుల్లో) పరుగులు చేశాడు. బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, జోష్ హేజల్‌వుడ్ ఒక్కో వికెట్ తీశారు.

తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. లియామ్ లివింగ్‌స్టోన్ (54; 40 బంతుల్లో 1 ఫోర్, 5 సిక్స్‌లు) అర్ధ శతకం చేశాడు. జితేశ్ శర్మ (33; 21 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్), టిమ్ డేవిడ్ (32; 18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. విరాట్ కోహ్లీ (7), దేవ్‌దత్ పడిక్కల్ (4), కృనాల్ పాండ్య (5) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఫిల్ సాల్ట్ (14), రజత్ పటీదార్ (12) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. గుజరాత్ బౌలర్లలో మహ్మద్ సిరాజ్ (3/19) అదరగొట్టాడు. సాయి కిశోర్ 2, అర్షద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ, ఇషాంత్ శర్మ ఒక్కో వికెట్ పడగొట్టారు.

### చివర్లో లివింగ్‌స్టోన్, టిమ్ డేవిడ్ మెరుపులు

ఆరంభంలో ఆచితూచి ఆడిన లివింగ్‌స్టోన్ చివర్లో బ్యాట్ ఝుళిపించాడు. రషీద్ ఖాన్‌ను లక్ష్యంగా చేసుకుని సిక్సర్లు బాదాడు. రషీద్ వేసిన 16 ఓవర్‌లో లివింగ్‌స్టోన్ ఒక సిక్స్, టిమ్ డేవిడ్ ఒక ఫోర్ బాదారు. సాయి కిశోర్ వేసిన 17 ఓవర్‌లో డేవిడ్ సిక్స్ కొట్టాడు. ఇక, రషీద్ ఖాన్ వేసిన 18 ఓవర్‌లో లివింగ్‌స్టోన్ మూడు సిక్సర్లు బాదేశాడు. 19 ఓవర్‌లో సిరాజ్.. లివింగ్‌స్టోన్ ఔట్ చేసి నాలుగే పరుగులు ఇచ్చాడు. ప్రసిద్ధ్ వేసిన చివరి ఓవర్‌లో టిమ్ డేవిడ్ వరుసగా 4, 6, 4 బాదాడు. చివరి బంతికి అతను క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. చివరి ఐదు ఓవర్లలో ఆర్సీబీ 63 పరుగులు రాబట్టింది.

టీమిండియా హోమ్ షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రకటించింది. ఈ ఏడాది సొంతగడ్డపై ఆడబోయే మ్యాచ్‌ల వివరాలను బుధవారం వెల్లడించింది. వెస్టిండీస్‌తో రెండు టెస్ట్‌ల సిరీస్‌తో టీమిండియా



## టీమిండియా హోమ్ షెడ్యూల్..

# హైదరాబాద్‌లో నో మ్యాచ్!

హోమ్ సీజన్ ప్రారంభం కానుంది. అహ్మదాబాద్ వేదికగా అక్టోబర్ 2 నుంచి 6 మధ్య తొలి టెస్ట్, అక్టోబర్ 10 నుంచి 14 మధ్య కోల్‌కతా వేదికగా రెండో టెస్ట్ జరగనుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 202527 సైకిల్‌లో భాగంగా ఈ సిరీస్ జరగనుంది.

అనంతరం సౌతాఫ్రికాతో రెండు టెస్ట్‌లు, మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్‌ను టీమిండియా ఆడనుంది. నవంబర్ 1418 మధ్య న్యూఢిల్లీ వేదికగా తొలి టెస్ట్ మ్యాచ్ జరగనుండగా.. గువహతి వేదికగా నవంబర్ 22 నుంచి 26 మధ్య రెండో టెస్ట్ జరగనుంది. మూడు వన్డేల సిరీస్ నవంబర్ 30 నుంచి ప్రారంభం కానుంది. రాయ్ పూర్ వేదికగా డిసెంబర్ 3న రెండో వన్డే, వైజాగ్ వేదికగా డిసెంబర్ 6న మూడో వన్డే జరగనుంది.

డిసెంబర్ 9 నుంచి 19 వరకు ఐదు టీ20ల సిరీస్ జరగనుంది. కటక్ వేదికగా డిసెంబర్ 9న తొలి టీ20, 11న ఛండీఘర్ వేదికగా రెండో టీ20, 14న ధర్మశాలలో మూడో టీ20, లక్నో వేదికగా 17న నాలుగో టీ20, అహ్మదాబాద్ వేదికగా డిసెంబర్ 19న ఐదో టీ20 జరగనుంది. టీమిండియా హోమ్ షెడ్యూల్‌లో మొత్తం 12 మ్యాచ్‌లు జరగనుండగా.. హైదరాబాద్‌కు ఒక్క మ్యాచ్ కేటాయించలేదు. వైజాగ్ వేదికగా మాత్రం ఒకే ఒక్క మ్యాచ్ జరగనుంది. సౌతిండియా క్రికెట్ మైదానాల్లో వైజాగ్ మాత్రమే ఒక్క మ్యాచ్ కేటాయించారు. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై, తిరువనంతపురం మైదానాలకు ఒక్క మ్యాచ్ కేటాయించలేదు.

**వెస్టిండీస్:**

తొలి టెస్ట్ అక్టోబర్ 2 నుంచి 6 వరకు, అహ్మదాబాద్.
2వ టెస్ట్ అక్టోబర్ 10 నుంచి 14 వరకు, కోల్‌కతా.

**సౌతాఫ్రికాతో టెస్ట్ సిరీస్:**

తొలి టెస్ట్ నవంబర్ 14 నుంచి 18 వరకు, ఢిల్లీ.
రెండో టెస్ట్ నవంబర్ 22 నుంచి 26 వరకు, గౌహతి.

**సౌతాఫ్రికాతో వన్డే సిరీస్:**

తొలి వన్డే నవంబర్ 30, రాంచీ.
రెండో వన్డే డిసెంబర్ 3, రాయ్‌పూర్.
మూడో వన్డే డిసెంబర్ 6, వైజాగ్.

**సౌతాఫ్రికాతో టీ20 సిరీస్:**

తొలి టీ20 డిసెంబర్ 9, కటక్.
రెండో టీ20 డిసెంబర్ 11, చండీగఢ్.
మూడో టీ20 డిసెంబర్ 14, ధర్మశాల.
నాలుగో టీ20 డిసెంబర్ 17, లక్నో.
ఐదో టీ20 డిసెంబర్ 19, అహ్మదాబాద్.



## 'పెద్ది' గ్లింప్స్ ట్రీట్ థియేటర్స్‌లో?

ప్రస్తుతం మన టాలీవుడ్ నుంచి రాబోతున్న లేటెస్ట్ అవైటెడ్ చిత్రాల్లో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా టాలెంటెడ్ దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న భారీ చిత్రం పెద్ది కూడా ఒకటి. అయితే ఈ చిత్రం నుంచి రీసెంట్‌గా వచ్చిన ఫస్ట్ లుక్ పోస్టర్స్ సాలిడ్ రెస్పాన్స్‌ని కూడా అందుకోగా ఈ తర్వాత రామ నవమి కానుకగా మేకర్స్ గింప్స్‌ని కూడా రిలీజ్ చేయనున్నట్టు కన్ఫర్మ్ చేశారు. మరి ఈ గ్లింప్స్ ఇపుడు థియేటర్స్‌లో కూడా ట్రీట్ ఇచ్చే ఛాన్స్ ఉన్నట్టుగా తెలుస్తుంది. ఈ ఏప్రిల్ 6న గ్లింప్స్ ఆన్లైన్‌లో వచ్చాక 10న థియేటర్స్‌లో రిలీజ్ కాబోతున్న మైత్రి మూవీ మేకర్స్ చిత్రాలు జాట్ అలాగే గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలతో కలిపి పెద్ది గ్లింప్స్ అటాచ్ చేసే ఛాన్స్ ఉన్నట్టుగా తెలుస్తుంది. ఎలాగో పెద్ది సినిమాని మైత్రి మూవీ మేకర్స్ సమర్పణలో తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. సో ఆ ఛాన్స్ ఉన్నట్టుగా తెలుస్తుంది.

రీల్



# శ్రీలీల.. జర జాగ్రత్త!

తెలుగులో వరుస హిట్లతో అతి తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సంపాదించుకున్న శ్రీలీల బిజీ హీరోయిన్‌గా మారింది. అవకాశాలు పలకరిస్తూ ఉన్నా కూడా అవన్నీ కూడా బాక్సాఫీస్ దగ్గర తేలిపోతున్నాయి. స్కంద, ఆదికేశవ, ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్ ఇలా శ్రీలీల నటించిన అన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి. ఆ తర్వాత వచ్చిన గుంటూరు కారం సినిమాతో ఓ హిట్ పడింది. కానీ ఈ సినిమా శ్రీలీలకు అంత ప్లస్ కాలేదు. పుష్ప 2లో కిస్సిక్ పాటతో కాస్త అలరించింది. ఇక ఇటీవల నితిన్ హీరోగా తెరకెక్కిన రాబిన్ హుడ్ సినిమాతో ఆడియన్స్ ముందుకు వచ్చింది. ఈ మూవీకి మిశ్రమ స్పందన వచ్చింది. ఈ మధ్య కాలంలో శ్రీలీలకి హిట్ అనేదే పడడం లేదు. ఇలానే చేసుకుంటూ పోతే కెరీర్‌లో పట్టుమని పది సినిమాలు కూడా చేయకుండానే ఫేడ్ అవుట్ కావల్సి వస్తుంది. ఇప్పటికైన శ్రీలీల జాగ్రత్త పడాలి. త్వరలో రవితేజతో కలిసి మాస్ జాతర అనే సినిమాతో ప్రేక్షకులని పలకరించనుంది. కార్తీక్ ఆర్యన్ సరసన డెబ్యూ చేస్తూ నటిస్తున్న బాలీవుడ్ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతోంది.

## 'మ్యాడ్' స్టార్‌తో మెగా డాటర్ మూవీ



మ్యాడ్ చిత్రానికి టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ రెస్పాన్స్ దక్కిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' రాగా, ఇది బాక్సాఫీస్ దగ్గర సాలిడ్ వసూళ్లతో దూసుకెళ్తోంది. ఈ సినిమాను దర్శకుడు కల్యాణ్ డైరెక్ట్ చేశారు. కాగా, ఇందులోని కామెడీ ఎలిమెంట్స్, ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్నాయి. ఈ సినిమాలో హీరోలుగా నటించిన రామ్ నితిన్, నార్నె నితిన్, సంగీత్ శోభన్ తమ కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. ఇక ఈ సినిమాలో నటించిన సంగీత్ శోభన్ ప్రస్తుతం ఓ కొత్త సినిమాను స్టార్ట్ చేశారు. మెగా డాటర్ నిహారిక ప్రొడక్షన్ కంపెనీ ది పింక్ ఎలిఫెంట్స్ బ్యానర్‌లో సంగీత్ శోభన్ తన నెక్స్ట్ మూవీని స్టార్ట్ చేశారు. నిహారిక సరసన సంగీత్ శోభన్ నటిస్తుండటంతో ఈ కాంబినేషన్ ఎంతమేర అలరిస్తుందో చూడాలి. ఇక ఈ సినిమాను మానసా శర్మ డైరెక్ట్ చేయనున్నారు. మరి ఈ సినిమాలో నిహారిక, సంగీత్ శోభన్ కెమిస్ట్రీ ఎలా ఉండబోతుందో చూడాలి. ఈ చిత్ర షూటింగ్ త్వరలో షూటింగ్ ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సిద్ధమవుతోంది.

## 'జాట్' నుంచి అదిరిన ఫస్ట్ సింగిల్




బాలీవుడ్ స్టార్ హీరో సన్నీ డియోల్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ అవైటెడ్ చిత్రం 'జాట్' కోసం అందరికీ తెలిసిందే. మన టాలీవుడ్ స్టార్ దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కించిన ఈ చిత్రం ఇపుడు రిలీజ్‌కి రాబోతుంది. ఇక ఈ సమయంలో మేకర్స్ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ని రిలీజ్ చేశారు. టచ్ కియా అంటూ సాగే ఈ సాంగ్‌ని థమన్ సాలిడ్ బీట్స్‌తో కొట్టాడని చెప్పాలి. ఇక ఈ స్పెషల్ సాంగ్‌లో ప్రముఖ బ్యూటీ ఊర్వశి రౌటేలా ఇందులో కనిపించడం విశేషం. ఇక ఈ సాంగ్‌కి జానీ మాస్టర్ డాన్స్ కంపోజ్ చేయగా తన కొరియోగ్రఫీ ఈ సాంగ్‌కి పర్ఫెక్ట్‌గా ఉందని చెప్పవచ్చు. ఇక ఈ సాంగ్‌లో బాలీవుడ్ నటుడు రణదీప్ హుడా అలాగే యంగ్ నటి రెజీనా కాసాండ్రా కూడా కనిపిస్తున్నారు. మంచి పార్టీ అండ్ సెలబ్రేషన్ సాంగ్‌గా ప్లాన్ చేసిన ఈ సాంగ్‌లో సన్నీ డియోల్ ప్రెజెన్స్ అయితే లేనట్టే ఉందని చెప్పాలి. మొత్తానికి అయితే హిందీ ఆడియెన్స్‌కి ఈ సాంగ్ నచ్చే రేంజ్‌లో అనిపిస్తుంది. ఇక ఈ అవైటెడ్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ చిత్రం ఈ ఏప్రిల్ 10న గ్రాండ్‌గా రిలీజ్ కి రాబోతుంది

## వాయుసేన ఓకె

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనకు భారత వాయుసేన అధికారులు సుముఖతవ్యక్తం చేయడంతో పాటు.. అక్కడ భవిష్యత్తులో వాయుసేన శిక్షణా కేంద్రాన్ని నెలకొల్పే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు లేఖలో తెలిపారని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. అంతేకాదు, తెలంగాణ ప్రభుత్వానికి పౌర విమాన సేవలను ప్రారంభించేందుకు కావాల్సిన అనుమతులు మంజూరీ చేస్తున్నట్లు వాయుసేన అధికారులు లేఖ ద్వారా తెలిపినట్టు ఆయన వివరించారు. ఈ విమానాశ్రయాన్ని పౌర విమానయానానికి ఎయిర్ ఫోర్స్ విమానాల రాకపోకలకు అనుగుణంగా ఒక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్‌గా అభివృద్ధి చేయాలని వాయుసేన సూచించినట్టు తెలిపిన మంత్రి.. పౌర విమానాల రాకపోకలకు అనువుగా రన్వే పునర్నిర్మాణం చేయడం, పౌర టర్మినల్ ఏర్పాటు, ఎయిర్‌క్రాఫ్ట్ ఎప్రాన్ (విమానాలు నిల్చోవడానికి, మలుపులు తిరగడానికి ఇతర విమానయాన కార్యకలాపాలకు ఉపయోగించే నిర్దిష్ట ప్రాంతం) వంటి ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేయడం వంటి పనులు చేయాల్సి ఉందని ఆయన తెలిపారు. ఇందుకు అవసరమైన భూమిని ఎయిర్పోరట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (AAI)కు సమకూర్చుకోవాలని వాయుసేన అధికారులు లేఖలో సూచించినట్టు మంత్రి తెలియజేశారు. అంతేకాదు, ఎయిర్ పోర్ట్ కు అవసరమైన అన్ని అనుమతులు పొందేందుకు ఎయిర్పోట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డిటెయిల్ ప్రపోజల్స్ ను భారత వాయుసేనకు సమర్పించాలని కోరినందున అందుకు సంబంధించిన తదుపరి కార్యాచరణను అధికారులతో సమీక్షిస్తున్నామని అతిత్వరలోనే అన్ని వివరాలతో కూడిన నివేదికను రూపొందించి కేంద్రానికి, సంబంధిత విభాగాలకు సమర్పిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో మొన్న మామునూర్, నేడు ఆదిలాబాద్ ఎయిర్ పోర్టులకు అనుమతుల మంజూరీలో సహకరిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకి, రాష్ట్రంలో ఏయిర్ పోర్ట్ ల ఏర్పాటుకు అండగా నిలబడుతున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



## దేశంలో మీడియా స్థితిగతుల అధ్యయనం కోసం

# మీడియా కమిషన్

### ఏర్పాటు తక్షణావసరం : ఐజెయు

**చెన్నై:** మీడియా రంగంలో ప్రవేశిస్తున్న తాజా సాంకేతిక మార్పులను దృష్టిలో ఉంచుకుని, మీడియా స్థితిగతుల అధ్యయనం కోసం తక్షణం మీడియా కమిషన్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని విభిన్న జీవన రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు అభిప్రాయ పడ్డారు. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) రెండురోజుల జాతీయ కార్యవర్గ సమావేశం చెన్నై వేపేరిలోని వై.ఎం.సి.ఎ. మినీ ఆడిటోరియంలో బుధవారం ప్రారంభం అయ్యింది. ఐజెయు జాతీయ అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ మీడియాలో కృత్రిమమేధ వంటి నూతన సాంకేతికత ప్రవేశిస్తున్న నేపథ్యంలో మీడియా రంగం పనిలో పలు మార్పులు చోటు చేసుకుంటున్నాయన్నారు. సోషల్ మీడియా విస్తరించడంతో మీడియా పని తీరుపై దాని ప్రభావం కూడా పెరిగిందన్నారు. మీడి యా పనిలో, వర్కింగ్ జర్నలిస్టుల పని పరిస్తితుల్లో అనూహ్యమైన, సమూలమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఆయన వివరించారు. మారిన పరిస్తితుల్లో మీడియా స్థితిగతులను అధ్యయనం చేయడానికి మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్న తమ చిరకాల డిమాండ్‌కు మరింత ప్రాధాన్యం ఏర్పడిందన్నారు. దీనిపై ఐజెయు జాతీయ కార్యవర్గ సమావేశాలలో చర్చిస్తున్నామని తెలిపారు. దీనిపై పౌర సమాజంలో కూడా చర్చ జరగాలని విజ్ఞప్తి చేశారు. డి.ఎం.కె. సీనియర్ నేత, రాజ్యసభ పూర్వ సభ్యులు టికెఎస్. ఇలంగోవన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛ కీలకమైనదనీ, అలాగే ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛకు కూడా ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రతీ ఐదేళ్లకూ పాలకులను ఎన్నుకునే లేదా మార్చుకునే అవకాశం ప్రజాస్వామ్యంలో మాత్రమే ప్రజలకు ఉంటుందని, రాచరికంలో అలాంటి అవకాశం ఉండదని అన్నారు. మీడియా స్వేచ్ఛకు అవరోధం కల్గించే ఎలాంటి చర్యలనైనా ప్రతిఘటించాలని కోరారు. గత కొన్నేళ్లుగా మీడియాలో వచ్చిన మార్పులను అధ్యయనం చేయడానికి మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఇలంగోవన్ డిమాండ్ చేశారు.

బిజెపి సీనియర్ నేత, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ పూర్వ మంత్రి తొంభై ఎనిమిదేళ్ల డా.హెచ్.వి. హండే మాట్లాడుతూ ఒక పక్క సోషల్ మీడియా ధోరణులు ప్రమాదకరంగా తయారవుతుంటే, మరోపక్క కొత్తగా కృత్రిమ మేధ అనే భూతం వచ్చి పడిందని ఇది మీడియా రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కృత్రిమ మేధను ప్రభుత్వ ప్రచారానికి వినియోగించడం తప్పని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయమై తన అభిప్రాయాన్ని ప్రభుత్వ పెద్దలకు రాశానని తెలిపారు.

అన్నా డి.ఎం.కే. ప్రచార కమిటీ డిప్యూటీ కార్యదర్శి ప్రముఖ సినీ నటి గౌతమి మాట్లాడుతూ సోషల్ మీడియా కేవలం వ్యక్తులు తమ వ్యక్తిగత భావాలను వ్యక్తం చేసుకునే ఒక సాంకేతిక వేదిక మాత్రమేనని అందువల్ల దానిని మీడియా అంటూ గందరగోళ పడాల్సిన అవసరం లేదని అన్నారు. సోషల్ మీడియాకు జర్నలిజానికి చాలా వ్యత్యాసం ఉందన్నారు. జర్నలిజంలో విషయ పరిజ్ఞానం కలిగిన విద్యాధికులైన శిక్షణ పొందిన సిబ్బంది పనిచేస్తారని అన్నారు. జర్నలిజంలో నిలకడ, జవాబుదారీ తనం, సరిదిద్దే యంత్రాంగం ఉంటుందని, అది సోషల్ మీడియాలో చూడలేమని అన్నారు.

సీనియర్ పాత్రికేయుడు, ఆమ్ ఆద్మీ పార్టీ తమిళనాడు శాఖ కన్వీనర్ ఎస్.ఎ.ఎన్. వశీకరన్ మాట్లాడుతూ ప్రింట్ మీడియా ప్రభావం తగ్గిందన్న వాదన సరైనది కాదన్నారు. జర్నలిస్టులు సమాజంలో నిర్వహిస్తున్న బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని వారిని గౌరవించాల్సిన బాధ్యత సమాజంపై ఉందని, వారిని ప్రభుత్వాలు అన్నివిధాలా ఆదుకోవాలని కోరారు.

ది హిందూ ఎంప్లాయిస్ యూనియన్ పూర్వాధ్యక్షుడు ఇ.గోపాల్ మాట్లాడుతూ మొదటి ప్రెస్ కమిషన్ కృషితో రూపొందిన వర్కింగ్ జర్నలిస్ట్స్ చట్టాన్ని, ప్రెస్ కౌన్సిల్ ను, వేజ్ బోర్డును కేంద్ర ప్రభుత్వం నీరు కార్చిందని అన్నారు. మలేషియా నుండి అతిథిగా హాజరైన తమిళ ప్రముఖుడు తనింద్రన్ మాట్లాడుతూ జర్నలిస్టులు తమకు స్వేచ్ఛ లేదనే మానసిక సంకెళ్లను బద్దలు కొట్టుకోవాలని, సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఇంకా సమావేశంలో ఐజెయు సెక్రెటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్మూ, ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్.ఎన్. సిన్హా, దేవులపల్లి అమర్, ఎం.ఎ.మాజిద్, తదితరులు మాట్లాడారు. ప్రారంభ సమావేశంలో తమిళనాడు జర్నలిస్టుల యూనియన్ అధ్యక్షులు డిఎస్ఆర్.సుభాష్ వక్తలను వేదిక పైకి ఆహ్వానించారు. జాతీయ కార్యవర్గ సభ్యులు రమేష్ స్వాగతోపన్యాసం చేశారు. సీనియర్ పాత్రికేయులు శశికళా రవీంద్రదాస్, సినీ నటి గౌతమి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఇటీవల కన్నుమూసిన పాత్రికేయులకు సమావేశం తొలుత సంతాపం ప్రకటించింది.

కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి జాతీయ కార్యదర్శులు వై.నరేందర్ రెడ్డి, డి.సోమసుందర్, జాతీయ కార్యవర్గ సభ్యులు ఆలపాటి సురేష్ కుమార్, నగునూరి శేఖర్, డా.ఎం.ప్రసాద్, తెలంగాణా వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు కె.విరాహత్అలీ, ప్రధానకార్యదర్శి కె.రాం నారాయణ్, మోతె వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. దేశం నలుమూలల నుండి పదిహేను రాష్ట్రాలకు చెందిన జాతీయ కార్యవర్గ సభ్యులు, రాష్ట్రాల యూనియన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు.

# నిలువరించేది వామపక్షాలే

(మొదటి పేజీ తరువాయి)

కొడియెరి బాలకృష్ణన్ హాల్‌లో త్రిపుర మాజీ సిఎం మాణిక్ సర్కార్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి. దేవరాజన్ హాజరై సౌహార్ధ సందేశాలిచ్చారు. ప్రారంభ సభలో కారాత్ మాట్లాడుతూ ప్రభుత్వం, పాలక పార్టీ స్వభావాన్ని మూడు ప్రశ్నల ద్వారా అంచనా వేయవచ్చు అని, అవి ఎవరు డొనాల్ ట్రంప్ స్నేహితుడునని చెప్పుకుంటారు? గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీల సన్నిహిత స్నేహితుడు ఎవరు? ఎవరు ఆర్ఎస్ఎస్‌కు విధేయతతో ఉంటారు? అని తెలిపారు. 'ఈ మూడు ప్రశ్నలకు ఒకే సమాధానం నరేంద్ర మోదీ, బిజెపి' అని కారాత్ అన్నారు. మోదీ ప్రభుత్వం 'అమెరికా సామ్రాజ్యవాదానికి సన్నిహిత సంబంధం ఉన్న హిందూత్వకార్పొరేట్ బంధానికి' మోదీ ప్రభుత్వం ప్రాతినిధ్యం వహిస్తుందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం మూడవ సారి అధికారంలోకి వచ్చిన తరువాత 'ముస్లింమైనారిటీలను నిరంతరం లక్ష్యంగా చేసుకునే నయాఫాసిస్ట్ లక్షణాలను' ప్రదర్శిస్తోందని కారత్ అన్నారు. మైనారిటీలను లక్ష్యంగా హిందూత్వ సంస్థలు మత అల్లర్లను సృష్టిస్తున్నారని తెలిపారు. వీరికి బిజెపి పాలిత రాష్ట్రాలలో అధికారుల నుండి మద్దతు, సహాయం అందుతున్నాయని మండిపడ్డారు. సిపిఐ(ఎం) స్వతంత్రంగా బలా న్ని ఎలా పెంచుకోవాలనే ప్రధాన సమస్యను పార్టీ జాతీయ మహాసభ పరిష్కరిస్తుందని చెప్పారు. వామపక్ష ఐక్యతను ఆయన నొక్కి చెప్పారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటాన్ని విజయవంతం చేయడానికి, విస్తృత ఐక్యతను నిర్మించడానికి అన్ని లౌకిక, ప్రజాస్వామ్య శక్తులతో చేతులు కలపడానికి సిపిఐ(ఎం) కట్టుబడి ఉందని ప్రకాశ్ కారాత్ అన్నారు. వామపక్ష ఐక్యతను బలోపేతం చేయడానికి, వామపక్ష రాజకీయ ప్రమేయాన్ని విస్తరించడానికి ఇది సమయమని పేర్కొన్నారు.

**నక్సల్స్‌పై నిర్బంధానికి ముగింపు పలకాలి: దీపాంకర్ భట్టాచార్య**

సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ప్రసంగిస్తూ భారతదేశాన్ని 'నక్సల్ రహితంగా' చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌గడ్‌లోని బస్తర్‌లో ఆదివాసీలపై 'క్రూరమైన యుద్ధాన్ని' ప్రారంభించిందని విమర్శించారు.'న్యాయమైన విచారణ లేకుండా నిరవధిక నిర్బంధానికి గురైన కార్యకర్తలందరినీ విడుదల చేయాలని, ఇలాంటి అపరిమితమైన ప్రభుత్వ ఉగ్రవాదం, నిఘా పాలనకు తక్షణ ముగింపు కోసం మనం పోరాడాలి' అని ఆయన అన్నారు. అమానుష హింసాకాండకు వ్యతిరేకంగా గళం విప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందన్నారు. 'మనకు చారిత్రక భేదాలు ఉన్నప్పటికీ, భారతదేశంలోని కమ్యూనిస్టు ఉద్యమంలోని సిపిఐ(ఎం), ఇతర వర్గాలతో కలిసి గతంలో కంటే మరింత సన్నిహితంగా పనిచేయాలని సిపిఐ(ఎంఎల్)గా మేము ఆశిస్తున్నామ'ని ఆయన పేర్కొన్నారు.

**ఆదివాసీ పరిరక్షణకు ఉద్యమించాలి : మనోజ్ భట్టాచార్య**

నయా ఫాసిస్టు , నయా ఉదారవాద విధానాలపై పోరాటాలు చేయడంతో పాటు ఆదివాసీల పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆర్ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య అన్నారు. గడ్చిరోలి, బస్తర్ ప్రాంతాలలో పెద్ద ఎత్తున చోటు చేసుకుంటున్న ఎన్‌కౌంటర్‌లను ప్రస్తావిస్తూ మైనింగ్ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసం అమాయక గిరిజనులపై హింసాకాండకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

**యువతను ఆకర్షించాలి : జి.దేవరాజన్**

యువతను ప్రగతిశీల భావాలవైపు ఆకర్షించడంలో వామపక్షాలు ఆశించిన ఫలితాలను సాధించడం లేదని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్ అన్నారు. ఆ లోపాన్ని సరిదిద్దుకోవాలని, యువతను ఆకట్టుకొని, ఉద్యమాలను ఉధృతం చేయాలని, ఇందుకు సామాజిక మాధ్యమాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ట్రంప్ పరిపాలనలో అమెరికాలోని పరిస్థితితో సహా అంతర్జాతీయ పరిస్థితిపై వామపక్ష నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తూ గాజాలో ఇజ్రాయెల్ దురాక్రమణను ఏకగ్రీవంగా ఖండించారు. ఇటీవల మరణించిన సిపిఐ(ఎం) అగ్రనేతలు ఏచూరి, బుద్ధదేవ్ భట్టాచార్య, కొడియెరి బాలకృష్ణన్, ఎన్.శంకరయ్యలకు పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారాత్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అలాగే 2022లో జరిగిన మహాసభ నుంచి ఇప్పటి వరకు హమైన 22మంది పార్టీ కార్యకర్తలకు కూడా నివాళులర్పించారు.



## సూత్రప్రాయ ఐక్యతకు రావాలి : డి.రాజా

(మొదటి పేజీ తరువాయి)

మహాసభలో సౌహార్థ సందేశమిస్తూ 'కార్పొరేట్‌మతతత్వ దాడికి' వ్యతిరేకంగా నిర్ణాయాత్మక ప్రతిఘటనను పెంచడానికి కమ్యూనిస్టు, వామపక్ష శక్తులన్నిటి మధ్య సూత్రప్రాయమైన ఐక్యతను ఏర్పరచడానికి ప్రస్తుత సందర్భం పిలుపునిస్తోందని ఆయన అన్నారు. 'మనం నిస్సహాయుల గొంతుగా ఉండాలి. జై భీమ్, లాల్ సలామ్ , ఇంక్విలాబ్ జిందాబాద్ కేవలం నినాదాలు మాత్రమే కాదు' అని ఆయన అన్నారు. అవి జాతి జీవన విధానం కావాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయంగా, జాతీయంగా నెలకొన్న పరిస్థితులలో పాలకవర్గాల ప్రజావ్యతిరేక విధానాలను ఐక్యతతో ప్రతిఘటించాలన్నారు. సాంప్రదాయకంగా చేస్తున్న పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కన్నుసన్నల్లో మతతత్వ విధానాలను అమలు చేస్తోందని, అదే సమయంలో కార్పొరేట్ శక్తులకు సంపదను దోచిపెడుతుండడంతో ఒక్క శాతం ప్రజల వద్ద కనీవినీ ఎరుగని సంపద పోగుపడుతోందన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com